: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM

గుంటూరు


Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

1-11-2025
శనివారం
సంపుటి: 31
సంచిక: 270
పేజీలు: 12
వెల: 6.50

# పొలాల నుంచి వరద తోడండి



## శాటిలైట్ చిత్రాలతో గుర్తించి 24గంటల్లో పూర్తి కార్యాచరణ

### ఆస్తి నష్టంపై కేంద్రానికి ప్రాథమిక నివేదిక

### తుఫాన్ విధుల్లో ప్రతిభ చూపిన 100 మందికి సన్మానం

### టెలికాన్ఫరెన్స్‌లో అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

**విజయవాడ, అక్టోబరు 31,ప్రభాతవార్తప్రతినిధి:** మొంథా తుఫాన్‌తో రైతులు నష్టపోకుండా రాష్ట్రంలో నీట మునిగిన పంట పొలాలను యుద్ధప్రాతిపదికన కాపాడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. తుఫాన్ తదనంతర చర్యలపై శుక్రవారం ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఎక్కడెక్కడ పొలాలు నీట మునిగాయో గుర్తించి శనివారం కల్లా మొత్తం నీటిని మళ్లించాలని సీఎం స్పష్టం చేశారు. నియోజకవర్గం వారీగా శాటిలైట్ చిత్రాలను విడుదల చేసి ఎక్కడైతే నీళ్లు నిలిచిపోయాయో అక్కడకి స్థానిక ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు, అధికారులు వెళ్లి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర చాలన్నారు. అందరూ కలిసి సమన్వయంతో పని చేయడం ద్వారా క్షేత్ర స్థాయిలో ఫలితాలు రాబట్టాలని సీఎం సూచించారు. శాస్త్రవేత్తల సూచనలు తీసుకుని పంటలు నీట మునగడం వల్ల దిగుబడి తగ్గకుండా తగు విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కన్నా ఎక్కువగా 60 శాతం మేర బాపట్ల జిల్లాలోని వ్యవసాయ క్షేత్రాల్లో నీరు నిలిచిపోయిందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. బాపట్ల జిల్లాలో మాత్రం ఆదివారం నాటికి నీటి నిల్వలు లేకుండా చేస్తామని విన్నవించారు. ఇక తుఫాన్ సమర్ధవంతంగా ఎదుర్కొన్న అంశాన్ని సీఎం చంద్రబాబు కీలకంగా ప్రస్తావిస్తూ తుఫాన్ విషయంలో అవేర్2.0 వ్యవస్థకు స్టేట్ డేటాలేక్ ద్వారా అన్ని విభాగాలను అనుసంధానం చేశామన్నారు. దీని ద్వారా రియల్ టైములో నిర్ణయాలు తీసుకోవడానికి వీలు ఉంటుంది. వర్షపాతం, గాలి, పిడుగుల వంటి వాటిపై హెచ్చరికలు చేసేలా అవేర్2.0 వ్యవస్థ పని చేస్తుంది. ఈ వ్యవస్థ ద్వారా విపత్తు నిర్వహణను సమర్థవంతంగా చేపట్టవచ్చు. అలాగే రిజర్వాయర్ స్థాయిలు, ఇన్‌ఫ్లోలు, భూగర్భ జలాలు చెరువులకు సంబంధించిన రియల్ టైమ్ డేటా అందుబాటులో ఉంటుంది. దీంతో శాటిలైట్ ద్వారా వివిధ ప్రమాదాలకు సంబంధించిన హెచ్చరికలు జారీ చేసే అవకాశముంది. అవేర్2.0 వ్యవస్థ ద్వారా వచ్చే సమాచారాన్ని క్రోడీకరించుకుని ఏఐ ద్వారా విశ్లేషించి మొంథా తుఫాన్ కదలికలను కచ్చితంగా తెలుసుకోగలిగింది రాష్ట్రప్రభుత్వం. తద్వారా సహాయక చర్యలనూ వేగంగా చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న వ్యవస్థ ద్వారా 72 గంటల ముందే తుఫాన్ కదలికల్లో వచ్చిన మార్పులను గుర్తించగలిగారు. దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోగలిగారు. అలాగే ఆయా ప్రాంతాల్లోని ప్రజలనూ అలెర్ట్ చేయగలిగారు.గాలుల వేగాన్ని అంచనా విషయంలో >>2



శుక్రవారం సర్దార్ పటేల్ జయంతి సందర్భంగా గుజరాత్ కేవడియాలోని స్టాట్యూ ఆఫ్ యూనిటీ వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ప్రధాని మోడీ

# శత్రువుల ఇళ్లలోకి చొరబడి కొడతాం

### పాక్‌కు ప్రధాని మోడీ హెచ్చరిక 2లో



చింటూ | వెంకటాచలపతి | జయప్రకాష్ రెడ్డి | మంజునాథ్ తోటి | వెంకటేష్

## చిత్తూరు మేయర్ దంపతుల హత్య కేసు

# దోషులకు ఉరిశిక్ష

### దశాబ్ద కాలం తర్వాత చిత్తూరు కోర్టు సంచలన తీర్పు

### రూ.70 లక్షలు పరిహారం చెల్లించాలని ఆదేశం

**చిత్తూరు, అక్టోబరు 31 ప్రభాతవార్త:** చిత్తూరు మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్‌లను నగరపాలకసంస్థ కార్యాలయంలోనే 2015 హత్య కేసులో ఐదుగురు హంతకులకు ఉరిశిక్ష విధిస్తూ చిత్తూరుజిల్లా కోర్టు న్యాయమూర్తి సంచలనం తీర్పువెలువడించారు. ఈ హత్య కేసులో ఇప్పటికే మిగిలిన 18 మంది నిందితుల పాత్ర లేదని కోర్టు భావించి వారిని విడుదల చేసింది. దశాబ్ధకాలంపాటు కోర్టులో విచారణ సాగిన హత్యకేసులో శుక్రవారం ఉదయం చిత్తూరు 9వ అదనపు జిల్లా కోర్టు తుదితీర్పు వెలువడించడంతో సంచలనంగా మారింది. చిత్తూరు నగరపాలక మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్‌లను హత్య చేసిన కేసులో ఐదు మంది నిందితులకు ఒకేసారి ఉరిశిక్ష విధిస్తూ జడ్జి శ్రీనివాసరావు తీర్పు ఇచ్చారు. 2015లోనే ఈ కేసులో చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు మొత్తం 23 మంది నిందితులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో ఛార్జీషీటు దాఖలు చేసింది. పదేళ్ళపాటు జరిగిన ఈ విచారణలో ఈ నెల 24వ తేదీన మేయర్ దంపతుల హత్య కేసులో మొదటి ఐదు మంది నిందితులు మాత్రమే ఈ హత్యలు చేశారని మిగిలిన 18 మంది నిందితుల పాత్ర ఈ హత్యల్లో లేదని కోర్టు భావించి వారిని విడుదల చేసింది. ఆపై శిక్ష ఖరారుకు ఈ కేసును మూడు సార్లు వాయిదా వేసినప్పటికీ శుక్రవారం మేయర్ దంపతుల హత్య కేసు శిక్షను జడ్జి శ్రీనివాసరావు ఖరారు చేసి ఈ కేసులో మొదటి ఐదు మంది నిందితులకు ఉరిశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ మేరకు మేయర్ దంపతులహత్య కేసులో ప్రధాన నిందితుడిగా వున్న శ్రీరామ్ చంద్రశేఖర్ అలియాస్ చింటూతో పాటు వెంకటాచలపతి అలియాస్ ముల్బాగల్ వెంకటేష్, జయప్రకాష్‌రెడ్డి అలియాస్ రెడ్డి, తోటి మంజునాథ్, వెంకటేష్‌లకు ఉరిశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. అలాగే >>2

# వచ్చే మూడేళ్లలో అమరావతి తొలిదశ పూర్తి 3లో

## సతీమణితో కలిసి రేపు లండన్‌కు సిఎం పయనం

**అమరావతి, అక్టోబరు 31 ప్రభాతవార్త ప్రతినిధి:** వ్యక్తిగత పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సతీమణి భువనేశ్వరితో కలిసి శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి లండన్ కు బయల్దేరి వెళ్లనున్నారు. నవంబరు 4 తేదీన ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ నారా భువనేశ్వరికి ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ లండన్ లో డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ 2025 అవార్డు అందించనుంది. అలాగే, హెరిటేజ్ ఫుడ్స్‌కు ఎక్స్ లెన్స్ ఇన్ కార్పోరేట్ గవర్నెన్సు విభాగంలో లభించిన గోల్డెన్ పీకాక్ అవార్డును భువనేశ్వరి అదే వేదికపై అందుకోనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరు అవుతారు.

**హెరిటేజ్ ఫుడ్స్‌కు గోల్డెన్ పీకాక్ అవార్డు**

ఎక్స్ లెన్స్ ఇన్ కార్పోరేట్ గవర్నెన్సులో హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ హోదాలోనూ భువనేశ్వరి గోల్డెన్ పీకాక్ అవార్డు అందుకోనున్నారు. ఎఫ్ఎంసీజీ విభాగంలో హెరిటేజ్ ఫుడ్స్‌కు జాతీయ స్థాయిలో ఎక్స్ లెన్స్ ఇన్ కార్పోరేట్ గవర్నెన్సు విభాగంలో గోల్డెన్ పీకాక్ అవార్డుకు ఐఓడీ ఎంపిక చేసింది.

**పారిశ్రామిక వేత్తలతో సీఎం భేటీలు:** లండన్‌లో వ్యక్తిగత పర్యటన అనంతరం పలు కార్యక్ర మాల్లో ముఖ్యమంత్రి చంద్ర >>2

# గీత దాటితే వేటు తథ్యం

### ఎంతటి వారైనా సహించేదిలేదు..

### తిరువూరు విభేదాలపై సిఎం చంద్రబాబు ఆగ్రహం

### పార్టీ కార్యకర్తలు, నాయకులతో భేటీ

**విజయవాడ,అక్టోబరు 31,ప్రభాతవార్తప్రతినిధి:** పార్టీ ప్రజాప్రతినిధులపైనే టీడీపీ కార్యకర్తలు వర్గాలుగా విడివిడిపోయి ఆరోపణలు చేస్తూ రోడ్డుకు ఎక్కడవంటి చర్యలను ఎంత మాత్రం సహించేది లేదని తెలుగుదేశం పార్టీ జాతీయ నేత,ఏపీ సీఎం చంద్రబాబు హెచ్చరించారు.ఈ వర్గాలను ప్రజాప్రతినిధులు ప్రోత్సహించడనాన్ని ఉపేక్షించేది లేదన్నారు.టీడీపీ నేతలకి సంబంధించిన తిరువూరు విభేదాల పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ లైన్ ఎవరూ దాటినా సహించేది లేదని హెచ్చరించారు. టీడీపీ తిరువూరు విభేదాలకి కారణమైన ఇరువురు నేతలు ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కొలికపుడి శ్రీనివాసరావులతో తాను కూడా మాట్లాడుతానని స్పష్టం చేశారు సీఎం చంద్రబాబు. ఆ తర్వాత కూడా పరిస్థితి చక్కబడకపోతే చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. ఈ మేరకు క్రమశిక్షణ కమిటీ ఈ విషయాన్ని ఇరువురు నేతలకి చెప్పాలని సూచించారు. శుక్రవారం టీడీపీ నేతలతో చంద్రబాబు సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పార్టీకి సంబంధించిన పలు కీలక అంశాలపై అధినేత చర్చించారు. అనంతరం పార్టీ నేతలతో తిరువూరు విభేదాల గురించి మాట్లాడారు. ఈ నేపథ్యంలో తిరువూరు వివాదాన్ని పార్టీ క్రమశిక్షణ కమిటీకి అప్పగించారు,ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కొలికపుడి శ్రీనివాసరావులని పిలిపించి మాట్లాడాలని ఆదేశాలు జారీ చేశారు. ఇరువురు అభిప్రాయాలను ఓ లేఖ రూపంలో తనకు ఇవ్వాలని ఆదేశించారు. తాను లండన్ పర్యటన నుంచి వచ్చిన తర్వాత ఇరువురిని పిలిపించి మాట్లాడుతానని అధినేత స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వైసీపీ నెగెటివ్, ఫేక్ ప్రచారం చేస్తోందని చంద్రబాబు దృష్టికి పార్టీ నేతలు తీసుకువచ్చారు. ఈ విషయంపై నిజాలు ఏమిటో ప్రజలకు టీడీపీ శ్రేణులు వివరించాలని చెప్పారు. అవసరమైతే సోషల్ మీడియాలో ఈ విషయంలో అవగాహన ఉన్నవారిని తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. అయితే, వచ్చే వారం తర్వాత నుంచి వారంలో ఒకరోజు మొత్తం టీడీపీ కేంద్ర కార్యాలయంలోనే ఉండాలని నిర్ణయం తీసుకున్నారు కొంతమంది టీడీపీ ఎమ్మెల్యేలు సీఎంఆర్ఎఫ్ లేఖలు ఇవ్వడం లేదని సీఎంకు పార్టీ కేంద్ర కార్యాలయం సిబ్బంది చెప్పారు. ఆ ఎమ్మెల్యేలు ఎవరో తనకు వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు సీఎం. అంత సమయం లేకుండా ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆ ఎమ్మెల్యేల జాబితా తయారు చేసి తనకు టెలికాన్ఫరెన్స్‌లో అందరిని కలపాలని ఆజ్ఞాపించారు. తన లండన్ పర్యటన ముగించుకొని వచ్చిన వెంటనే టీడీపీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కమిటీలను నియమిస్తామని చెప్పుకొచ్చారు. జాబితాలు సిద్ధంగా ఉన్నాయని, వాటిని తీసుకొని రావాలని టీడీపీ ఏపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంపై తాను ఒక గంట సమయం కేటాయిస్తే చాలని చెప్పుకొచ్చారు. మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాలకు ఎమ్మెల్యేలు నవంబరు 2వ తేదీన మళ్లీ వెళ్లాలని సీఎం ఆదేశాలు జారీచేశారు. పంటల నష్టం అంచనా సరిగా జరిగిందా?లేదా? అనే అంశంపై టీడీపీ నేతలు అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. పార్టీ కేడర్, ఎమ్మెల్యేలు క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉంది.పార్టీ కేడర్‌కు క్షేత్రస్థాయిలో వాస్తవాలు బాగా తెలుస్తాయి. పార్టీ సిద్ధాంతాలుపై అవగాహనలేని వారికి టిక్కెట్లు ఇవ్వడం పొరపాటు.ప్రస్తుతం జరుగుతున్న గొడవలకు ఇదే ప్రధాన కారణమేమోననిఅనిపిస్తుంది. పార్టీ టికె ట్‌పై గెలిచినవాళ్లు పార్టీలైన్ >>2

## ప్రైవేట్ ఆస్పత్రులతో చర్చలు సఫలం

### బకాయిల మంజూరుకు ప్రభుత్వం అంగీకారం

### ఇక ఎన్టీఆర్ వైద్యసేవల పునరుద్ధరణ



శుక్రవారం ప్రైవేట్ ఆస్పత్రుల సంఘంతో చర్చిస్తున్న మంత్రి సత్యకుమార్

**విజయవాడ,అక్టోబరు 31,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రైవేటు ఆస్పత్రుల అసోసియేషన్‌తో కూటమి ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఆందోళన విరమించిన యాజమాన్యాలు రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ వైద్య సేవల పునరుద్ధరణకు అంగీకరించాయి. వెంటనే మరో రూ.250కోట్ల బకాయిల >>2

## బాధితులందరికి పూర్తి న్యాయం



### ఆస్తినష్టం అంచనాలు పకడ్బందీగా రూపొందించాలి

### అధికారులతో డి.సిఎం పవన్

**అమరావతి, అక్టోబరు 31 ప్రభాతవార్త ప్రతినిధి:** మొంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ స్వాంతన కలిగించి, న్యాయం చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కాకినాడ జిల్లా అధికారులను ఆదేశించారు.పంట నష్టం, ఆస్తి నష్టం అంచనాలు పకడ్బందీగా రూపొందించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి ప్రకటించిన సాయం నష్టపోయిన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని తీర ప్రాంత గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. సముద్రానికి ఆనుకుని ఉన్న మత్స్యకార గ్రామాల్లో పరిస్థితులపై ఎప్పటికప్పుడు నివేదికలు పంపాలని ఆదేశించారు. శుక్రవారం కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీ, డిఆర్ఓ, ఆర్డీవోలు, పడా ప్రాజెక్ట్ డైరెక్టర్, పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ, వ్యవసాయ, విద్యుత్ శాఖలతోపాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తుపాను అనంతర పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. కాకినాడ జిల్లా పరిధిలో మొంథా తుపాను ప్రభావంతో జరిగిన నష్టం వివరాలపై ఆరా తీశారు. పిఠాపురం నియోజకవర్గంలో ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తుపాను అనంతరం తీసుకుంటున్న ఉపశమన చర్యలు, ఆస్తి, పంట నష్టం అంచనాలపై దిశా నిర్దేశం చేశారు. కాకినాడ జిల్లా పరిధిలో మొత్తం 21 మండలాలు, ఏడు మున్సిపాలిటీలు ప్రభావితం అయినట్టు కలెక్టర్ షాన్‌మోహన్ వివరించారు. మొత్తం 61 ఇళ్లు దెబ్బ తినగా, 41,932 కుటుంబాలపై మొంథా ప్రభావంచూపినట్టు తెలిపారు. అందులో 27,624 మత్స్యకార, 313 చేనేత కుటుంబాలు ఉన్నట్టు చెప్పారు. 21,711 హెక్టార్లలో పంటకు నష్టం వాటిల్లిందని, 668 ఎకరాల్లో అరటి, బొప్పాయి తదితర ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. మొత్తం 33,596 మంది రైతులు తుపాను కారణంగా నష్టపోయినట్టు తెలిపారు. విద్యుత్ పరికరాలు, రోడ్లు కూడా పెద్ద ఎత్తున దెబ్బతిన్నట్టు వివరించారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే వరి, ఉద్యాన పంటలు కలిపి 2,500 మంది రైతులు వరకు పంటలు నష్టపోయినట్టు చెప్పారు. ముఖ్యంగా పంట నష్టం అంచనాలు రూపొందించే సమయంలో రైతులపక్షాన నిలచి పక్కాగా నివేదికలు రూపొందించాలి. దీంతోపాటు ఆస్తి నష్టం వివరాలు కూడా రూపొందించాలని అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచించారు.

# మొంథా నష్టం ఇదీ..

### వెంటనే రూ.5,244 కోట్లు సాయం చేయాలని కేంద్రాన్ని కోరిన రాష్ట్ర ప్రభుత్వం

**విజయవాడ,అక్టోబరు 31, ప్రభాతవార్తప్రతినిధి:** మొంథా తుఫాన్ నష్టంపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రాథమిక నివేదిక సమర్పించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కేంద్ర హోం శాఖ కార్యదర్శికి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రాథమిక నివేదికను పంపారు. ఇప్పటి వరకు ఉన్న అంచనాల ప్రకారం 17శాఖలు, రంగాలకు సంబంధించి మొత్తం రూ.5,244 కోట్లు నష్టం వాటిల్లినట్టు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకువెళ్లింది. ప్రస్తుతం ప్రాథమిక అంచనాల ప్రకారమే నివేదిక సమర్పించామని, పూర్తి స్థాయిలో వివరాలు వస్తే నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. రాష్ట్రానికి తక్షణ ఆర్థిక సాయం చేయాలని కేంద్రాన్ని కోరింది. ప్రాథమిక నివేదికలో అంశాలవారీగా ఏయే శాఖలు, ఏయే రంగాల వారీగా ఎంతమేర నష్టం వాటిల్లిందన్న సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొందుపర్చింది. అలాగే, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న సహాయక చర్యలను పేర్కొంది. ఆర్టీజీఎస్ నుంచి తుఫాన్ ప్రభావాన్ని గమనిస్తూ ఎప్పటికప్పుడు ముందస్తు జాగ్రత్తలు ప్రభుత్వం ఏ విధంగా తీసుకుందో వివరించింది. 19జిల్లాలకు ప్రత్యేక అధికారులను కూడా నియమించినట్టు తెలిపింది. ప్రకాశం, నెల్లూరు, బాపట్ల, నంద్యాల జిల్లాల్లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉందని నివేదికలో వెల్లడించింది. రాష్ట్రంలోని 249 మండలాల పరిధిలోని 1,434 గ్రామాలు, 48 పట్టణాలపై తుఫాన్ ప్రభావం పడింది. 161 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైందని స్పష్టం చేసింది. తుఫాన్ వల్ల సంభవించిన నష్టాన్ని >>2

## లిక్కర్ స్కాం కేసు నిందితుల ఆస్తుల జప్తుకు అనుమతి

**విజయవాడ,అక్టోబరు 31,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది.ఈ కేసులో నిందితులుగా ఉన్న వారి ఆస్తుల అటాచ్‌మెంట్‌కు ఏసీబీ కోర్టు అనుమతిని ఇచ్చింది. నిందితుల ఆస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతిస్తూ ఏపీ ప్రభుత్వం ఇప్పటికే 111, 126 జీవోలు జారీచేసింది. ఏసీబీ కోర్టు అనుమతి ఇవ్వడంతో ఆస్తుల అటాచ్‌మెంట్ కోసం 11 మంది నిందితులకు వారెంట్లు జారీ చేయనున్నట్లు సమాచారం.

# పరకామణి కేసులో రవికుమార్ ఆస్తులపై దర్యాప్తు!



### కౌంటర్‌దాఖలుకు దేవాదాయశాఖ, టిటిడి ఇఒకు హైకోర్టు నోటీసులు

### ఎసిబి డిజి రాకతో వేడెక్కిన వాతావరణం

**తిరుమల,అక్టోబరు 31ప్రభాతవార్తప్రతినిధి:** వడ్డీకాసుల వెంకన్న పరకామణిలో 2023లో అమెరికన్ డాలర్లు చోరీ కేసులో నిందితుడుగా ఉన్న సివి రవికుమార్ ఆస్తులపై విచారణ చేయడానికి రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో అక్రమాలు అవకతవకలు జరిగాయనేది స్పష్టమైందని, సమగ్ర దర్యాప్తు జాప్యం జరిగిందని, త్వరగా విచారణ చేపట్టి డిసెంబర్ 2కి పూర్తిచేయాలని ఐదురోజుల క్రిందట హైకోర్టు న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు. ఈ ఆదేశాల్లో రవికుమార్‌కు అతని కుటుంబసభ్యులకు సంబంధించి ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయి?ఏ మేరకు ఆస్తులు సంపాదించారు అనే కోణంలో విచారణ చేయాలని హైకోర్టు ఆదేశించిన విషయం విదితమే. తాజాగా శుక్రవారం ఉదయం ఏసిబి డిజి అతుల్‌సింగ్ తిరుమలకు రావడంతో ఈ కేసులో దర్యాప్తు మొదలైందని టిటిడి వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా ఈ కేసులో శుక్రవారం కీలకపరిణామం చోటుచేసుకుంది.పరకామణి చోరీకేసులో కౌంటర్‌దాఖలుచేయాలని దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి, టిటిడి ఇఒకు హైకోర్టు నోటీసులిచ్చింది. లోక్‌అదాలత్‌ఇచ్చిన ఉత్తర్వులను చట్టబద్ధత తేల్చే వ్యవహారాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రఘునందనరావు,జస్టిస్ సుభేందులకు అప్పగించారు. తదుపరి రానున్న నెలలో 17వతేదీకి వాయిదా పడింది. 140కోట్ల రూపాయలకుపైగా విలువైన ఆస్తులు నిందితుడు పేరున, అతని కుటుంబసభ్యుల పేరున ఉన్నాయనే ఆరోపణలు పిటిషనర్‌పేర్కొన్నారు. అందులో నిందితుడి నుండి అప్పటి టిటిడి పెద్దలు కేవలం 14కోట్ల రూపాయలు విలువైన ఆస్తులను దేవుడికి విరాళంగా ఇప్పించేయడం వెనుక కుట్ర ఉందనే అంశంపై ఏసిబి ఆరా తీయనుంది. అయితే 2023 ఏప్రిల్‌లో పరకామణినుండి అతను చేసిన చోరీ కేవలం 72వేల రూపాయలు విలువమాత్రమేనని అప్పటి టిటిడి బోర్డు పెద్దలు తేల్చి కేసును లోక్‌అదాలత్‌ద్వారా రాజీచేయడం పెద్ద సంచలనం రేకెత్తించింది.ఈ కేసులో శ్రీనివాసులు హైకోర్టును ఆశ్రయించి, పిటిషన్ వేయడంతో విచారణ చేపట్టిన న్యాయమూర్తి ఐదురోజుల క్రిందట నిందితుడు ఆస్తులు ఎంత >>2

1-11pg2exHMNWJQE 2_1-11pg2exHMNWJQE.qxd 01/Nov/25 12:17 AM Page 1





శుక్రవారం ఇందిరాగాంధీ వర్థంతి సందర్భంగా న్యూఢిల్లీలోని శక్తిస్థల్ వద్ద నివాళి అర్పిస్తున్న సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఖర్గే తదితరులు

# శక్తిస్థల్ వద్ద ఇందిరా గాంధీకి ఘన నివాళులు!

**న్యూఢిల్లీ, అక్టోబరు 31:** స్వర్గీయ ప్రధాని ఇందిరాగాంధీ వర్థంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు దివంగతప్రధాని సమాధి వద్ద ఘన నివాళులర్పించారు. న్యూఢిల్లీలోని శక్తిస్థల్‌వద్ద ఉన్న ఇందిర సమాధి వద్ద కాంగ్రెస్ నేత సోనియా, ఎంపిలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా తదితర అగ్రనేతలందరూ నివాళి అర్పించి ఇందిరాగాంధీ సేవలను స్మరించుకున్నారు. అలాగే సఫ్దర్‌జంగ్ రోడ్డులో ఉన్న దివంగత ప్రధాని స్మారకం వద్దకూడా అగ్రనేతలువెళ్లి నివాళి అర్పించారు. భారత్ ఆత్మగౌరవంతో నిలిచేవిధంగా స్వర్గీయ ఇందిర కృషిచేసారని, తనకు ఆత్మనిర్భర్‌కంటే ఏదీ ముఖ్యంకాదని ఇందిర చాటిచెప్పారని కాంగ్రెస్‌నేతలు ఈసందర్భంగా గుర్తుచేసుకున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడుమల్లిఖార్జున్‌ఖర్గే సైతం సమాధివద్ద ఘననివాళులర్పించి ఆమెతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకున్నారు. భారత మొట్టమొదటి మహిళా ప్రధాని మనందరికీ రోల్‌మోడల్ అని ఆమె వర్థంతిరోజున దేశ అభివృద్ధి, సర్వతోముఖాభివృద్ధికి స్వర్గీయ ఇందిరచేసిన సేవలు ప్రతి ఒక్కరూ గుర్తుచేసుకోవాలని సూచించారు. సమైక్యత, సమగ్రతలతోనే భారత్ మరింతగా రాణిస్తుందని స్వర్గీయ ప్రధాని విశ్వసించేవారని, ఆమెచూపించిన అడుగుజాడలే నేటి తరానికి మార్గదర్శకమని ఖర్గే ఆకాంక్షించారు. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరామ్‌రమేష్ మాట్లాడుతూ ధైర్యసాహసాలకు ప్రతీక స్వర్గీయ ఇందిర అని కొనియాడారు. 1977లో ఆమె బీహార్ పర్యటనలో ముందు కారు, తర్వాత జీపు, ఆపై ట్రాక్టర్ ఆ తర్వాత బెల్చి ప్రాంతానికి ఒక ఏనుగుపైనా ప్రయాణంచేసారని, ప్రజలకు చేరువ కావాలన్న ఆమె ఆకాంక్షకు ఈ సంఘటన నిదర్శనమని పేర్కొన్నారు.

## రేపు లండన్‌కు సిఎం పయనం

>> బాబు పాల్గొననున్నారు. విశాఖలో నవంబర్ 14, 15 తేదీల్లో జరుగనున్న సిఐఐ భాగస్వామ్య సదస్సుకు అక్కడి పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించనున్నారు. దీనికి సంబంధించి లండన్‌లోని పారిశ్రామికవేత్తలు, పలువురు ప్రవాసాంధ్రులతోనూ సీఎం భేటీ కానున్నారు. నవంబరు 6 తేదీన సీఎం తిరిగి రానున్నారు.

## గీత దాటితే వేటు తథ్యం

>> తీసుకోవాలి. వ్యక్తిగత ఇమేజ్ కోసం కొందరు పాకులాడుతున్నారు. అందరూ వ్యక్తిగత ఇమేజ్ కోసం ప్రయత్నం చేస్తే వాళ్లు వెళ్లి వ్యక్తిగతంగా పోటీ చేస్తే బాగుంటుంది. ఎవరూ రిలీజియస్ సెంటిమెంట్లను టచ్ చేయొద్దు. ఒక ఎమ్మెల్యేగా ఒక మాట మాట్లాడేటప్పుడు చాలా జాగ్రత్తగా మాట్లాడాలి. పార్టీ కేడర్ ఎంపవర్‌మెంట్‌పై పూర్తి స్థాయి చర్చ ఉంది. వాళ్లకు ఎటువంటి శిక్షణ ఇవ్వాలనే అంశంపై చర్చించాం. రాజకీయం డబ్బులు సంపాదించడం కోసం అనే భావన నుంచి నేతలు బయటకు రావాల్సి అని సూచిం చారు. సంపాదనకు వేరే మార్గాలు చూసుకోవాలి. కొంతమంది లిక్కర్ వ్యాపారం చేస్తున్నారు. ఆ వ్యాపారం ద్వారా వచ్చే డబ్బు ఎప్పుడూ నిలబడదు. ఎన్నికల ముందు రూ.4వేల పెన్షన్ ఇస్తామని చెప్పాను. అందుకనే నేను పార్టీ వాళ్లను సచివాలయ సిబ్బందితో వెళ్లి పక్కన నుంచొని ఉండమని చెప్పాను. పార్టీ ఓనర్ షిప్ తీసుకోవాలి. పార్టీ ఇక ఎప్పుడూ ప్రతిపక్షంలో ఉండదు. ఎప్పుడు అధికారంలో ఉంటుంది అని ధీమా వ్యక్తం చేశారు.



శుక్రవారం సర్దార్ పటేల్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సిఎం చంద్రబాబు

# జాతీయ ఐక్యతకు పునాది వేసిన సర్దార్ పటేల్: సిఎం చంద్రబాబు

**విజయవాడ,అక్టోబరు 31,పభాతవార్త ప్రతినిధి:** సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నివాళులర్పించారు. తన కార్యాలయంలోని సర్దార్ వల్లబాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. భారత రాజ్యాంగంతో పౌరులకు ప్రాథమిక హక్కులు మాత్రమే కాదు. వాటిని కాపాడే భాధ్యత కూడ ప్రతి పౌరుడిదని భోధించిన దార్శనికుడు ఆయనని కొనియాడారు. ఉక్కు సంకల్పంతో దేశాన్ని ఏకత్రాటిపైకి తీసుకువచ్చి జాతీయ ఐక్యతకు పునాది వేసిన సుస్థిర జాతి శిల్పి అని అన్నారు. దేశ సమగ్రతకు మార్గదర్శకమైన ఆ మహనీయుని ఆత్మసూర్తికి నివాళులర్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

**పటేల్ వ్యక్తిత్వం నేటి తరానికి స్ఫూర్తి: డీసీం పవన్**

సర్థార్ వల్లభాయిపటేల్‌కు భారత దివంగత మాజీ ఉప ప్రధానికి ఆయన 150వ జయంతి సందర్భంగా డీ సీఎం పవన్ కల్యాణ్ ఘన నివాళిని అర్పించారు. సర్థార్ వల్లభాయిపటేల్ వ్యక్తిత్వం నేటి తరానికి స్ఫూర్తిదాయమని పవన్ 'ఎక్స్'వేదికగా పేర్కొన్నారు. పటేల్ దేశ సమగ్రత, సమైక్యతకు చేసిన కృషి మరువలేనిదన్నారు.

**ధృఢ సంకల్పం పటేల్ సొంతం:లోకేష్**

సర్థార్ వల్లభాయిపటేల్‌కు ఏపీ మంత్రి నారా లోకేష్ నివాళులర్పించారు. దేశ ఐక్యతకు కృషి చేసిన వ్యక్తి సర్థార్ వల్లభాయిపటేల్ అని కొనియాడారు.

దేశ తొలి హోంమంత్రిగా, ఉప ప్రధానిగా విశేష సేవలు అందించారన్నారు. ధృఢమైన సంకల్పం, అచంచల నాయకత్వం ఆయన స్వంతమని చెప్పారు. జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశానికి సర్థార్ వల్ల భాయి పటేల్ అందించిన సేవలను స్మరించుకుందామని పిలుపునిచ్చారు.

## వారం - వర్జ్యం

01-11-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
దశమి ఉ.9.09
శతభిషం సా.6.14, స్వాతి కార్తె
వర్జ్యం : రా.9.17-10.02
దు.ఉ.6.06-7.40
శుభసమయం:ఉ.8.15-8.45
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** అనుకున్న పనులు పూర్తి అవుతాయి. నూతన ఉద్యోగా వకాశాలు లభిస్తాయి. ఆర్థికపరిస్థితి బాగుంటుంది.

**వృషభం :** మొండి పట్టుదల మాట తీరు వల్ల మీ సహాయసహకారాలకు రావలసిన పేరు రాదు. వస్త్రలాభం

**మిథునం:** తల్లిదండ్రులు, వృద్దుల పట్ల సేవా తత్పరత కలిగి వుంటారు. క్రయ విక్రయాలకు దూరంగా వుండండి.

**కర్కాటకం:** వృత్తి వ్యాపారాలలో నూతన పద్ధతుల వల్ల లాభపడతారు. ధనలాభం కల్గుతుంది. శుభకార్యాలలో పాల్గొంటారు.

**సింహం:** కుటుంబంలో ఏర్పడిన కొద్ది పాటి విభేదాలు తొలగుతాయి. ఓర్పు, నేర్పు, నైపుణ్యం అవసరమవుతాయి.

**కన్య :** చేపట్టిన కార్యక్రమాలలో జాప్యం జరిగినా చివరికి పూర్తిచేస్తారు. అంతర్గత రాజకీయాలు కొంత బాధిస్తాయి.

**తుల :** వివాదాలకు, కోపతాపాలకు దూరంగా వుండండి. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం. శుభ వార్తలు అందుకుంటారు. వస్త్రలాభం.

**వృశ్చికం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వున్నా అవసరాలకు డబ్బు అందుతుంది. వాహనాలు కొనుగోలు చేస్తారు.

**ధనుస్సు:** ముఖ్యమైన వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు. వ్యాపారాలలో లాభాలు గడిస్తారు. ప్రయాణాలు అనుకూలం.

**మకరం:** అవకాశాలు అంచులవరకూ వచ్చి చేజారిపోకుండా జాగ్రత్తలు పాటించండి. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కుంభం:** భూ, స్థలాలకు సంబంధించిన కోర్టు కేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. బంధువులు కలుస్తారు.

**మీనం:** ఆర్థిక లావాదేవీలలో ఆలోచించి నిర్ణ యాలు తీసుకోవడం మంచిది. ఇంటా బయటా ప్రోత్సాహం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పొలాల నుంచి వరద తోడండి

>> ఖచ్చితమైన సమాచారం రావడంతో ఆయా ప్రాంతాల్లో ముందస్తుగానే చర్యలు తీసుకోవడానికి ఆస్కారం లభించింది. దీని ద్వారా ప్రాణనష్టం, ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగించడంలో ప్రభుత్వం సఫలమైంది. ఇక వివిధ వ్యవస్థల ద్వారా రియల్ టైములో సేకరించిన సమాచారాన్ని విశ్లేషించడం... ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంతో పాటు ప్రజలకు కచ్చితమైన సమాచారాన్ని ఇవ్వాలి. విపత్తులకు సంబంధించిన సమాచారం ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలి. ఈ విషయంలో ప్రభుత్వం టెక్నాలజీని పూర్తిగా వినియోగించుకుంది. వాస్తవాలను ప్రజలకు నేరుగా చేరవేయగలిగింది. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు అధికారులకు 1.1 కోట్లకు పైగా సందేశాలను ప్రభుత్వం పంపింది. ఫిర్యాదులు స్వీకరించడం.. ఫీడ్ బ్యాక్ తీసుకోవడానికి కూడా ప్రత్యేక వ్యవస్థలు పని చేశాయి. మనమిత్ర సుమారు 12,000కు పైగా ఫిర్యాదులు అందాయి. వీటిని క్షేత్రస్థాయిలో ఉన్న ప్రభుత్వ యంత్రాంగం పరిష్కరించింది.

సర్వేలు, మీడియా, సోషల్‌మీడియా మానిటరింగ్ ద్వారా అధికారులు ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఇదే సమయంలో తప్పుడు సమాచారం వ్యాప్తిని నివారించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఏరియల్ సర్వేలు, వరద మ్యాపింగ్, రియల్ టైమ్ డేటా సేకరణ కోసం 602 డ్రోన్‌లను అందుబాటులో ఉంచారు. 14,770 సీసీటీవీ కెమెరాలను ఫైబర్‌నెట్ నెట్‌వర్క్‌కు అనుసంధానించారు. 24 గంటల పాటు క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులను అంచనా వేయగలిగారు. అలాగే ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే.. వాటిని త్వరగా గుర్తించగలిగారు. ఇక మెషినరీ ట్రాకింగ్ యాప్ ద్వారా క్రేన్‌లను లైవ్ ట్రాక్ చేయడానికి వీలు కలిగింది. అలాగే రోడ్‌బ్లాక్‌లు, వరద ప్రభావిత ప్రాంతాల్లో సమస్యలు ఉన్న చోట జేసీబీలు, క్రేన్లను తరలించేలా చర్యలు తీసుకోగలిగారు. ఇక అన్ని విభాగాల నుంచి వచ్చిన లైవ్ డేటాను అనుసంధానిస్తూ. సైక్లోన్ మానిటరింగ్ డాష్‌బోర్డ్ ఏర్పాటు చేశారు. ఇంటిగ్రేటెడ్ మ్యాపింగ్ ద్వారా రోడ్లు, ఆసుపత్రులు, సహాయక కేంద్రాలు కీలకమైన మౌలిక సదుపాయాలు ఎక్కడున్నాయనే సమాచారాన్ని సేకరించగలిగారు. 5,803 గ్రామ, వార్డు స్థాయిలో కూడా కమాండ్ సెంటర్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసుకోగలిగింది. క్షేత్ర స్థాయి సిబ్బంది ద్వారా 2 కోట్లకు పైగా ప్రజలకు సేవలందించే ఏర్పాట్లను ముందుగానే చేసుకోగలిగింది. ఈ క్షేత్ర స్థాయి వ్యవస్థ ద్వారా బ్యాకప్ పవర్, సహాయక సామాగ్రిని ఆయా కేంద్రాల్లో ముందుగానే ఉంచారు. ముఖ్యంగా 1,742మంది గర్భిణిలను సురక్షితంగా ఆసుపత్రులకు తరలించడంలో గ్రౌండ్ లెవల్ నెట్ వర్క్ బాగా ఉపయోగపడింది. తుఫాను అంతటా అంతర్‌ఏజెన్సీ సమన్వయాన్ని బలోపేతం చేస్తూ, ఒక బలమైన కమ్యూనికేషన్ నెట్‌వర్క్ కొనసాగింది. 2,973 పోర్టబుల్ వైర్‌లెస్ సెట్‌లు, దీబి సెట్‌లు మౌంటెడ్ రేడియోలతో ఆర్టీజీ సెంటర్ నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఉంది.

**కేంద్రాన్ని తక్షణ సాయం కోరండి:** మొంథా తుఫాన్‌తో రాష్ట్రానికి జరిగిన నష్టంపై కేంద్రానికివెనువెంటనే ప్రాథమిక నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిశీలనకు కేంద్ర బృందాన్ని ఆహ్వానించాలన్నారు. తుది నివేదిక సమర్పించేలోగా తక్షణ సాయం అందించేలా కేంద్రాన్ని కోరాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఈ విషయమై తాను ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడతానని ముఖ్యమంత్రి చెప్పారు. అలాగే కృష్ణా నదిలో ప్రస్తుతం కొనసాగుతున్న నీటి నిల్వల వివరాల గురించి ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అయితే కృష్ణాలో వరదఉధృతి తగ్గిందని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు. అలాగే మొంథా తుఫాన్ రక్షణ చర్యల్లో అత్యుత్తమంగా పనిచేసిన వారిని సన్మానించాలనిముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు. శనివారం ఉదయం 10 గంటలకు సుమారు 100 మందిని గౌరవించుకునేలా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పారు.

# మొంథా నష్టం ఇదీ..

>> శాస్త్రీయంగా మదింపు చేసినట్టు పేర్కొంది. ఈ మేరకు తుఫాన్ తీవ్రతను అద్దం పట్టేలా ఫోటోలను లేఖతో జతపరిచి తుఫాన్ నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు రాష్ట్రానికి కేంద్ర బృందాలను పంపాల్సిందిగా కోరింది.

**దెబ్బతిన్న 4,794 కి.మీ. ఆర్ అండ్ బీ రహదారులు:** అధికారులు రూపొందించిన ప్రాథమిక నివేదిక ప్రకారం అత్యధికంగా రహదారులు, వ్యవసాయం అనుబంధ రంగాల్లో నష్టం సంభవించినట్టు పేర్కొన్నారు. తుఫాన్ వల్ల ముగ్గురు మరణించినట్టు వెల్లడించారు. 4,794 కి.మీ. మేర ఆర్ అండ్ బీ రహదారులు, 311 కల్వర్టులుబ్రిడ్జిలు దెబ్బతిన్నాయని స్పష్టం చేశారు. ఈ నష్టం రూ.2,774 కోట్ల మేర ఉందని వివరించారు. 18 జిల్లాల్లోని 862 కి.మీ.మేర పంచాయతీ రాజ్ రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిలు కూడా దెబ్బతిన్నాయి. దీంతో ఈ శాఖకు రూ.454 కోట్ల నష్టం జరిగింది. 48 పట్టణ ప్రాంతాల్లోని రోడ్లు,భవనాలు, ఇతర మౌలిక వసతులు విధ్వంసమయ్యాయి. వీటి పునరుద్ధరణకు రూ.109 కోట్లు వ్యయం కానుందని నివేదికలో చెప్పారు.

**1.38 లక్షల హెక్టార్లలో పంట నష్టం:** వ్యవసాయ రంగానికి సంబంధించి 1.38 లక్షల హెక్టార్లలోని 2.96 లక్షల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులు దెబ్బతిన్నాయని... దీంతో రూ.829 కోట్ల వరకు రైతులు నష్టపోయినట్టు నివేదిక చెబుతోంది. మొత్తం 1.74లక్షల మంది రైతులపై తుఫాన్ ప్రభావం చూపించింది. 12,215 హెక్టార్లలోని రూ.40 కోట్ల విలువైన ఉద్యానపంటలు దెబ్బతినగా 23,979 మంది ఉద్యాన రైతులకు నష్టం జరిగింది. ఆక్వారంగంలో 32 వేల ఎకరాల్లోని రూ.514 కోట్ల విలువైన పంటను రైతులు కోల్పోయారు. మరోవైపు 2,261 పశు సంపదను నష్టపోయారు.

**విరిగిపడ్డ 2,817 విద్యుత్ స్తంభాలు:** రాష్ట్రంలోని 2,817 విద్యుత్ స్తంభాలు నేలకొరగ్గా, 26,575 డీటీఆర్‌లు ధ్వంసమయ్యాయి. 429 కి.మీ. మేర విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీని వల్ల విద్యుత్ శాఖకు రూ.19 కోట్ల వరకు నష్టం జరిగింది. ఇక, రూ.234 కోట్ల మేర నష్టం నీటిపారుదల శాఖకు కలిగింది. అలాగే, 23 జిల్లాల పరిధిలోని 3,045 ఇళ్లు ధ్వంసమైనట్టు ప్రాథమిక నివేదికలో గుర్తించారు. అంగన్వాడీలు, పాఠశాలలు, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, చేనేత మగ్గాలు అన్నీ కలిపి రూ.122 కోట్ల నష్టం వాటిల్లింది. మరోవైపు, 1,464 చోట్ల రిలీఫ్ క్యాంపులు ఏర్పాటు చేయగా 1,36,907 మందికి పునరావాసం కల్పించారు. సహాయక చర్యల కోసం ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం సుమారుగా రూ.32 కోట్లు ఖర్చు పెట్టినట్టు అధికారులు ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు.

# శత్రువుల ఇళ్లలోకి చొరబడి కొడతాం

## కాంగ్రెస్ వల్లే కాశ్మీర్‌లో సమస్యలు

## సర్దార్ పటేల్‌ను పట్టించుకోలేదని విమర్శలు

## ప్రత్యేక నాణెం, పోస్టల్ స్టాంపు విడుదల

**అహ్మదాబాద్, అక్టోబరు 31:** శత్రువులకు భారత్ ఇచ్చే సమాధానం ఇప్పుడు చాలా స్పష్టంగా, బలంగా ప్రపంచానికి కనిపించేలా ఉంది... ఎవరైనా భారత్ వైపు కన్నెత్తి చూసే సాహసం చేస్తే, భారత్ వారి ఇంట్లోకి చొరబడి మరీ దెబ్బకొడతాం అని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పరోక్షంగా పాకిస్తాన్‌ను హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ శక్తి ఏమిటో ప్రపంచమంతా చూసింది. నేడు పాకిస్తాన్‌కు, ఉగ్రవాద నిర్వాహకులకు భారత్ అసలైన శక్తి ఏంటో బాగా తెలుసు అని పేర్కొన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం గుజరాత్‌లోని "స్టాట్యూ ఆఫ్ యూనిటీ" వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. "ఆపరేషన్ సిందూర్" ద్వారా శత్రు భూభాగంలోకి ప్రవేశించి మరీ దాడులు చేయగలమని భారత్ నిరూపించిందని ఆయన స్పష్టం చేశారు. దేశ భద్రత విషయంలో తమ ప్రభుత్వ దృఢవైఖరి, సర్దార్ పటేల్ ఆశయాలకు అనుగుణంగానే ఉందని ఆయన పేర్కొన్నారు. అలాగే కాంగ్రెస్‌పై ప్రధాని తీవ్ర విమర్శలుచేశారు.

**కశ్మీర్‌పై పటేల్ ఆకాంక్షలు**

కశ్మీర్ పూర్తిగా భారత్‌లో కలవాలని పటేల్ కోరుకున్నారని, అయితే ఆ సమయంలో నెహ్రూ ఆ అభిప్రాయాన్ని గౌరవించలేదని ప్రధాని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పటేల్ ఆశయాలను పూర్తిగా మరిచిపోయిందని ఆరోపించారు. పటేల్ దూరదృష్టిని కాంగ్రెస్ మరచిపోయిందన్న ప్రధాని, ఆయన అభిప్రాయాలను నెహ్రూ గౌరవించలేదని చెప్పారు. కాంగ్రెస్ తప్పు వల్ల కశ్మీర్‌లో కొంతభాగాన్ని పాకిస్థాన్ ఆక్రమించిందని వివరించారు. ఇప్పుడు చొరబాటుదారులతో కలిసి విపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. "గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకుల కోసం దేశ భద్రతను పణంగా పెట్టాయి. దేశం బలహీనపడినా చొరబాటుదారుల కోసం పోరాడేవారు పట్టించుకోరు. కానీ దేశ భద్రత, గుర్తింపు ప్రమాదంలో పడితే ప్రతి పౌరుడూ ప్రమాదంలో పడినట్లే. అందుకే, చట్టవిరుద్ధంగా నివసిస్తున్న ప్రతి చొరబాటుదారుడిని దేశం నుంచి తొలగించాలని మనం సంకల్పించుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు. కేవలం బాహ్యశత్రువులకే కాకుండా నక్సలిజం, చొరబాట్లు వంటి అంతర్గత సవాళ్లను ఎదుర్కోవడంలో కూడా తమ ప్రభుత్వానికి పటేల్ ఆదర్శాలే మార్గనిర్దేశం చేస్తున్నాయని తెలిపారు. చొరబాట్లు దేశ ఐక్యతకు పెను ముప్పుగా పరిణమించాయని ప్రధాని హెచ్చరించారు. దేశ సమగ్రతకు నక్సలిజం ముప్పుగా పరిణమించిందని, దాన్ని అంతం చేస్తున్నామని వివరించారు. దేశ ప్రజలంతా ఐక్యంగా ఉండాలని, విభజన శక్తుల కుట్రలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. పటేల్ జయంతి సందర్భంగా ఆయన స్మారకార్థం ప్రత్యేక నాణెం, పోస్టల్ స్టాంపును విడుదల చేసినట్టు మోడీ వెల్లడించారు. ఈ వేడుకల్లో సైనిక దళాల కవాతు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

# పరకామణి కేసులో రవికుమార్ ఆస్తులపై దర్యాప్తు!

>> మేరకు విలు వచేస్తాయనే అంశంపై విచారణ చేయాలని ఏసిబి డిజికి ఆదేశాలతో ఇప్పుడు రంగంలోకి దిగుతున్నారు. శుక్రవారం తిరుమలకు వచ్చిన అతుల్‌సింగ్ శ్రీవారి దర్శనానంతరం తిరుపతికి ఏసిబి కార్యాలయం చేరుకున్నారు. అక్కడ ఏసిబి అధికారులతో టిటిడిలో పరకామణిలో వ్యవహారంపై ఆరాతీసినట్లు సమాచారం. అక్కడ రోజువారీగా జరిగే కరెన్సీ నోట్లు, చిల్లరనాణేలు లెక్కింపు ప్రక్రియపై పరిశీలించి తదుపరి 2023ఏప్రిల్‌లో ఏం జరిగింది,ఎలా దొంగతనం చేశాడనే కోణంలో ఎంతకాలంగా అతను పరకామణిలో పనిచేశాడనే విషయాలపై తొలినుండి విచారణ చేపట్టి ఆస్తులు కూడబెట్టిన అంశంపై ఏసిబి రంగంలోకి దిగనుంది. ఇంకా అతని బ్యాంకు ఖాతాల లావాదేవీలుపై కూడా సమాచారం సేకరించే అవకాశం లేకపోలేదననేది తెలుస్తోంది. 2023 ఏప్రిల్ నెలలో 920 అమెరికన్ డాలర్లు చోరీచేస్తూ పటుబడిన రవికుమార్ పై తిరుమల వన్‌టౌన్ పోలీసులు 24/2023లోనే కేసు కూడా నమోదు చేశారు. ఆ తరువాత సమగ్ర విచారణ చేయాల్సిన పోలీసులను టిటిడి పెద్దలు ఎవరు నీరుగార్చేలా ప్రోధ్బలం చేశారనేది పూర్తిస్థాయి విచారణ తరువాత డిసెంబర్ 2వతేదీకి సిఐడి డిజి, ఏసిబి డిజి అందించే సీల్డ్‌కవర్ నివేదికల్లో వెల్లడికానుంది. ఇదిలా ఉండగా ఇప్పటికే పరకామణి కేసుకు సంబంధించి గతంలోనే హైకోర్టు న్యాయమూర్తి ఆదేశాలతో సిఐడి డిజి రవిశంకర్ అయ్యన్నార్ రెండువారాల క్రిందట తిరుమలకు చేరుకుని తిరుమల పోలీసుల నుండి పరకామణి చోరీ కేసుకు సంబంధించి రికార్డులను, సిడిలను, ఫైళ్ళను ,సిసికెమెరా ఫుటేజీలను స్వాధీనం చేసుకుని న్యాయమూర్తి ముందుంచిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు అయినప్పటి నుండి ఆ తరువాత చోటుచేసుకున్న పరిణామాలపై, లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకోవడం వరకు అన్ని కోణాల్లోనూ చివరకు లోక్‌అదాలత్ న్యాయమూర్తి అంశంపై కూడా పూర్తిస్థాయిలో విచారణ జరగనుండటంతో ఎక్కడకు దారితీస్తుందనేది హాట్‌టాఫిక్‌గా మారింది.

# దోషులకు ఉరిశిక్ష

>> ఉరిశిక్ష పడ్డ నిందితులు నష్టపరిహారంగా రూ.70 లక్షలు చెల్లించాలని ఇందులో రూ.50 లక్షలు హత్యకు గురైన మేయర్ కఠారి అనురాధ కుటుంబసభ్యులకు, ఈ కేసు ఫిర్యాదుదారుడైన సతీష్‌కుమార్ నాయుడుకు రూ.20 లక్షలు చెల్లించాలని కోర్టు ఆదేశించింది. అలాగే ఈ కేసు నేర విచారణ సమయంలో కేసును తప్పు ద్రోవ పట్టించడానికి అబద్దపు సాక్ష్యాలు చెప్పిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా వున్నాయి. 2015 నవంబర్ 17వ తేదీ చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో అప్పటి మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్‌లు దారుణ హత్యకు గురయ్యారు. మున్సిపల్ కార్యాలయంలోనే మేయర్ దారుణ హత్యకు గురికావడంతో ఈ హత్య రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కల్గించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు మేయర్ కఠారి అనురాధకు సమీప బంధువు అయిన శ్రీరామ్ చంద్రశేఖర్ అలియాస్ చింటూ ప్రధాన నిందితుడు అని, అలాగే వెంకటాచలపతి అలియాస్ ముల్బాగల్ వెంకటేష్, జయప్రకాష్‌రెడ్డి అలియాస్ రెడ్డి, తోటి మంజునాథ్, వెంకటేష్‌లతో పాటు మురుగన్, వెంకటయోగానందం, పరంధామలతో పాటు మొత్తం 23 మంది నిందితులని చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు ఛార్జీషీటు దాఖలు చేశారు. మేయర్ దంపతుల హత్య జరిగిన రోజు ఉదయం ప్రధాన నిందితుడు చంద్రశేఖర్ అలియాస్ చింటూ కార్యాలయంలో ఈ కేసులో నిందితులుగా వున్న మొదటి 8 మంది సమావేశమై మేయర్ దంపతుల హత్యకు స్కెచ్ వేశారు. ఈ మేరకు అప్పటికే మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం చేరుకున్న మురుగన్ కార్యాలయంలో మేయర్ కఠారి అనురాధ ఆమె భర్త కఠారి మోహన్‌లు వున్నారని చంద్రశేఖర్ అలియాస్ చింటూకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. చంద్రశేఖర్ అలియాస్ చింటూ, వెంకటాచలపతిలో తమ కదలికలను ఎవ్వరు గుర్తుపట్టకూడదని భావించి ముస్లీం మహిళలు ధరించి నల్లటి బురుఖాలు ధరించారు. చంద్రశేఖర్ ఒక లేడీస్ హ్యాండ్‌బ్యాగ్, వెంకటాచలపతి కూరగాయలు, కరివేపాకు వున్నట్లు ఒక స్టిక్ హ్యాండిల్ బ్యాగ్‌లు పట్టుకుని కార్యాలయంకి వచ్చి ప్రజలతో కలసిపోయారు. మిగిలిన ముగ్గురు నిందితులు వీరికి కొంత దూరంగా వుండి వీరిని అనుసరించారు. మురుగా మాత్రం కార్యాలయం బయట కారులో వుండి ఎదైనా అత్యవసర పరిస్థితి వస్తే అక్కడి నుండి నిందితులను అక్కడి నుండి తీసుకెళ్ళడానికి సిద్ధంగా వున్నాడు. మేయర్ ఛాంబర్ వద్దకు వెళ్ళిన వెంకటాచలపతి తన బ్యాగులో వున్న మూడు వేట కొడవళ్ళు తీసి జయప్రకాష్‌రెడ్డి అలియాస్ రెడ్డి, తోటి మంజునాథ్, వెంకటేష్‌లకు అందజేశాడు. ఆపై చంద్రశేఖర్ అలియాస్ చింటూ, వెంకటాచలపతిలు మేయర్ గది వైపు అడుగులు వేశారు. నేరుగా మేయర్ కఠారి అనురాధ దగ్గరకు వెళ్ళిన చంద్రశేఖర్ పిస్టల్‌ను మేయర్ తలకు గురిపెట్టి కాల్పులు జరుపడంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. ఆపై చంద్రశేఖర్, వెంకటాచలపతిలో కఠారి మోహన్‌పై దాడికి ప్రయత్నించగా అక్కడే వున్న సతీష్‌కుమార్ నాయుడు కఠారి మోహన్‌ను రక్షించడానికి ప్రయత్నించగా నిందితులు అతని వెనుకవైపు వీపు భాగంను నరికి గాయపరిచారు. అదే సమయంలో వెంకటాచలపతి కఠారి మోహన్‌పై తన ఎయిర్ పిస్టల్‌తో కాల్పులు జరుపడంతో కఠారి మోహన్ ప్రాణభయంతో పరిగెత్తగా చంద్రశేఖర్, వెంకటాచలపతి, జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్, వెంకటేష్‌లు ఆయనను వెంబడించి వేటకొడవళ్ళతో దాడి చేశారు. హత్యలు చేసిన నిందితులు అక్కడి నుండి తప్పుకున్నారు. కుప్పకూలిన మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్‌లను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మేయర్ కఠారి అనురాధ మృతి చెందడంతో కఠారి మోహన్ పరిస్థితి ఆందోళనకరంగా వుండటంతో మెరుగైన చికిత్స కోసం వేలూరు సిఎంసి ఆసుపత్రికి తరలించగా ఆయన అక్కడ మృతి చెందారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో అప్పటి ఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు చిత్తూరు డిఎస్పీ లక్ష్మీ నాయుడు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో కోర్టు 59మంది సాక్షులను విచారించింది.

## బాలికపై పలుమార్లు అఘాయిత్యం

**కోనసీమ బ్యూరో, అక్టోబరు 31 ప్రభాత వార్త:** మైనర్ బాలికపై తునిలో జరిగిన ఘటన మరువకముందే అంబేద్కర్ కోనసీమజిల్లాలో అలాంటి ఘటనే ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఐ.పోలవరం మండలంలోని బాణాపురమునకు చెందిన 10ఏళ్ళ (ఆరవ తరగతి చదువుతున్న) బాలికపై బాబిఅనే వ్యక్తి పలుమార్లు అఘాయిత్యంకి పాల్పడినట్లు తెలియ వచ్చింది. స్కూలుకు సమీపంలో ఉన్న ఒక భవనంలోకి తీసుకువెళ్లి బాలిక బట్టలు విప్పి వికృతి చేష్టలు చేశాడని బాలిక తల్లి పేర్కొన్నారు. బిల్డింగ్ లోంచి బయటికి రావడం చూసి బాలిక తల్లి నిలదీయడంతో బయటకు ఈ విషయం వెల్లడైంది. దీనిపై జిల్లా ఎస్పీకి బాలిక తల్లి బంధువులు ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాలతో బాలిక తల్లి నుండి పిర్యాదు తీసుకుని 6ఎ ఫోక్సో, సెక్షన్ 725 కేసు పోలీసులు నమోదు చేశారు.

# చర్చలు సఫలం

>> చెల్లింపునకు ప్రభుత్వం అంగీకరించింది. వచ్చేనెల బకాయిలు మొత్తం ఒకే విడతలో చెల్లిస్తామని ఏపీ ప్రైవేటు ఆస్పత్రుల అసోషియేషన్(ఆశ) ప్రతినిధులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ ఇచ్చారు. బకాయిల చెల్లింపుపై మంత్రి స్పష్టమైన హామీ ఇవ్వడంతో వైద్యసేవల పునరుద్ధరణకు యాజమాన్యాలు అంగీకరించాయి. రాష్ట్ర సచివాలయంలోని మంత్రి సత్యకుమార్ ఛాంబరులో మంత్రి, అసోసియేషన్ ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. ప్రభుత్వ బకాంఖలను వన్ టైం కింద చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ఆశా ప్రతినిధులనుద్దేశించి మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమస్యల పరిష్కారం గురించి ఎప్పటికప్పుడు చర్చించాను. వన్ టైం చెల్లింపు విధానంలో సమస్య శాశ్వత పరిష్కారానికి సిఎం సిద్ధంగా ఉన్నారు. వన్ టైం చెల్లింపు విధానం అమల్లోకొచ్చేలోగా మరో రూ.250 కోట్లు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటా. యూనివర్శల్ హెల్త్ పాలసీ కింద తీసుకునే నిర్ణయాల్లో సంఘం ప్రతినిధులను భాగస్వాములను చేస్తా. పెండింగులో ఉన్న ఆసుపత్రుల బిల్లుల పరిశీలనలకు యుద్ధప్రతిపాదికన సుమారు 50 మంది వైద్యులను నియమిస్తున్నాం. డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉన్నందున రోగుల ఆరోగ్య సంరక్షణను దృష్టిలో ఉంచుకుని వెంటనే వైద్య సేవలను కొనసాగించాలి "అని తెలిపారు. రెండువిడతల్లో ఇప్పటికే రూ.488 కోట్లు చెల్లింపు..బకాయిలను వెంటనే వెల్లించాలని కోరుతూ అక్టోబరు 10 నుంచి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు నెట్వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు సేవలు నిలిపివేశాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు మంత్రి సత్యకుమార్ చొరవతో ప్రభుత్వం రెండు విడతల్లో కలిపి రూ.488 కోట్లు విడుదలచేసింది. మరో విడత కింద రూ.250 కోట్లు చెల్లించేందుకు చర్యలు మొదలయ్యాయి మిగిలిన బకాయిలను నెట్వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం బ్యాంకుల నుండి పొందిన రుణాల ద్వారా వన్ టైం విధానంలో చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది..కూటమి ప్రభుత్వం చెల్లించిన మొత్తం రూ. 4,143 కోట్లు. ఇందులో గత వైకాపా ప్రభుత్వ బకాయిలు రూ.2,403.92 కోట్లున్నాయి. అలాగే కూటమి ప్రభుత్వం హయంలో ట్రస్టు ద్వారా జరిగిన వైద్య సేవలకైన మొత్తంలో రూ. 1739.28 కోట్లు చెల్లించింది. ప్రస్తుతానికి చెల్లించాల్సిన బకాయిల విలువ రూ.2,500 కోట్ల వరకు ఉంది. మంత్రితో ఆశా ప్రతినిధులు జరిపిన చర్చల్లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు సిఇఓ దినేష్ కుమార్‌పాల్గొన్నారు. నవంబర్ 15లోపు 250 కోట్ల రూపాయలు విడుదల చేసేందుకు ప్రభుత్వంఅంగీకరించిందని అసోషియేషన్ వెల్లడించింది. ఈమేరకు ఏపీ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ ప్రకటనను విడుదల చేసింది.



# వచ్చే మూడేళ్లలో అమరావతి తొలి దశ పూర్తి

### - నిర్దేశిత సమయానికి పనులు పూర్తవ్వాలి - పెండింగ్‌లోని రిటర్నబుల్ ప్లాట్లను త్వరగా రిజిస్ట్రేషన్ చేయాలి - సిఆర్‌డిఎ సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ అక్టోబర్ 31,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని నిర్మాణ పనులు జాప్యం లేకుండా జరగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యానికి నిర్మాణాలు పూర్తి కావాలని చెప్పారు. రాజధాని నిర్మాణ పనుల పురోగతి, బ్యూటిఫికేషన్, రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ వంటి అంశాలపై శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్షి ంచారు. ఏయే నిర్మాణాలను ఎంత వరకు పూర్తి చేశారు..? వర్క్ ఫోర్స్ ఏ మేరకు ఉంది..? నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్, మెషినరీని ఆయా సంస్థలు ఏ మేరకు సమకూర్చుకున్నాయనేదానిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏయే భవనాలను ఎప్పటిలోగా పూర్తి చేయాలో నిర్దిష్ట సమయాన్ని నిర్దేశించుకున్నామని... ఆ మేరకు పనులను పూర్తి చేయాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. నిర్మాణాల్లో వేగంతో పాటు.. నాణ్యత ప్రమాణాలను పక్కాగా పాటించాలని ఆదేశించారు. పనుల పురోగతిపై ప్రతి 15 రోజులకోసారి సమీక్షి స్తానని చెప్పారు. ప్రస్తుతం వర్షాల కారణంగా నిర్మాణ పనుల్లో కొంత మేర జాప్యం జరిగినా.. రానున్న రోజుల్లో దాన్ని భర్తీ చేసేలా నిర్మాణాల్లో వేగం పెంచాలని చంద్రబాబు సూచించారు. ఇంకా కొన్ని నిర్మాణ సంస్థలు వర్క్ ఫోర్స్, మెషీనరీని పూర్తి స్థాయిలో కేటాయించలేదని... ఇలా ఉన్న సంస్థలు తమ పనితీరు మెరుగుపరుచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇక రాజధాని భవనాల నిర్మాణాలకు అవసరమైన గ్రావెల్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని అన్నారు. ఈ మేరకు గనుల శాఖతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి చెప్పారు. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎంతవరకు పూర్తైందని సీఎం ఆరా తీశారు. రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ల విషయంలో రైతులకు ఏ మాత్రం ఇబ్బందులు రానివ్వొద్దని మంత్రి నారాయణ, అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సందర్భంగా రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన వివరాలు అధికారులు అందించారు. ఇంకా 2,471 మంది రైతులకు రిటర్నబుల్ ప్లాట్లను రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉందని.. ఇవి కూడా చిన్నపాటి సాంకేతిక, రైతుల వ్యక్తిగత అంశాల కారణంగా పెండింగులో ఉన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. తాను కూడా త్వరలోనే రాజధాని రైతులతో సమావేశమవుతానని ముఖ్యమంత్రి తెలిపారు. రాజధానిలో నిర్మాణాలకు ఎంతటి ప్రాధాన్యమిస్తున్నామో..గ్రీనరీ, సుందరీకరణ, పరిశుభ్రతకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. రాజధానుల గార్డెనింగ్, బ్యూటిఫికేషన్ వంటి వాటిల్లో ఎలాంటి రాజీపడొద్దని సూచించారు. ఇక ప్రైవేట్ సంస్థలు చేపట్టే నిర్మాణాలు కూడా ఐకానిక్ మోడల్లో ఉండేలా చూడాలని ఆయా సంస్థల ప్రతినిధులను కోరాలని అధికారులకు సూచించారు. అమరావతికి వరల్డ్ క్లాస్ సిటీ లుక్ రావాలంటే హైరెయిజ్ బిల్డింగులు ఉండాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

## రైతుల కష్టాలు తీర్చడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలం: సిపిఐ రామకృష్ణ

**విజయవాడ,అక్టోబరు 31,ప్రభాతవార్తప్రతినిధి:** మొంథా తుఫానున వల్ల తీవ్ర పటం నష్టం జరిగింది అని సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ అన్నారు. గిట్టుబాటు ధరలు లేక అనేక ఇబ్బందులు పడుతున్న రైతులకు తుఫాను శాపం...రైతుల కష్టాలు తీర్చడంలో చంద్రబాబు సర్కార్ విఫలం...బుడమేరు వరద సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు బుట్ట దాఖలయ్యాయి. చంద్రబాబు ప్రభుత్వం రైతులకు భరోసా ఇవ్వలేదన్నారు. సత్యసాయి జయంతి ఉత్స వాలకు మంత్రుల కమిటీ ఏర్పాటు హాస్యాస్పదంగా ఉందన్నారు. బాబా జయంతి వేడుకల కోసం సత్యసాయి ట్రస్ట్ ఏర్పాట్లు చేస్తోంది...మంత్రులకు పనీపాటా లేనట్లు ఉందని సిపిఐ రామకృష్ణ అన్నారు.అయితే,చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే తుఫాను భాధితులను ఆదుకోండి అని సిపిఐ రామకృష్ణ సవాల్ చేశారు. టీడీపీ ఎంఎల్ఏలు కబ్జాకోరులుగా మారిపోయారు...ఎంఎల్ఏల కబ్జాలపై ముఖ్యమంత్రి ఎందుకు చర్యలు తీసుకోలేదు అని డిమాండ్ చేశారు. చంద్రబాబు పబ్లిసిటీ పిచ్చి పట్టిందని ఆయన విమర్శలు గుప్పించారు. నారా లోకేష్ రెడ్‌బుక్‌లో టీడీపీ నేతల దాష్టీకాలు కనబడవా?...రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టడంలో పవన్‌కళ్యాణ్ విఫలం అయ్యారు. సీజ్ ది షిప్ అన్నారు...కనీసం ఒక్క ఆటో కూడా సీజ్ చేయలేకపోయారని రామకృష్ణ మండిపడ్డారు.

# కల్తీనెయ్యి కేసు అక్రమాలు వైవి చుట్టూనే!

### - కదులుతున్న టిటిడి గత పెద్దల గుట్టు - ఎసిబి కోర్టులో అప్పన్న కస్టడి పిటిషన్



**తిరుమల,అక్టోబర్ 31ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూల తయారీలో కల్తీనెయ్యి సరఫరాచేసిన పాపంలో సూత్రధారులైన గత టిటిడి పెద్దల అవినీతిగుట్టు రట్టయ్యే సమయం ఆసన్నమైంది. ఇందులో ముఖ్యంగా 2022లో అప్పటి టిటిడి బోర్డు ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి అక్రమాలు భారీగానే ఉన్నాయని సిబిఐ సిట్ అధికారులు ఆధారాలు సేకరించారు. ఈ కీలకమైన సంచలన కేసులో వైవి సుబ్బారెడ్డి అంతరంగికుడు వ్యక్తిగత సహాయకుడుగా (పిఎ)గా వ్యవహరించిన కె.చిన్నఅప్పన్నను సిట్ అధికారులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కల్తీనెయ్యి గుట్టులో కీలకంగా సిట్ సుబ్బారెడ్డిని భావిస్తోంది. ఇంకా మరింత కీలక సమాచారం సేకరించడానికి అప్పన్నను కస్టడీకి తీసుకునేందుకు సిఐబి సిట్ అధికారులు నెల్లూరు ఏసిబి కోర్టులో శుక్రవారం కస్టడీ పిటిషన్ దాఖలు చేశారనేది తెలుస్తోంది.న్యాయమూర్తి నేడు విచారణ చేసి కస్టడీకి ఇచ్చే అవకాశం ఉందని సిట్ అధికారులు భావిస్తున్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో 2022లోనే అప్పన్న సుబ్బారెడ్డి వద్ద పనిచేస్తూ భారీగా కుట్రలకు తెరలేపారని, బోలేబాబాడెయిరీతోబాటు ఏఆర్ డెయిరీ,వైష్ణవి డెయిరీ, ప్రీమియర్‌అగ్రిఫుడ్స్‌తో ఒప్పందంతో భారీగా కమీషన్లు 50లక్షల వరకు రాబట్టారనేది సిట్ విచారణలో వెలుగుచూసిన అంశాలు.అంతేగాక అప్పన్న బ్యాంకు లావాదేవీల్లో 4.50కోట్ల రూపాయలు నిల్వ ఉండటం, ఆయనపేరున కొన్ని చోట్ల 14వరకు స్థలాలు, ప్లాట్లు ఉన్నాయని సిట్ సేకరించిన సమాచారం. ఈ సమాచారంతో మరింత కీలకంగా ఆధారాలు రాబట్టేందుకు మాజీ ఛైర్మన్, రాజ్యసభసభ్యుడు వైవి సుబ్బారెడ్డికి నోటీసులు జారీచేసి విచారణ చేయాలని సిట్ నిర్ణయించింది. అప్పన్నను కస్టడీకి తీసుకునే ముందు వైవి కి నోటీసులు జారీకానున్నాయి. కల్తీనెయ్యి బాగోతంలో ఇప్పటికే కొనుగోళ్ళ జిఎంను పూర్తిగా విచారణ చేసిన సిట్ ఆ సమాచారంతో సుబ్బారెడ్డిని విచారణ చేయాలని ఏసిబి న్యాయమూర్తికి వివరించినట్లు తెలుస్తోంది. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అప్పటి సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాబాయి వైవి సుబ్బారెడ్డిని టిటిడి బోర్డు ఛైర్మన్‌గా నియమించింది, 2022లోనూ ఆయనకు మళ్ళీ ఛైర్మన్ పదవిని కట్టబెట్టారు. ఆ సమయంలో ఆయన తన అనుచరులకు పెత్తనం ఇచ్చారనేది సిబిఐ సేకరించిన సమాచారం. 2020నుండే నెయ్యిసరఫరా టెండర్లు దక్కించుకుని చివరకు కల్తీనెయ్యి పంపిన కేసు విచారణలో కీలక పరిణామాలు ఇప్పుడు చోటుచేసుకుంటున్నాయి. కల్తీనెయ్యి పాపంలో అసలు సూత్రధారులు ఎవరున్నారనే విషయం ఇప్పుడు తేల్చేపనిలో నిమగ్నమైంది. ఇప్పటికే కల్తీనెయ్యి పాపంలో పాత్రధారులైన ఏఆర్ డైరీ ఎండి రాజశేఖరన్‌తోబాటు సరఫరా దారులు ఉత్తరప్రదేశ్‌కు, ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, శోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక)సిఇఒఅపూర్వవినయ్‌కాంత్‌చావ్డాలను అరెస్టుచేసింది. తాజాగా అప్పన్న అరెస్ట్‌తో కల్తీనెయ్యి గుట్టులో విస్తుబోయే విషయాలు వెల్లడయ్యాయి.

# పెహల్గాం సైనికులు, సిఆర్‌పిఎఫ్ సిబ్బందికి కేంద్రం అవార్డులు

### తెలుగు రాష్ట్రాల నుంచి ఏడుగురి ఎంపిక

### మొత్తం 1,463 మందికి ఏక్తా అవార్డులు

**హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** ఈ యేడాది ఏప్రిల్‌లో పెహల్గాంలో పర్యాటకులపై పాక్ ప్రేరేపిత ఉగ్ర వాదులు జరిపిన దాడి తరువాత ఉగ్రవాద ఆపరేషన్‌లో పాల్గొన్న 40 మంది సైనికులతో పాటు పారా మిలటరీ అధికారులకు కేంద్రం ప్రత్యేక అవార్డులను ప్రకటించింది. వీరిలో కా శ్మీర్ రేంజి ఐజి వికె బిర్డి, శ్రీనగర్ ఎస్పి సందీప్ చక్రవర్తి, జమ్మూ కాశ్మీర్ పోలీసు విభాగంలోని 19 మంది పోలీసులతో పాటు సిఆర్‌పిఎఫ్‌కు చెందిన 21 మంది అధికారులు, సిబ్బంది కూడా ఉన్నారు. దివంగత కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ జన్మదినం సందర్భంగా అక్టోబరు 31న ప్రతీయేటా నిర్వహించే ఏక్తాదివస్ రోజున ఈ అవార్డులను కేంద్ర హోంశాఖ ప్రకటించింది. దీంతోపాటు దేశవ్యాప్తంగా నక్స లిజంతో పాటు ఉగ్రవాదం విషయంలో ఆయా రాష్ట్రాల పోలీసులతో కలిసి పోరాడుతున్న పారా మిలటరీ బలగాలు, ఆయా రాష్ట్రాల పోలీసులు మరో 1463 మందికి ప్రత్యేక ఆపరేషన్ అవార్డులను కేంద్రం ప్రకటించింది.

ఇందులో తెలంగాణ నుంచి హెడ్ కానిస్టేబుల్ ఎ. లక్ష్మణ్ రావు వున్నారు. దీంతోపాటు దేశవ్యాప్తంగా కీలక కేసుల విచారణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఆయా రాష్ట్రాల అధికారులు మరో 93 మందికి కూడా కేంద్రం అవార్డులను ప్రకటించింది. ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచి ఒక ఎస్‌పి, మరో అదనపు ఎస్‌పిసహా ఏడుగురు అధికారులున్నారు. ఎపి నుంచి ఐపిఎస్ అధికారి అద్నాం నయీం హాష్మీ, అదనపుఎస్‌పి భీమారావు, డిఎస్‌పి జయసూర్య, ఎస్‌ఐ నసీరుల్లా వున్నారు. తెలంగాణ నుంచి ఇన్‌స్పెక్టర్లు నగరి చంద్రబాబు, ఉపేంద్రరావు, తిరుపతి ఉన్నారు. వీరితోపాటు ఫోరెన్సిక్ లాబ్ విభాగంలో విచారణాధికారులకు కీలక ఆధారాలు అందించడంలో విశేష ప్రతిభ కనబర చిన మరో తొమ్మిది మంది అధికారులకు కేంద్రం అవార్డులు ప్రకటించింది. వీరిలో ఎపి నుంచి అసిస్టెంట్ డైరెక్టర్ ఫణిభూషణ్ ఉన్నారు. వీరంతా కేంద్ర హోంశాఖ మంత్రి దక్షతా పథక్ అవార్డులను అందుకోనున్నారు.

## 'లై డిటెక్టర్ టెస్టుకు, సిబిఐ విచారణకు, చివరికి నార్కో టెస్టుకైనా సిద్ధం

### - మాజీ మంత్రి జోగి రమేష్

**విజయవాడ,అక్టోబరు 31,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ పై వైసీపీ నేత జోగి రమేశ్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసారు.తాను నారా వారి సారా వ్యవహారాన్ని బయటపెట్టినందుకే తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, తనను ఓ కేసులో ఇరికించి పార్టీని దెబ్బతీయాలని చూస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. జోగి రమేశ్ మాట్లాడుతూ, "రాష్ట్రంలో నారా వారి సారా దందాను ఇబ్రహీంపట్నం కేంద్రానికి వెళ్లి మరీ ప్రజల ముందు ఉంచాను. అప్పటి నుంచే నాపై కుట్రలు మొదలుపెట్టారు. ఈ అంశాన్ని రాజకీయంగా పక్కదారి పట్టించేందుకే నన్ను లక్ష్యంగా చేసుకున్నారు. చంద్రబాబు, లోకేశ్ నన్ను బద్నాం చేసి, వైసీపీని డ్యామేజ్ చేయాలని దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు" అని విమర్శించారు. ఈ క్రమంలో తాను ఏ విచారణకైనా సిద్ధమని ఆయన స్పష్టం చేశారు. "లై డిటెక్టర్ టెస్టుకు, సీబీఐ విచారణకు, చివరికి నార్కో టెస్టుకైనా నేను సిద్ధం. తిరుమల వెంకన్న సన్నిధిలో ప్రమాణం చేస్తానని చెప్పాను. విజయవాడ దుర్గమ్మ వద్ద నా కుటుంబంతో సహా ప్రమాణం చేశాను. అయినా ఎవరూ స్పందించడం లేదు" అని జోగి రమేశ్ తెలిపారు. చంద్రబాబు తన హృద యాన్ని, వ్యక్తిత్వాన్ని గాయపరిచారన్నారు.



సంఘటిత ర్యాలీ దృశ్యం

## సర్దార్ పటేల్ 150వ జయంతి సందర్భంగా విజయవాడలో సంఘటిత యాత్ర

**విజయవాడ, అక్టోబర్ 31,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలంతా సంఘటితంగా ఉంటే దేశం,రాష్ట్రం అభ్యున్నతిని సాధిస్తాయని పలువురు వక్తలు అన్నారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా విజయవాడలో సంఘటిత యాత్ర(ర్యాలీ )నిర్వహించారు. శుక్రవారంఇందిరాగాంధీ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు ర్యాలీ సాగింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ , ఎంపీ కేశినేని శివనాథ్ ఇతర నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ... దేశాన్ని ఒక్కటిగా చేసిన మహనీయుడు సర్దార్ పటేల్ అని కొనియాడారు. ఆయన కలలు సాకారం చేసేలా ఆయన జయంతి రోజు సమైక్యత పరుగు నిర్వహిస్తున్నామని తెలిపారు. భారత దేశ తొలి హోమ్ మినిస్టర్‌గా పనిచేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కారణంగా భారతదేశమంతా సమైక్యంగా ఉందన్నారు. స్వేచ్ఛతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. ఆయన 150వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా పటేల్‌ను స్మరిస్తూ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. దేశంలో ఉన్న 560 సంస్థానాలను కలిపి భారతదేశం అంతా ఒకటిగా చేసిన వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని పేర్కొన్నారు. స్వాతంత్రం తర్వాత కూడా ఆయన నిరంతర కృషితో ప్రజల కోసం, దేశం కోసం పనిచేశారన్నారు. నిజాంలు స్వయం ప్రతిపత్తి కోరితే దేశమంత సమైక్యంగా ఉండాలని దేశంలో అందరూ భాగస్వామ్యం కావాలని వారికి గట్టిగా చెప్పిన వ్యక్తి పటేల్ అని చెప్పుకొచ్చారు. ఆయన నేతృత్వంలో జమ్మూకాశ్మీర్ సమస్యను పరిష్కరించేందుకు కూడా కృషి చేశారని తెలిపారు. ఆనాడు నెహ్రూ తొందర పాటు నిర్ణయం వల్ల నాటి నుంచి 2019 వరకు ఆ సమస్య అలాగే ఉందన్నారు. ప్రధాని మోడీ రెండోసారి అధికారంలోకి రాగానే 370 అధికరణ కింద జమ్ము కాశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేశారన్నారు. భారతదేశ ప్రజలందరూ స్వదేశీ వస్తువుల్ని కొనుగోలు చేయాలని కోరారు. లోకల్ ఫర్ వోకల్ నినాదాన్ని అందుకొని మనవారిని మనమే ప్రోత్స హించుకోవాలని సూచించారు.

## వివేకా హత్యపై సిబిఐ కోర్టులో సునీతారెడ్డి పిటిషన్

### నాలుగో తేదీకి విచారణ వాయిదా

**హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** మాజీమంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసుపై విచారణను కొనసాగించాలని నాంపల్లి సిబిఐ కోర్టులో ఆ యన తనయ సునీతారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ నవంబరు నాలుగవ తేదీకి వాయిదా పడింది. సునీతా రెడ్డి పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరి గింది. ఈ కేసులో నిందితులుగా వున్న అవినాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శంకర్‌రెడ్డిపాటు ఇతర నిందితులు కౌంటర్ దాఖలు చేయగా ఏ2గా వున్న సునీల్‌యాదవ్ ఇందుకు సమయం కోరారు. దీనిని పరిగణలోకి తీసు కున్న సిబిఐ కోర్టు తదుపరి విచారణను వాయిదా వేసింది.

# మాగాణి రైతులను ఆదుకుంటాం

### - పంట నష్టాన్ని తగ్గించేందుకు రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించాలి : మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ అక్టోబర్ 31,ప్రభాతవార్తప్రతినిధి:** మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వరి పంటలకు నష్టం వాటిల్లిన నేపథ్యంలో, పంట రక్షణ చర్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జాయింట్ డైరెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతుల కష్టానికి ప్రతిఫలం లభించేలా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి అచ్చెన్న తెలిపారు. పంట నష్టం తగ్గించేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ, హార్టికల్చర్, గ్రౌండ్ వాటర్ మరియు మెట్రోలాజికల్ అధికారులతో సమన్వయం కలిగి పనిచేయాలని సూచించారు. ప్రతి మండల వ్యవసాయాధికారి స్థాయిలో పంట నష్టం అంచనాలు ఖచ్చితంగా సేకరించి, రైతులకు తక్షణ ఉపశమనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో శాస్త్రవేత్తల సహాయంతో పంట రక్షణ పద్ధతులు అమలు చేయాలని సూచించారు. రైతుల సమస్యలు, నష్టాలపై అధికారుల నుంచి సమగ్ర నివేదిక అందించాలని, వాటిని త్వరగా ప్రభుత్వానికి సమర్పించి సాయం అందించే దిశగా చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతు భవిష్యత్తు మనకు ప్రాధాన్యం. ప్రతి ధాన్యపు గింజ విలువైనది. రైతుకు నష్టం రాకుండా ప్రతి అధికారి నిబద్ధతతో వ్యవహరించాలి అని పేర్కొన్నారు. కృష్ణా జిల్లాలో పంట ముంపు ప్రాంతాలు పర్యటించినప్పుడు రైతులు తమ పంట నష్టం క్రింద నమోదు చేసుకుంటే ఆ భూమిపై పండిన వరి అమ్ముకోడానికి అవ్వదు.

# విధి నిర్వహణలో మహిళా ఉద్యోగుల పాత్ర కీలకం

### - సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎల్.స్వర్ణలత

**విజయవాడ,అక్టోబరు 31,ప్రభాత వార్తప్రతినిధి:** ప్రభుత్వ కార్యాలయా లలో పనిచేసే మహిళా ఉద్యోగులు అధికారులు విధి నిర్వహణలో అం దించే సేవలు ఎంతో కీలకం అని ప్రజ లకు ప్రభుత్వానికి వారధి అయిన సమా చార పౌర సంబంధాల శాఖ లో అత్యంత సమర్ధవంతం గా సేవ లందించిన సూపరింటెండెంట్ ఎం.రూ పవాణి, విజయవాడ రాష్ట్ర సమాచార కేంద్రం, లైబ్రేరియన్ గా పనిచేస్తున్న జాస్తి వెంకటలక్ష్మి పనితీరు అభినందనీ యమని సమాచారశాఖ అదనపు సం చాలకులు ఎల్.స్వర్ణలత అన్నారు.ఆమె శుక్రవారం పదవి విరమణ చేయనున్న రూపవాణి, వెంకటలక్ష్మి లకు రాష్ట్ర సమచార , పౌర సంబంధాల కమిష నర్ కార్యాలయంలో కార్యక్రమం.

# తిరుమల సమాచారం



## దేవుని కృపకు పాత్రులవ్వాలనే మెట్లోత్సవం

### - దాససాహిత్యకళాకారులతో భక్తితో పాదయాత్ర

**తిరుమల,అక్టోబర్ 31ప్రభాతవార్తప్రతినిధి:** ఎందరో మహనీయులు భగవంతునిపై భక్తిప్రపత్తులతో తిరుమలకొండలను అధిరోహించి, స్వామివారి వైభవాన్ని దశదిశలా వ్యాప్తిచేశారని టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మహనీయుల అడుగుజాడల్లో నడిచి ఆ దేవదేవుని కృపకు అందరూ పాత్రులు కావాలనే తలంపుతో టిటిడి ఏటా మెట్లోత్స వం నిర్వహిస్తుందన్నారు. త్రైమాసిక మెట్లోత్స వం శుక్రవారం వేకువజామున అలిపిరి పాదాలమండపం వద్దనుండి మొదలైంది. ఇలాంటి మెట్లోత్స వంలో పాల్గొనడం పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నామన్నారు. దాససాహిత్యప్రాజెక్టు ప్రత్యేక అధికారి ఆనందతీర్థాచార్యులు ,పలురాష్ట్రాల నుండి వచ్చిన దాససాహిత్యప్రాజెక్టు భజనమండళ్ళ కళాకారులు భక్తితో గోవిందనామస్మరణలు, భజనలు చేసుకుంటూ అలిపిరి మెట్లదారిలో తిరుమలకు వచ్చారు. అందరూ కలసి ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

## త్వరలో శ్రీవారి వైద్యసేవ

### - దేశవ్యాప్తంగా టిటిడి ఆలయాల్లో శ్రీవారిసేవ - ఇఒ సింఘాల్,అదనపు ఇఒ చౌదరి



**తిరుమల,అక్టోబర్ 31ప్రభాత వార్తప్రతి నిధి:** ధార్మికసంస్థ తిరుమలతిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆస్పత్రుల్లో రోగులకు ఇతోధిక సేవలందించేందుకు శ్రీవారివైద్యసేవ త్వరలోనే ప్రారంభిస్తున్నట్లు టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. తిరుపతి–తిరుమలలోని అశ్విని ఆస్పత్రి, ఆయుర్వేద ఆస్పత్రి, స్విమ్స్ ,బర్డ్ ఆస్పత్రులతోబాటు చిన్న పిల్లల ఆస్పత్రుల్లో రోగులకు సేవచేయనున్నారని చెప్పారు. ఇందుకు సంబంధించి శ్రీవారివైద్యసేవసెల్‌ను ప్రత్యేకంగా ఏర్పాటుచేయాలని సిపిఆర్‌ఒ డాక్టర్ తలారి రవికి ఆదేశించారు. శ్రీవారిసేవకులకు డిసెంబర్‌నెలలో ట్రైనర్లకు శిక్షణాకార్యక్రమంతో మరింత చక్కటి సేవలందిస్తారని అభిప్రాయం వెలిబుచ్చారు. శ్రీవారిసేవపై శుక్రవారం సాయంత్రం టిటిడిపరిపాలన భవనంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి,జెఇఒ వీరబ్రహ్మం, సిపిఆర్‌ఒ డాక్టర్ తలారి రవి, ఐటి జిఎం ఫణికుమార్‌నాయుడు, బర్డ్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ జగదీశ్, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వికుమార్, పద్మావతిచిన్నపిల్లల ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, ముఖ్యవైద్యాధికారి డాక్టర్ నర్మద,ఆయుర్వేదకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుదీక్షిత్, ఐఐఎం ప్రతినిధులతో కలసి ఇఒ సింఘాల్ సుదీర్ఘసమీక్ష నిర్వహించారు. దేశంలోని టిటిడి ఆలయాల్లో శ్రీవారిసేవకులతో భక్తులకు సేవలందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా చెన్నై, హైదరాబాద్,విశాఖపట్నం, కన్యాకుమారి, బెంగుళూరు వంటి నగరాల్లోని శ్రీవారి ఆలయాల్లో మొదటి విడతగా శ్రీవారిసేవ ప్రారంభించాలన్నారు..మిగిలిన ఆలయాల్లో మలివిడతగా ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్వీ గోసంరక్షణశాలలోకూడా శ్రీవారిసేవకులతో గోసేవను చేయడానికి వీలుగా కార్యాచరణ రూపొందించాలన్నారు. శ్రీవారిసేవకుల ట్రైనర్లకు శ్రీవేంకటేశ్వర వైభవం, తిరుమల సమాచారం. మన సనాతనధర్మం,విలువలు, మేనేజ్‌మెంట్, లీడర్‌షిప్ ,సేవా తత్పరత తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని ఇఒ సింఘాల్ తెలిపారు.

## శ్రీవారి సేవలో ఎసిబి డిజి అతుల్‌సింగ్



**తిరుమల,అక్టోబర్ 31ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని ఏసిబి డిజి అతుల్‌సింగ్ దంపతులు దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం ప్రోటోకాల్ విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో ఆలయంవద్దకు వచ్చిన ఆయనకు తిరుమల పోలీసు అధికారులు స్వాగతం పలికారు. ఆలయంలోపలకు చేరుకున్న అతుల్‌సింగ్ దంపతులు శ్రీవారి ఆశీస్సు లందుకున్నారు. ఆలయ అదికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుమలలో మీడియాకు దూరంగా ఉన్నారు.

## రూ.2,300కోట్ల నిధులతో దేశవ్యాప్తంగా ఆలయాల్లో అన్నదానం

### - ఆయుధపూజలో టిటిడి ఇఒ సింఘాల్



**తిరుమల,అక్టోబర్31ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వచ్చే భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా నాణ్యతతో అన్నప్రసాదం అందిస్తున్న టిటిడి అన్నదానం విభాగం సేవలు శ్లాఘనీయ మని టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ తెలిపారు. 1985లో నిత్యాన్నదానం పథకం ప్రారం భించగా, 1994లో శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్‌గా మార్పుజరిగిందన్నారు. ప్రస్తుతం ఈ ట్రస్ట్‌లో 2,300 కోట్లరూపాయలు నిధులు ఉన్నాయని, గత ఆరునెలల్లో 180కోట్లు రూపాయలు విరాళాలు దాతలు అందించారని తెలిపారు. శుక్రవారం ఉదయం తిరుమలలో వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో ఆయుధపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ సింఘాల్ మాట్లాడుతూ తిరుమలకు విచ్చేస్తున్న భక్తులందరికీ నాణ్యమైన అన్నప్రసాదాలను అందిస్తున్నామన్నారు. ఇందుకు కృషి చేస్తున్న అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. దేశవ్యాప్తంగా ఉన్న టిటిడి ఆలయాల్లో అన్నదానం చేయాలని బోర్డు తీర్మానించిందన్నారు. ఇందుకు అవసరమైన సిబ్బందిని నియమించేందుకు ఆమోదం తెలిపిందన్నారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఐదువేల ఆలయాల నిర్మాణాన్ని, అవసరమైన చోట్ల ఆయా ప్రాంతాలనుబట్టి మూడురకాలుగా నిధులు కేటాయించాలని నిర్ణయించామన్నారు. 10లక్షలురూపాయలు, 15లక్షలు, 20లక్షలు రూపాయలు కేటాయించేందుకు మొత్తం 750 కోట్లరపాయలు కేటాయించేందుకు బోర్డు ఆమోదం తెలిపిందన్నారు.దాతల సహకారంతో అన్నప్రసాదాలను మరింతగా భక్తులకు విస్తరించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ రాజేంద్ర, సోమన్నారాయణ, ఇఇ సుబ్రమణ్యం, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి జిఎల్‌ఎన్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. అన్నప్రసాద సిబ్బందిని సన్మానించారు.

## రాష్ట్రానికి పెట్టుబడులు వస్తుంటే అక్కసు ఎందుకు?: బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి యామినీ శర్మ

**విజయవాడ,అక్టోబరు 31,ప్రభాతవార్తప్రతి నిధి:**మోదీ ప్రభుత్వ పాలసీలు,సంస్క రణలు,రాయితీల వల్ల దేశానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తుంటే కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేకపోతోందని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి యామినీశర్మ విమర్శించార చంద్రబాబు విజన్ వల్ల ఏపీ అభివృద్ధి చెందుతుంటే అడ్డుకోడానికి వైసీపీ కుట్రలు పన్నుతోందని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థిరత్తం లేక ప్రాజెక్టులను కోల్పోతోందని, అవినీతిలో కూరుకుపోయిన ఆ పార్టీ నాయకులు ఏపీలో అభివృద్ధిని చూసి ఓర్వలేక ఏడుస్తున్నారని ఎద్దేవా చేశాడు. ఎన్డీయే పాలకుల విజన్ వల్ల విశాఖకు గూగుల్ ఏఐ డేటా సెంటర్ వచ్చిందన్నారు. ఇన్నాళ్ళూ ప్రతిపక్ష హోదా కావాలని గోల చేసిన జగన్..తుఫానుతో రాష్ట్ర ప్రజలు అల్లాడుతుంటే ఎక్కడికెళ్ళారని యామినీశర్మ ప్రశ్నించారు.

వార్త

హంస ఏ విధంగా నీటిని వదిలి పాలను మాత్రమే గ్రహిస్తుందో, సాధకుడు అదే విధంగా శాస్త్రాలలోని సారాన్ని గ్రహించి, మిగిలింది విడిచిపెడతాడు.

-ఖలీల్ జిబ్రాన్

# నిరర్థక ప్రయోగాలేల!


వరుణుడి కటాక్ష వీక్షణాల కోసం రాజధాని నగరం ఎదురుచూస్తున్నా ఒక చుక్కనీరు కూడా కురవలేదు. కాలుష్యం తగ్గాలంటే వర్షం కురిస్తే సరిపోతుందని ఎవరు సెలవిచ్చారో కానీఢిల్లీ పాలక వర్గం 'క్లౌడ్ సీడింగ్' ప్రక్రియను చేపట్టింది. ఎంతో ఖర్చు చేసింది. అయినా ఢిల్లీ కాలుష్యం ఇప్పటికీ ఏక్యూఐ 375 వద్దనే ఉంది. అంటే అనుకున్నది సాధించడంలో వారి పథకాలు అంచనాలు ఫలవంతమైనట్లే కదా! చరిత్ర లో ఎన్నడూ ఏ ప్రాంతంలోనూ 'క్లౌడ్ సీడింగ్' ప్రక్రియ ఫలవంతమైన రికార్డులేవీ నమోదు కాలేదు. బుధవారం వరకు మూడుసార్లు మేఘాల సీడింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. శుక్రవారం నాటికి కూడా ఎలాంటి వర్షపాతమూ ఢిల్లీ ఛాయల్లో నమోదు కాలేదు. ఈ ప్రాజెక్టును కాన్పూరు ఐటిఐ నిపుణుల అంచనాల ప్రకారం మేఘాల తేమను బట్టి 24 గంటల్లో ఎప్పుడైనా వర్షాలు పడవచ్చునని విశ్వాసంతో ఎంతో వ్యయపరచి 'క్లౌడ్ సీడింగ్' ప్రయోగాలు చేశారు. అయితే ఢిల్లీ నోయిడా బోర్డర్‌లో 0.1 నుంచి 0.2 మి.మీ తేలిక పాటి వర్షపాతం నమోదైందని ఈ ప్రయోగాన్ని నిర్వహించిన సంస్థ చెబుతోంది. తొలి సీడింగ్ న్యూఢిల్లీలోనూ, రెండోది మీరట్‌లోనూ ఆ సంస్థ విమానం నుంచి క్లౌడ్ సీడింగ్ జరిపినట్లు సమాచారం. నగరంలోని ఖేక్రా, బురా, విహార్, సడక్‌పూర్, భుజ్‌పూర్, నార్త్ కరోల్‌బాగ్, మయూర్‌లలోను, బురారి, మయూర్ విహార్, ఖేక్రా, పాలిస్ కుక్‌పూర్, నోయిడా, భోజ్‌పూర్, మోడినగర్‌లలో జరుగగా తమ ప్రయోగాలు పరిపక్వదశ కు వచ్చినట్లు ప్రయోగసంస్థ ప్రకటించింది. 25పాయింట్ల వాయుకాలుష్యాన్ని తగ్గించే ప్రక్రియలో భాగంగా జరిగినా ఎలాంటి ప్రయోజనం కనపడలేదు. వర్షపు బిందువు కూడా ఎవరికీ కనపడలేదు. కాలుష్యరహిత రాజధానిగా చేయడానికి ఢిల్లీ ప్రభుత్వాలు చేపట్టని ఆలోచన లేదు. చేయని ప్రయోగమూ లేదు. ఎన్నో విధాలుగా వాహనా లను క్రమబద్ధీకరించినా, ఎంత కట్టడిచేసినా ఇసుమంతైనా కాలుష్య తీవ్రత తగ్గలేదు. జూన్ 2025లో సీడింగ్ ప్రణాళికను చేపట్టారు. కృత్రిమ వర్షంగా పిలువబడే 'క్లౌడ్ సీడింగ్' సాంకేతికత ఎందుకు విఫలమైందో శాస్త్రజ్ఞులు ఎవరూ చెప్పలేకపోతున్నారు. అలాంటి ప్రయోగాలకు వరుణుడు కరుణిస్తాడని ఆ మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వానలు రాని తరుణంలో పంటలు ఎండిపోకూడదని, సామాన్యుని ఆహార భద్రతకు ఎలాంటి లోటు రాకుండా చేయాలనే ఉద్దేశ్యంతో చేపట్టారు. ఫలితం శూన్యం. ఆ తర్వాత కూడా ఇదే లక్ష్యంతో కృత్రిమ వర్షం కురిపించాలన్నా సాధ్యం కాలేదు. పాలకులకు అదొక విఫల మనోరథంగా మిగిలిపోయింది. రాష్ట్ర ఖజానాకు చేతి చమురు మాత్రం వదిలింది అని సరిపెట్టుకోవాల్సి వచ్చింది. తాజాగా ఢిల్లీ ప్రభుత్వం వేరొక లక్ష్యంతో కృత్రిమ వర్షం కురిపించే ప్రయత్నం చేసింది. కానీ ఫలితం లేదనే చెప్పాలి. ఇక్కడి ఢిల్లీ క్లౌడ్‌సీడింగ్ ప్రయోగం విషయమై కాన్పూరు ఐటిఐ శాస్త్రజ్ఞులు చెబుతున్న విషయాలను పరిశీలిస్తే ప్రతి నీటి చుక్క పరిమాణం సుమారు 0.05 మిల్లీ లీటర్లు ఉంటుంది. కనుక వారిలెక్కలో కొన్ని చుక్కలు నీరు కురిసినట్లే. కేవలం ఈ అంచనాలు కారణంగా మేఘనాధుడు వర్షించినట్లు భావించడం హాస్యాస్పదం అవుతుంది. అదీగాక కాలుష్య తీవ్రత ఏమాత్రం తగ్గలేదు. కనుక ఈ ప్రయోగం ఫలవంతమైనట్లు కాదు. కేవలం కరువుల సమయంలో వర్షాన్ని ప్రేరేపించడానికి ప్రయోగించే పాత సాంకేతిక మార్గం 'కృత్రిమ వర్షం'. 1950లో తొలిసారిగా ప్రభుత్వం 'క్లౌడ్ ఏరోసావ్ ఇంటరాక్షన్ అండ్ ప్రిసిపిటేషన్ ఎన్‌హాన్స్‌మెంట్ ఎక్స్‌పెరిమెంట్' ద్వారా పశ్చిమ కనుమలలో పరిశోధించింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాఫికల్ మెటీయోరాలజీ ఆధ్వర్యంలో జరిగింది. ఇలాంటి ప్రయోగాలకు థాయ్‌లాండ్‌లో ప్రత్యేకించి రాయల్ రెయిన్ మేకింగ్ అండ్ అగ్రికల్చరల్ ఏవియేషన్ విభాగం ఉంది. ఎన్నో దేశాలు 'కృత్రిమ వర్షం' కురిపించే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. కానీ అవన్నీ వర్షాకాలంలో చినుకుపడని ప్రాంతాల కోసమే నిర్దేశించుకున్నారు. కాగా కాలుష్యాన్ని తీవ్రతను తేలిక చేయడానికి క్లౌడ్ సీడింగ్' కొత్తప్రయత్నమే. లాహోర్, చైనా కౌలాలంపూర్, థాయ్‌లాండ్ వంటి దేశాలు విఫలయత్నం జరిగి ఈ ప్రయోగాన్ని వదిలిపెట్టాయి. వాయుకాలుష్య నాణ్యతను మెరుగుపరిచే ఇలాంటి ప్రయోగాలు గతంలో ఎన్నడూ వర్షపాతాన్ని నమోదు చేయలేదన్న అనుభవాలను ఢిల్లీ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నట్లు లేదు. ఏదో ప్రయత్నం చేయాలన్న తపనతోనే ఈ ప్రయోగానికి శ్రీకారం చుట్టినట్లయింది. వర్షాభావ పరిస్థితులలో వర్షపాతం పెంచేందుకు 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 'క్లౌడ్ సీటింగ్' చేపట్టినా ఫలితం దక్కలేదు. శాస్త్రీయ ధృవీకరణ లేని ప్రయోగాలకు ప్రభుత్వాలు ఎందుకు పూనుకుంటాయో ఎవరికీ అర్థంకాదు. లక్ష్యం మంచిదే అయినా వ్యర్థ ప్రయోగాలుగా నిరూపితమైనప్పుడు ఖజానాకు భారం తెచ్చే ఇలాంటి ప్రయోగాలు మంచివి కావేమో! 2024లో ఈవిధమైన ప్రయోగాలు శాస్త్రీయంగా ఫలవంతం కాదని, అదీ ఢిల్లీలో కాలుష్యనాణ్యతను క్రమబద్ధీకరించడానికి అసలు ఉపయోగపడదని, సాధ్యం కాదని పార్లమెంట్‌కు నివేదిక కూడా సమర్పించింది. అయినా ఈ విఫల ప్రయత్నం ఎందుకు జరిగిందో ఢిల్లీ పాలకులే చెప్పాలి. ఢిల్లీలో కాలుష్యం తగ్గాల్సిన అవశ్యకత ఉన్నది నిజమే. దీని విషయంలో వేర్వేరుప్రయత్నాలు కనుగొనడమే శరణ్యం. కీలరిగి వాత పెట్టాల్సిన అంశాల్లో రాజకీయ నిర్ణయాలు నిరర్థకమే అవుతాయి. నిరర్థక ప్రయోగాలకు నిర్ణయించడం కాలుష్య నివారణకు ఏదో ఒకటి చేస్తున్నదనే భావన ఢిల్లీ ప్రజల్లో కలిగించడానికేనా అనే భావన కలుగుతుంది.

విలువలు పతనమవడం కన్నా, విలువల పట్ల విశ్వాసం క్షీణించడం మరింత ప్రమాదకరం.



రాబర్ట్ లూయి స్టీవెన్ సన్

అవమానించేవాడు ఇసుకపై రాతలాగా వెంటనే దాన్ని విస్మరిస్తాడు. అవమానానికి గురైన వాడు ఇతడిపై చెక్కిన రాత లాగా ఎన్నటికీ మరిచిపోడు.



ఆస్కార్‌వైల్డ్

# ప్రమాదాల పాపం తలా పిడికెడు!

*ఎవరో చేసిన తప్పు ఏకంగా పంతొమ్మిది మంది సజీవ దహనానికి కారణమైంది. నిద్రలో ఉన్నవారిని అటు నుంచి అటే శాశ్వత నిద్రలోకి పంపింది. కొన్ని కుటుంబాలను చిదిమేసి శాశ్వత చీకట్లు నింపింది. నిమిషాల వ్యవధిలో కొన్ని కుటుంబాలు, మరికొన్ని కుటుంబాల పెద్దదిక్కులు భవిష్యత్తు ఆశలు అగ్నికీలలకు ఆహుతయ్యాయి. ఇంతటి ఘోరవిషాదానికి కారణాలు ఏమిటి, కారకులు ఎవరో తదితర అంశాలపై తర్జన భర్జనలు జరుగుతున్నాయి. ఇందులో తిలాపాపం తలా పిడికెడు అన్నట్లు పాలకపెద్దలతోపాటు, అధికారగణంతోసహా అందరూ భాగస్వాములు అనే విమర్శలు వెల్లుబుకుతున్నాయి. 'నీ చేతన్ నా చేతన్ వరమడిగిన కుంతి చేతన్, వాసవి చేతన్, ధరచేత, శల్యుచేత అరయంగా కర్ణుడీల్గె ఆరుగురిచేతన్.. అన్నట్లు ఈ విషాద సంఘటనకు ఎవరు కారకులో? కారణాలు ఏమిటి? ఎవరి పాత్ర ఎంత? ఎవరెవరిని నిర్లక్ష్యంపాలెంత? తదితర అంశాలు పెద్దగా పరిశోధించాల్సిన అవసరం లేదు*

దామెర్ల సాయిబాబ

చేయబోయే పనిని గూర్చి తెలుసుకోవడం వివేకం. ఎలా చేయాలో తెలుసుకోవడం నైపుణ్యం. పూర్తి చేయడం సామర్థ్యం. వీటిలో ఎక్కడ లోపం ఉన్నా అనుకున్న లక్ష్యాన్ని సాధించలేం. దేశంలో అంతకంతకు పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాలకు కారణాలు ఏమిటో తెలుసు, కారకులు ఎవరో తెలుసు. ఎందుకు ఈ ప్రమాదాలు జరుగుతున్నాయో, ఎలా వాటిని నివారించవచ్చో కూడా తెలియనిది కాదు. అమాయకుల ప్రాణాలు తీస్తున్న ఈ ప్రమాదాలకు అడ్డుకట్టవేసేందుకు దశాబ్దాల తరబడి ప్రయత్నాలు చేస్తున్నట్లు పాలకులు చెప్పుకోవడమే కాదు, అందుకోసం ఎన్నో చట్టాలు తెచ్చారు, తెస్తున్నారు. కాలానుగుణంగా సవరణలో మార్పులు చేస్తున్నారు. భారీ ఎత్తున జరిమానాలు విధిస్తున్నారు. కోట్లాది రూపాయలు జరిమానాల రూపేణ ఆదాయం వస్తున్నది. అయినా రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఇందుకు సామర్థ్యంతోపాటు అమల్లో త్రికరణశుద్ధి లేకపోవడమే. ఈ పార్టీ ఆ పార్టీ అని కాదు అధికారంలో ఎవరుఉన్నా ఈ ఘోరాలు ఆగడంలేదు. గత శుక్రవారం తెల్లవారుజామున కర్నూలు జిల్లాలో చోటు చేసుకున్న మహావిషాదం గుండెలను పిండేసింది. ఎవరో చేసిన తప్పు ఏకంగా పంతొమ్మిది మంది సజీవ దహనానికి కారణమైంది. నిద్రలో ఉన్నవారిని అటు నుంచి అటే శాశ్వత నిద్రలోకి పంపింది. కొన్ని కుటుంబాలను చిదిమేసి శాశ్వత చీకట్లు నింపింది. నిమిషాల వ్యవధిలో కొన్ని కుటుంబాలు, మరికొన్ని కుటుంబాల పెద్దదిక్కులు భవిష్యత్తు ఆశలు అగ్నికీలలకు ఆహుతయ్యాయి. ఇంతటి ఘోరవిషాదానికి కారణాలు ఏమిటి, కారకులు ఎవరో తదితర అంశాలపై తర్జన భర్జనలు జరుగుతున్నాయి. ఇందులో తిలాపాపం తలా పిడికెడు అన్నట్లు పాలకపెద్దలతోపాటు, అధికారగణంతో సహా అందరూ భాగస్వాములు అనే విమర్శలు వెల్లుబుకుతున్నాయి. 'నీ చేతన్ నా చేతన్ వరమడిగిన కుంతి చేతన్, వాసవి చేతన్, ధరచేత, శల్యుచేత అరయంగా కర్ణుడీల్గె ఆరుగురిచేతన్.. అన్నట్లు ఈ విషాద సంఘటనకు ఎవరు కారకులో? కారణాలు ఏమిటి? ఎవరి పాత్ర ఎంత? ఎవరెవరి నిర్లక్ష్యం పాలెంత? తదితర అంశాలు పెద్దగా పరిశోధించాల్సిన అవసరం లేదు. రహదారుల పక్కన మద్యాన్ని అందుబాటుల్లో ఉంచిన పెద్దలది మొదటి తప్పు, సీట్లను పడకలుగా మార్చడంతోపాటు ఎన్నో నిబంధనలు అతిక్రమించి యధేచ్ఛగా అక్రమంగా వాహనాలను నడుపుతున్న బస్సు యాజమాన్యాలది. రోడ్లపై పడ్డ గుంతలను మరమ్మత్తు చేయకుండా నిర్లక్ష్యం వహించిన రోడ్లుభవనాల శాఖ, వీటిన్నింటిని మించి వేలాది వాహనాలు ఇన్ని అవకతవకలతో నిబంధలకు విరుద్ధంగా రోడ్లపై వీరవిహారం చేస్తూ మారణ హోమం సృష్టిస్తున్న మా చిన్ని పొట్టకు శ్రీరామ రక్ష అన్నట్లు అవినీతి కూపంలో మునిగి తేలుతున్న రోడ్డు రవాణా శాఖ, ఇక పోలీసు శాఖ గూర్చిఎంత తక్కువ చర్చిస్తే అంత మంచిదేమో. నిత్యం రోడ్లపై చెకింగ్ చేస్తుంటారు. సామాన్యులు ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా స్పీడ్ పరిమితి దాటితే వేలాది రూపాయల జరిమానాను ముక్కుపిండి వసూల్ చేసే పోలీసులు నిత్యం కొన్ని ట్రావెల్స్ బస్సులు గంటకు120నుండి 140కిలోమీటర్లుకు పైగా వేగంతో నడిచే బస్సులను ఎందుకు పట్టించుకోరు. వారి తనిఖీలో సీటకు అనుమతి లేకుండా పడకలుగా మార్చిన అతిక్రమణలతో పాటు మరెన్నింటినో ఎందుకు పట్టించుకోలేదు. కొన్ని సందర్భాల్లో చలాన్లు వేసినా నెలల తరబడి అవి చెల్లించకపోయినా చర్య లు తీసుకోవడానికి చేతులు రావు. ప్రస్తుతం 19 మంది అమాయకులను పొట్టన పెట్టుకొన్న బస్సుపై కూడా తెలుగు రాష్ట్రాల్లో వేలాది రూపాయలు చెల్లించాల్సిన

## ఒక్క మాట

చలాన్లు నెలలతరబడి పెండింగ్‌లో ఉన్నాయి. అవినీతి కంటే వీటిలో రాజకీయజోక్యం ఉండడంతో సమర్థులు అంతో ఇంతా నిజాయితీ అధికారులు మౌనంగా ఉండిపోతున్నారు. ఫలితంగా దేశంలో నిత్యం రహదారులు రక్తసిక్తం అవుతున్నాయి. దేశ వ్యాప్తంగా పరిశీలిస్తే 2001 నుంచి 2020 వరకు రెండు దశాబ్దాల్లో తొంభైఆరు లక్షల అరవై వేల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటే ఇరవైమూడు లక్షల ఇరవైఐదువేల మంది మృత్యువాతపడినట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. క్షతగాత్రులైనవారి సంఖ్య కోట్లల్లో ఉండొచ్చు. రోడ్లపై ఏర్పడిన గుంతల కారణంగా గత నాలుగేళ్లలో ఇరవై తొమ్మిది వేల ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అంతేకాదు ప్రమాదాలకు గురై ప్రాణాపాయస్థితిలో సకాలంలో ప్రాథమిక చికిత్స అందక మృత్యువుతో పోరాడి నిస్సహాయంగా రోడ్ల పైనే ప్రాణాలు వదిలినవారు వేల సంఖ్యలోఉన్నారు. అమెరికాలో రోడ్డు ప్రమాదాలకు గురైన ప్రతి రెండువందల మందిలో ఒకరు మరణిస్తుంటే భారత్‌లో ప్రతి ఆరుగురిలో ఒకరు మరణిస్తున్నట్లు అధికార గణాంకాలే వెల్లడిస్తున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘోరవిషాదానికి మద్యమే కారణమనే విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కర్నూలు జిల్లాకు చెందిన శివశంకర్ అనే యువకుడు అతని మిత్రుడితో కలిసి అర్ధ రాత్రి వరకు మద్యం సేవించిన తర్వాత ఆ మైకంలోనే బయలుదేరారు. మధ్యలో పెట్రోలు పంపువద్ద ఆగి పెట్రోలు పోయించుకొని వెళ్లే క్రమంలో వాహనం నడిపిన తీరు సిసికెమెరా పరిశీలిస్తే ఎంతటి మత్తులో ఉన్నాడో బోధపడుతుంది. ఆ మత్తులోనే కొంతదూరం వెళ్లి డివైడర్‌కు ఢీకొట్టి పడిపోయి అక్కడికక్కడే చనిపోయాడు. వెనుక కూర్చొని ఉన్న అతని మిత్రుడు ఎర్రి స్వామి రోడ్డుపైనున్న మోటారు సైకిలును పక్కకు లాగేందుకు విఫల ప్రయత్నం చేశాడు. రెండు బస్సులు అదే రోడ్డుపై మోటార్‌సైకిల్ పక్కనుండే వెళ్లిపోయాయి. అదే సమయంలో ఇప్పుడు ప్రమాదానికి గురైన బస్సుఆ మోటార్ సైకిల్‌ను ఈడ్చుకొంటూ మూడువందల మీటర్ల వరకు పోయింది. మోటార్ సైకిల్ రాపిడికి నిప్పురవ్వలు వచ్చి బస్సు అంటుకున్నది. ఏం జరుగుతుందో తెలియని గాఢ నిద్రలో ఉన్న వారికి ఒక్క సారిగా పొగ చుట్టుముట్టింది. దీనికితోడు ఆ బస్సులో ఉన్న హైదరాబాద్ నుంచి బెంగళూర్‌కు పంపుతున్న పర్సల్లో నాలుగువందల సెల్‌ఫోన్లకు మంటలు అంటుకోవడంతో అవి భారీశబ్దాలతో పేలుళ్ల మొదలయ్యాయి. కొందరు అతికష్టంగా బయటపడి ప్రాణాలు కాపాడుకోగలిగారు. పంతొమ్మిది మంది సజీవదహనం అయ్యారు. మృతదేహాలు నల్లని ముద్దలుగా మారిపోయాయి. ఒక్కొక్క కుటుంబానిది ఒక్కో విషాదగాథ. ఇలా ప్రమాదాల్లో పెద్ద ఎత్తున చనిపోయినప్పుడు అధికారగణం చేస్తున్న హడావుడి అంతా ఇంతా కాదు. తనిఖీలు, జరిమానాలు, వాహనాలు సీజ్ చేయడం లాంటివి ఎన్నో చేస్తారు. పాలక పెద్దలుకూడా అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండాకఠిన చర్యలు తీసుకుంటామని, పొరపాట్లు, తప్పులు చేసినవారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని ప్రకటనలు ఇస్తుంటారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన కార్యదర్శి రాఘవేంద్రరావు విజయవాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆయన స్కూటర్‌పై వెళ్తుండగా స్థానిక లోకల్ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. దీనిపై ఆగ్రహించిన ఎన్టీఆర్ హుటాహుటిన విజయవాడకు తరలివెళ్లారు. మొత్తం యంత్రాంగమే అక్కడికి చేరుకున్నది. సమీక్షలు చేశారు. ఇటువంటివి మళ్లీ మళ్లీ జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులకు అప్పగించారు. అప్పటి నుంచి ఎన్నో చట్టాలు తెచ్చారు, సవరణలు చేశారు. రోడ్డు భద్రతా సంస్థను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కొన్ని మార్పులు, చేర్పులతో మరింత పటిష్టంగా పర్యవేక్షించేందుకు పోలీసు డైరెక్టర్ జనరల్ హోదా కలిగిన అధికారిని ఆ విభాగానికి అధిపతిగా నియమించారు. వ్యక్తుల మీద కోపంతో వ్యవస్థను కూలదోశారనేందుకు ఇదొక ప్రత్యక్ష ఉదాహరణ. ఇక కొన్ని రాష్ట్రాల్లో డ్రైవింగ్ లైసెన్సు జారీ ఒక పెద్ద ప్రహసనంగా మారిందని, కనీసం సంతకం చేయలేనివారు లైసెన్సులు పొందుతున్న విషయం కూడా బయటపడింది. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదానికి బస్సు డ్రైవర్‌కు పదోతరగతి ఫేక్ సర్టిఫికెట్‌తో లైసెన్సులు పొందినట్లు పోలీసులే చెబుతున్నారు. అన్నిటికంటే మించి మద్యం వాడకం రోడ్డు ప్రమాదాలను పెంచుతున్నదనేది కాదనలేని వాస్తవం. రహదార్ల వెంట ఉన్న మద్యం షాపులు వాహన డ్రైవర్లను మత్తులో ముంచుతున్నాయి. మద్యం ద్వారా జరుగుతున్న ఈ అనర్థాలను పాలకులు గుర్తించడం లేదు. గుర్తించినా మహాప్రసాదంగా మారిన మద్యాదాయం ముందు ఈప్రాణాలను లెక్కలోకి తీసుకోవడం లేదు. ఫలితంగా లక్షలాది కుటుంబాలు ఆత్మీయులను కోల్పోయి తల్లడిల్లిపోతున్నాయి. కోట్ల సంఖ్యలో అంగవైకల్యంతో జీవనాధారం కోల్పోయి జీవచ్ఛవంలా బతుకులు ఈడుస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరవాలి. ఈ మారణహోమాన్ని ఆపాలి. ●

# కేన్సర్‌కు దారి తీస్తున్న టాటూ కల్చర్

బుగ్గన మధుసూదనరెడ్డి

ఈ మధ్యకాలంలో టాటూ కల్చర్ విపరీతంగా పెరిగిపోవడమే కాదు నేటి యువత దానిని వెలం వెర్రిలా ఆరాధించడం మరీ శృతిమించిపోయింది అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఒకప్పుడు కేవలం సూదితో పొడిచే పచ్చబొట్టు చాలా ప్రత్యేకంగా ఉండేది. అయితే అది ఆరోగ్యాని కంటే సంప్రదాయానికి ప్రతీకగా కొనసాగింది. ఇప్పుడు అదే పచ్చబొట్టు ఫ్యాషన్‌గా రూపాంతరం చెంది అది నేటి యువతకు ఒక వ్యసనంగా సైతం మారిపోయింది అనే మాట సత్యదూరం కాదు. ముఖ్యంగా పూర్వం కలప బూడిదతో, నూనె, పసుపు కాల్చిన మసితో మూలికలను జోడించి పచ్చబొట్టు సిరాలను తయారుచేసేవారు. అయితే అవి మానవాళి ఆరోగ్యానికి ఏ మాత్రం హానిచేసేవి కావు. కానీ నేడు వేసే టాటూలలో రకరకాల ఫిగ్మెంట్స్‌తో తయారు అయిన కెమికల్ ఇంకును వాడుతున్నారు. పైగా ఏది ఎంత మోతాదులో వాడుతున్నారు అనే దానికి సరైన తూకం సైతం లేదు. అంతేకాకుండా ఇటీవల అమెరికా సైంటిస్టులు టాటూ ఇంక్స్ మీద పలు పరిశోధనలు చేసి వారు ఒక దిగ్భ్రాంతికరమైన, షాకింగ్ విషయాన్ని బయటపెట్టారు. అదేమంటే టాటూల కోసం ఉపయోగించే ఇంకుల్లో క్యాన్సర్ కారకం ఉందని చాలా స్పష్టంగా తెలియజేయడంతో నేటి సమాజంలో ఇది ఒక ఆందోళనకరమైన పరిణామంగా పరిణమించిది అనే మాటసత్యదూరం కాదు. అంతేకాదు స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్‌కు చెందిన సైంటిస్ట్ స్వియార్క్ నేతృత్వంలో దాదాపు వంద రకాల టాటూ ఇంకులను పరీక్షించారు. సైంటిస్టులతో పరీక్షించిన 100 ఇంకుల్లో 23 ఇంకుల్లో అజో అనే సింథెటిక్ రంగుల ఉనికిని గుర్తించారు. సాధారణంగా అజో సింథెటిక్ రంగులను ఆహార పదార్థాల, సౌందర్య ఉత్పత్తులు, దుస్తుల తయారీలో ఉపయోగిస్తుంటారు. ఇందులో బ్యాక్టీరియా చేరిన, అధిక సూర్యరశ్మి తగిలినా క్యాన్సర్ కారకంగా మారి మానవాళి ప్రాణాలకు హాని తలపెడతాయని బల్లగుద్ది మరీ చెప్పారు. ఇంకా చెప్పుకుంటూపోతే ఈ టాటూ కల్చర్ వల్ల విచ్చలవిడిగా టాటూ వేయించుకున్న వారికి కొన్ని రకాల చర్మ వ్యాధులు, హెపటైటిస్ ఏ, హెపటైటిస్ బీ, హెచ్ఐవీ వంటి ప్రాణాంతకర వ్యాధులు సోకే ప్రమాదం సైతం ఉండటం ఎంతైనా భీతి గోల్పే, దిగ్భ్రాంతికరమైన విషయం. అందుకే ఇలా టాటూలు తమ శరీరంపై విచ్చలవిడిగా వేయించుకునే ఆలోచన వున్నవారు ఒక్క విషయాన్నీ ఎలాంటి పరిస్థితుల్లో మరువరాదు. అదేమంటే టాటూలు వేయించుకున్నవారుప్రభుత్వ ఉద్యోగులైనా పోలీస్ సర్వీస్ (ఐపీఎస్), ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్ ), ఇండియన్ ఫారిన్‌సర్వీస్ ( ఐఎఫ్ఎస్ ) వంటి ఉద్యోగాలు ఒంటిపైన పచ్చబొట్లు వుంటే ఎట్టి పరిస్థితుల్లో రావు కాకరావు. అంతేకాదు ఈ టాటూలు వేయించుకొన్నవారికి రక్తదానాలు సైతం చేసేందుకు కూడా అనుమతి ఉండదు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ కాస్తంత వివేకంతో, పరిణతితో అలోచించి వీలైనంతవరకు ఈ టాటూల సంస్కృతికి దూరంగా ఉంటే అది మన ఇంటికి, వంటికి ఎంతో మంచిది. ఏదిఏమైన ఇప్పటికైనా అర్థం పర్థం లేని ఓ ఫ్యాషన్ లా, ఓ వెలం వెర్రిలా టాటూ కల్చర్‌వైపు యమస్పీడుగా దౌడుతీస్తున్న నేటి యువత కాస్తంత స్పీడుతగ్గించి ఒక్కసారి దీనివల్ల కలిగే దుష్పరిణామాల గురించి ఆత్మావలోకనం చేసుకొని తమ శరీరాలపై టాటూలు వేయించుకోవాలనే విపరీత ధోరణికి వీలైనంత త్వరగా స్వస్తిచెప్పగలిగితే, అటు ఆరోగ్యరీత్యా, ఇటు వారి భవిష్యత్‌కు సైతం ఎంతో సర్వదా శ్రేయస్కరం. ●

# ప్రజావాక్కు



### కాళేశ్వరం ఆలయంలో సమస్యల తిష్ట

జయశంకర్ జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో భక్తులు గోదావరిలో పుణ్యస్నానం చేసి దేవాలయాన్ని సందర్శిస్తారు. గోదావరి మెట్ల నుండి నీరు వుండే ప్రదేశం వరకు అపరిశుభ్రంగావుంది. ఎక్కడచూసినాచెత్తప్లాస్టిక్ కవర్స్ బాటిల్స్ గుట్టలుగా పేరుకుపోయాయి. ఆలయ కమిటీ దేవాదాయ శాఖ సిబ్బంది వున్నా ప్లాస్టిక్ కవర్స్ తొలగించడంలో నిర్లక్ష్యంవహిస్తున్నారు. అలాగే అద్దె గదుల నిర్వాహకులు అద్దె ఎక్కువ వసూలు చేస్తూ భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. దుకాణాదారులు ఎక్కువ రేటుకు వస్తువులు విక్రయిస్తూ జేబులు గుల్ల చేస్తున్నారు. గుడి ముందు యాచకులు వందల మంది భిక్షాటన చేస్తూ డబ్బులు వారికి ఇచ్చే వరకు భక్తుల కాళ్లు మొక్కి బలవంతంగా డబ్బులు లాగుతున్నారు. ఇవ్వకపోతే పరుష పదజాలము తో దూషిస్తున్న ఘటనలు ఉన్నాయి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### రోడ్లు మరమ్మతులు

ఇటీవల కురిసిన వర్షాలకు చాలా రహదారులు వరదలకు రోడ్లు చాలావరకు కొట్టుకుపోవడం, మట్టి కొట్టుకుపోవడం, రాళ్లుతేలడం ప్రయాణంకు చాలాఅంతరాయం జరుగుతుంది. వాహనాలు, బస్సులు, లారీలు, కార్లు, ఆటోలు, జీప్‌లు, స్కూటర్, సైకిల్, పాదచారులు. ప్రయాణానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. వాహనాలు నడిపించే డ్రైవర్లు నరక యాతన పడుతున్నారు. ప్రభుత్వంరోడ్లు భవనాలశాఖ, రెవిన్యూ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నష్టం అంచనా వేయించాలి. స్వచ్ఛంద సమూహాల సహకారంతో రోడ్లు మరమ్మతులు వెంటనేచేయించిప్రజలప్రయాణానికిసహకారం అందించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### కొత్త డ్యాములను నిర్మించాలి

భారత దేశంలో అతి పురాతన నదులు చెరువులు, కుంటలు, వాగుల చెక్ డ్యాములను పునరుద్ధరించి కొత్త డ్యాములను నిర్మించాలి. ఎప్పుడో బ్రిటీష్ వారి కాలంలో నిర్మించిన ఆనకట్టలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వర్షా కాలంలో ఈఆనకట్టలు తెగిపోవడంవల్ల ముంపు గ్రామాలు మునిగిపోవడం జరుగుతుంది. కావున ప్రభుత్వం తక్షణం పాత డ్యాంల స్థానంలో కొత్తవి నిర్మించాలి.

- డి చాంద్ బాషా, కర్నూలు

### బస్సుల్లో ప్రయాణం.. ఆలోచనీయ అంశం

ఇటీవలి కాలంలో రాత్రి ప్రయాణాలకు ఎక్కువ మంది ఏసీ స్లీపర్‌బస్సులను ఎంచుకుంటున్నారు. సౌకర్యవంతమైన బెడ్లు, శుభ్రమైన వాతావరణం, వేగవంతమైన ప్రయాణం వంటి అంశాలు వీటిని ప్రజాదరణ పొందేలా చేస్తున్నాయి. అయితే, సౌకర్యం ఉన్నంత మాత్రాన భద్రతా ప్రమాణాలు నిర్లక్ష్యం చేయబడితే ప్రమాదాలు తప్పవు. ఇటీవల కర్నూలు జిల్లాలో జరిగిన వోల్వోబస్సు ప్రమాదం భద్రతపరంగా ఎన్నో ప్రశ్నలను లేవనెత్తింది. ఏసీ బస్సుల్లో పూర్తిగా మూసివేసిన కిటికీలు, సెంట్రల్ లాక్‌సిస్టమ్స్, తగిన ఎమర్జెన్సీ ఎగ్జిట్‌ల లేమి కారణంగా ప్రమాదం సంభవించినప్పుడు ప్రయాణికులు బయటపడటం కష్టమవుతోంది. ప్రతి బస్సులోఫైర్ ఎక్స్టింగ్విషర్‌లు, అత్యవసర ద్వారాలు, అలారం వ్యవస్థలు తప్పనిసరిగా ఉండాలి.

-తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

మొంథా తుఫాను కారణంగా రైతులు పండించిన పంట ఒకసారిగా నీట కొట్టుకు పోయింది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కావునా రాష్ట్ర ప్రభుత్వం యాత్రంగం వెంటనే క్షేత్ర స్థాయిలో తిరిగి ప్రతి ఒక రైతుకు ఆర్థిక సాయం అందిస్తూ న్యాయం జరిగేలా ప్రభుత్వం చూడాలి. రైతులకు నోటి దగ్గరకు వచ్చిన ముద్ద నేలపాలు అయింది. రాష్ట్రంలో అన్ని వస్తువులకు బీమా ఉంటుంది. కానీ రైతులకు పండించిన పంటకు బీమా లేదు రైతులు ఆరుకాలం పండించిన పంట ప్రతిసారి ఆకాల వర్షాలతో వరదలో కొట్టుకుపోతుంది. అందుకే దీనికి శాశ్వత పరిష్కారం ఆలోచించాలి. రైతులు మార్కెట్‌కు తెచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా వ్యవసాయ అధికారులు ఏర్పాట్లు చేయాలి. ప్రస్తుతం తడిసిన ధాన్యని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూలు జిల్లా

### విజయవంతమైన పరిపాలన అందించాలి

శ్రీలంక, బాంగ్లాదేశ్‌లలో నేపాల్‌లో జరిగేదంత జెన్ జీ యుగం. విద్యార్థులే నిర్ణయాత్మక శక్తిగా వ్యవహరిస్తున్న నేపథ్యాన్ని ఇవ్వాళ్ల చూస్తున్నాం. అయితే శ్రీలంక బాంగ్లాదేశ్ పరిణామాలు అస్సాం ను తలపించగా నేపాల్ పరిణామాలు మాత్రం ఒక ఆశ రేఖను చూపిస్తున్నాయి. నిజంగా ఇదిమంచి పరిణామమే. కొన్ని పదుల ఏండ్లుగా కుటుంబ పాలన దిశగా సాగుతున్న ఆయా దేశాల పాలన పద్ధతులను దిశ మారింది.

-భారత అవినాష్, జనగామ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోర రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పెట్టుబడిదారులు లాభాల కోసమా! ఉద్యోగ కల్పన కోసమా?



డాక్టర్ఎనుగొండ నాగరాజ నాయుడు

పెట్టుబడిదారీ వ్యవస్థ ఉద్యోగ కల్పనలో ఎంత నిబద్ధత కలిగి ఉన్నదో ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ఏఐని ప్రవేశపెట్టడమే తెలియజేస్తోంది. టెక్నాలజీ అనేది మనిషి శ్రమను తగ్గించడానికి దోహదం చేయాలి కానీ మనిషికి జీవనాధార అవకాశాలను దూరం చేయడానికి దారి తీయకూడదు. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థలో అదే జరుగుతోంది. ఇదే సోషలిజంలోనైతే ఇటువంటి కొత్త టెక్నాలజీ ప్రవేశం వలన కార్మికులు ఉపాధి కోల్పోరు. అదే కొత్త టెక్నాలజీని పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రవేశపెట్టినప్పుడు కార్మికులు ఉపాధి అవకాశాలు తగ్గి నిరుద్యోగానికి దారితీస్తుంది. దీనివలన ఆర్థిక వ్యవస్థలోఆదాయ అసమానతలు పెరగడం, ఇది కొంతమంది పెట్టుబడిదారుల చేతుల్లోకి పోవడం అశేష ప్రజానీకం వినియోగస్థాయి పడిపోవడం, డిమాండ్ తగ్గిపోవడం, ఫలితంగా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి దిగజారిపోతుంది. ఇటీవలనే అమెజాన్ కంపెనీలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ఏఐ వినియోగం వలన 14వేల ఉద్యోగాలు పోతున్నాయని తెలియజేసింది. ఇలా ఎప్పటికప్పుడు పెట్టుబడిదారులు ఉద్యోగ కల్పనపై దృష్టి పెట్టకుండా ఆదాయాలను పెంపొందించుకునే దిశగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ నిరుద్యోగాన్ని పెంచుతున్నాయి. ఇప్పటికే అమెజాన్ నుంచి మైక్రోసాఫ్ట్ కంపెనీ వరకు ఉద్యోగం కోల్పోయే వారి సంఖ్య 80000 వరకు ఉంటుందని ఒక అంచనా. ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ ప్రభావం వలన మొత్తం మీద 81 వేల 416 ఉద్యోగాలు పోతున్నాయని ఒకఅంచనా. ప్రపంచవ్యాప్తంగా మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజేస్లో ఆర్థిక అభివృద్ధి పరంగా మొత్తం పారిశ్రామిక రంగాన్ని ఇంజన్‌లాగా పని చేస్తున్నాయని ఆర్థికవేత్తలు గుర్తించారు. 145 కోట్ల మంది జనాభా గల మనదేశంలో పేదరికం పోవాలన్న ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదాయ సమాంతర తగ్గాలన్న సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలు ఎంఎస్ఎంఏ అభివృద్ధితోనే సాధ్యం. చైనాలో ఇంటింటికి ఒక కుటీర పరిశ్రమ ఉంటూ చైనా ఉత్పత్తులు ప్రపంచ వ్యాప్తంగా చెలామణి అవుతున్నాయి. అంటే అక్కడి ప్రభుత్వ పెద్దల నిబద్ధత ఉంది. అందుకే చైనా నేడు ప్రపంచ కర్మాగారంగా ఉంది. మనదేశంలో పాలకులు లాగా ప్రభుత్వం వ్యాపార సంస్థ కాదని చైనా పాలకులు అనుకోవడం లేదు. చైనాలో స్థానికంగా పరిశ్రమలు స్థాపించి అభివృద్ధిపరిచిన అందువలన అక్కడి పేదరికం పోయింది. దీనిగానో ప్రజలకు రుణాల



రూపంలో పెట్టుబడులు సమకూర్చడం వారికి తగిన శిక్షణ ఇవ్వడం పరిశ్రమలకు కావాలసిన సాంకేతిక సామాగ్రిని అందించడం మార్కెట్లను చూపించడం ఇలాంటి పనుల్లో ప్రభుత్వం ఒక వైపు ప్రైవేట్ ఒక వైపు పారిశ్రామిక రంగం మరొకవైపు భాగస్వాములు అవుతున్నాయి. ప్రజల ఆదాయాలు పెరుగుతున్నాయి. అనేక పారిశ్రామిక యూనిట్లను ఎక్కడికక్కడ నెలకొల్పుతున్నారు. వీటి ఆధారంగా చైనాలో 1.3 కోట్ల మందికి గ్రామీణ ఉపాధి లభించింది. ఇళ్లలోనే పెట్టే చిన్నచిన్న వర్క్షాపులో ఉత్పత్తి యూనిట్లద్వారా ప్రజల ఆదాయాలు గణనీయంగా పెరిగాయి. దీనికి టూరిజంపర్యావరణ ఆర్థిక కార్యకలాపాలు తోడు చేయడం వలన ఈచిన్నతరహా పరిశ్రమలో మరింతగా పేదరిక నిర్మూలనకు ఉద్యోగ కల్పనకు తోడ్పడ్డాయి. మన దేశంలో ఎప్పటి నుంచో 1905 స్వదేశీ ఉద్యమం ద్వారా చేపట్టిన కుటీర పరిశ్రమల స్వదేశీ ఉత్పత్తులను అభివృద్ధి పరచుకునేందుకుఆనాడు స్వాతంత్ర్య సంగ్రామాన్నే నడిపించడం జరిగింది. నేడు మనదేశంలో 97 శాతం ఉద్యోగ కల్పన జరుగుతున్నది. భారీ పరిశ్రమల ద్వారా కేవలం 3 శాతం మాత్రమే ఉద్యోగిత ప్రజలకు లభిస్తున్నది. ఇవి ప్రస్తుతం దేశంలో 6.3 కోట్ల సంస్థలు ఎనిమిది వేలరకాల ఉత్పత్తులను చేస్తూ మన స్థూలజాతీయ ఉత్పత్తికి 30శాతం కల్పించనున్నది. దేశపారిశ్రామిక ఉత్పత్తిలో 33శాతంగా ఉంది. ఈ పరిశ్రమలన్నీ అసంఘటిత రంగంలో ఉన్నాయి. వీటిని సంఘటితపరచి ఆర్థికపరమైన సాంకేతికపరమైన తదితర సబ్సిడీలు కల్పిస్తే చిన్న తరహా పరిశ్రమలు ఉపాధి కల్పనలో ఆదాయాలు పెంపొందించడంలో దేశంలో ప్రధానమైన పాత్ర పోషిస్తాయి. అభివృద్ధి అంటే అందరివృద్ధి అంతేగాని కొందరి వృద్ధి మాత్రం కాదు అని గాంధీజీ అన్నారు. దేశ ఆదాయం ఎంత అనేది ముఖ్యంకాదు ప్రజలకు కనీస అవసరాలైనా తిండి, బట్ట విద్య, వైద్యం ఏ మేరకు పొందగలుగుతున్నారు అనేది ముఖ్యమన్నారు. ప్రభుత్వాల సేవకులుగా పనిచేయాలిగాని పెత్తందారులుగా ప్రజలపై ఆధిపత్యం చేయించకూడదు అన్నారు. ప్రజల కనీస అవసరాలు తీర్చేవిధంగా పాలన చేసేదే రాజ్యం. గాంధీజీ ప్రకారం పెట్టుబడిదారీ వ్యవస్థ నిరుద్యోగాన్ని నిర్మూలించలేదు. పరిపాలన విధానాలు చట్టాల ద్వారా అందరికీ క్షేమం అందించేదే రాజ్యం. నేటి ఆర్థిక విధానాలన్నీ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో జరిగి ఉత్పత్తులు గణనీయంగా పెరిగినప్పటికీ మానవ శ్రేయస్సు పెంపొందించలేకపోవడం శోచనీయం. అందుకే ఆనాడు గాంధీజీ అన్నారు భారీ ఉత్పత్తులు కాదు ముఖ్యం భారీ సంఖ్యలో ప్రజలు ఉత్పత్తిలో పాల్గొనాలి. తద్వారా ఉపాధి ఆదాయంఉండి ప్రజలు సౌభాగ్యంతో ఉంటారు. పెట్టుబడిదారీ విధానం చిన్నచిన్న ఉత్పత్తిదారులను నిర్వీర్యం చేసి నిరుద్యోగం పెరిగేటట్టుగా చేస్తుందనిగాంధీజీ స్వాతంత్రోద్యమం కాలంలోనే అన్నారు. ఈరోజుటికి కూడా ఈచిన్నతరహా కుటీర పరిశ్రమలు రిజిస్టర్ కాబడినవి మన దేశంలో 5.93కోట్ల యూనిట్లు ఉన్నాయి. వీటిలో 25 కోట్ల మంది పనిచేస్తున్నారు. ఇవి చేసే ఉత్పత్తులలో మన విదేశీ వాణిజ్యంలో 45.73శాతంగా ఉన్నది. అయితే నేడు కష్టాల్లో ఉన్న ఎంఎస్ఎం ఈ యాజమాన్యాల ఇబ్బందులుప్రభుత్వం వినాలి. వాస్తవ పరిస్థితుల ఆధారంగా ఎంఎస్ఎంఈల అభివృద్ధికి పాలసీలు రూపొందించాలి. అప్పుడే మన ప్రధాని కోరుకున్నట్లుగా నిజమైన ఆత్మనిర్భర్ భారత మేకిన్ ఇండియా పథకాలు విజయ్నవతమవుతాయి. ●

## భారతదేశపు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్



గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 31: 150వ జయంతిని పురస్కరించుకుని నేడు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా హాజరై సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి అశోక్ బాబు, శ్రీశైలం ఆలయ బోర్డు మెంబర్ ఏవీ రమణ, నేతలు పర్చూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ సమైక్యతకు, సమగ్రతకు అందించిన సేవలు చిరస్మరణీయమని నేటి తరానికి ఆయన ఆశయాలు ఆదర్శనీయమని తెలిపారు.

## బి.టెక్, ఎంటెక్ ఫలితాలు విడుదల

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,అక్టోబరు31, ప్రభాతవార్త: వర్సిటీ పరిధిలో మార్చి/జూలైలో జరిగిన బి.టెక్ 1/4 రెండవ సెమిస్టర్, ఎంటెక్ 2/2 3వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సిఇ ఆలపాటి శివప్రసాదరావు శుక్రవారం విడుదల చేశారు. బి.టెక్‌లో 944మందికి 646మంది, ఎం.టెక్‌లో 43కి 43మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. రీవాల్యూయేషన్‌కు నవంబరు 10లోగా ఒక్కో పేపర్‌కు రూ.2070 చెల్లించి దరకాస్తులు చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

**పీజీ 1,3 సెమిస్టర్ల రీవాల్యూయేషన్ ఫలితాలు విడుదల:**

వర్సిటీ పరిధిలో జనవరి/ఏప్రిల్‌లో జరిగిన పలు పీజీ కోర్సుల రీవాల్యూయేషన్ ఫలితాలను సిఇ ఆలపాటి శివప్రసాదరావు విడుదల చేశారు. 1,3వ సెమిస్టర్‌లో యంఎస్‌సి కంప్యూటర్ సైన్స్, బోటనీ, ఎంసిఏ, బోటనీ, ఎల్‌ఎల్‌యం కోర్సుల ఫలితాలు ప్రకటించారు.

## దూరవిద్య సప్లమెంటరీ ఫలితాలు విడుదల

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,అక్టోబరు31, ప్రభాతవార్త: వర్సిటీ దూరవిద్యా కేంద్రం జూలై/ఆగస్ట్ నెలల్లో నిర్వహించిన డిగ్రీ సప్లమెంటరీ ఇయర్‌ఎండ్ కోర్సుల ఫలితాలను దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు శుక్రవారం విడుదల చేశారు. రీవాల్యూయేషన్‌కు నవంబరు 12వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.770 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫలితాలు వెబ్‌సైట్ నుంచి పొందవచ్చునని పేర్కొన్నారు.

## వర్సిటీలో ఏకతా ర్యాలీ



ఆచార్య నాగార్జున విశ్వవి ద్యాలయం, అక్టోబరు31, ప్రభాతవార్త: ఏఎన్‌యు జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ఏక్ భారత్- శ్రేష్ట భారత్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సర్ధార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని యూనిటీ మార్చ్ (ప్రగతికి మార్గం- ఏకతా) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య వి.దివ్యతేజోమూర్తి అధ్యక్షత వహించారు. ఏక్ భారత్- శ్రేష్ట భారత్ ప్రాముఖ్యతను, వివరించారు. ముఖ్యఅతిథిగా వీసి ఆచార్య కె.గంగాధరరావు రాష్ట్రీయ ఏకతా ర్యాలీలో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థులలతో ఏకతా దివస్ ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఆర్.శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహచలం, ఓఎస్‌డి ఆచార్య రవికుమార్, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.వీరయ్య, ఆచార్య యం.సురేష్‌కుమార్, ఆచార్య పి.పి.ఎస్.పాల్‌కుమార్, ఆచార్య సి.హెచ్.లింగరాజు, ఆచార్య తేజోమూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డా. డి.శ్రీనివాస్, డా.సునీత, డా.సుజన, డా.రాధిక, డా.రవికుమార్, డా.యుగంధర్‌రెడ్డి, డా.ఉమాశంకర్, డా.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమ నియోజకవర్గంలో ప్రజాప్రతినిధుల మధ్య అంతర్గత విభేధాలు

గుంటూరు వెస్ట్,అక్టోబర్ 31,ప్రభాతవార్త : గుంటూరులో విభజించు పాలించు అనే విధంగా అధికారుల దోరణి ఉందని,నియోజకవర్గంలో ఉన్న ప్రజాప్రతినిధుల మధ్య అంతర్గత విభేదాలు వచ్చే విధంగా అధికారులు రాజకీయం చేస్తున్నారని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆగ్రహం వ్యక్తంచేశారు.పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించి



మాట్లాడుతూ గత మూడు రోజులుగా సైక్లోన్ ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం దిశా నిర్ధేశాల మేరకు అత్యవసర సరుకుల పంపిణీ జరిగింది.పశ్చిమలో కూడా ప్రత్యేక కేంద్రం ఏరా ్పటు చేసి మా ద్వారా పంపిణీ కార్యక్రమం నిర్వహించాము.కానీ అదే సమయంలో అధికారులు మరోచోట వేరే కార్యక్రమం నిర్వహించడం,ఆ కార్యక్రమానికి కనీస సమాచారం ఇవ్వకపోవడం ఏంటనీ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మండిపడ్డారు.

**--అసలు అధికారులు వేర్వేరుగా రెండు కార్యక్రమాలు నిర్వహించడం అవసరమా?**

మేయర్ గారు,కమీషనర్ గారు ఒకవైపు కార్యక్రమం చేసి మాకు కనీసం సమాచారం కూడా ఇవ్వలేదు.నేను పాల్గొన్న పంపిణీ కేంద్రంలో వారు లేరు,కానీ నాకు తెలియకుండా వారు నా నియోజకవర్గంలో కనీస మర్యాద పాటించకుండా కార్యక్రమం నిర్వహించడం నాకు చాలా బాధ కలిగించిందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు.

**-ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోటో లేకుండా కార్యక్రమాలు ఎందుకు ?**

గతంలో మెపా ్మ విభాగం నిర్వహించిన కార్యక్రమాల్లో చంద్రబాబు,ప్రధాని నరేంద్ర మోడీ ఫోటోలు లేకుండా నిర్వహించడం కూడా గళ్ళా మాధవి ప్రస్తావించారు."హడావిడి అయిపోయిందని చెప్పడం సరైన సమాధానం కాదు.నాయకులను మర్చిపోయే స్థితి ఎందుకు వచ్చింది? అని ఎమ్మెల్యే ప్రశ్నించారు.

**అధికారులు సమాధానం ఇవ్వాలి :** అధికారులకు నేను ప్రశ్న వేశాను,ఆన్సర్ ఇవ్వాల్సింది అధికారులు ఇది అమాయకత్వమా లేక ఇంకా కూటమి ప్రభుత్వాన్ని అంగీకరించట్లేదా అన్నది వారే చెప్పాలి,అందుకే మీడియా సమావేశం ఏర్పాటుచేశాను, అని గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు నిబద్ధత చూపాలి

పశ్చిమలో ఎన్నో సమస్యలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయని,తాను పదేపదే కౌన్సిల్ సమావేశాల్లో అడిగాను,వర్ క ్స ప్రాధాన్య క్రమంలో చేయండి,ప్రజలు ఇబ్బంది పడుతున్న ప్రాంతాలను ముందు దృష్టిలో పెట్ ్టండి,.కానీ కొన్నింటిపై మాత్రమే దృష్టి పెడుతున్నారు.మిగతావి విస్మరిస్తున్నారు.ఇది మారాలి,అని ఎమ్మెల్యే స్పష్టంచేశారు.కాంట్రాక్టర్లు,అధికారులు ఒకరిపై ఒకరు నెపం వేయడం కాకుండా కలసి పనిచేయాలి,ప్రజల కోసం మనం ఉన్నాము అది గుర్తుపెట్టుకోవాలి అని ఎమ్మెల్యేమ గళ్ళా మాధవి పేర్కొన్నారు.62 జిఎస్టి 31 జేపిఈజి :

## ఏక్తా దివస్ ర్యాలీ : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు వెస్ట్,అక్టోబర్ 31,ప్రభాతవార్త : సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని స్థానిక కలెక్టరేట్ నుండి ఉమెన్స్ కాలేజీ వరకు ఏక్తా దివస్ ర్యాలీ



నిర్వహించారు.ర్యాలీని రాష్ట్ర ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్,పశ ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సహచర ప్రజాప్రతినిధులు కలసి జెండా ఊపి ప్రారంభించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ మన భారత జాతిరత్నం సర్ధార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ఆయన స్ఫూరి ్తని భావితరాలకు చాటి చెప్పాలనే ఉద్దేశ్యంతో ర్యాలీని నిర్వహించడం ఎంతో గర్వకారణమన్నారు.స్వతంత్ర బారతదేశ తొలి హోమంత్రి గా 560కిపైగా ప్రిన్స్లి స్టేట్స్‌ను విలినం చేసి ఒకే బారతదేశాన్నినిర్మించిన ఘనత ఆయనదే అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.యువతలో ఐక్యత,దేశభక్తి విలువలను పెంచే ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు.

# గుంటూరు వార్త



## 393 అంబాసిడర్ తో అనుబంధాన్ని గుర్తు చేసుకున్న సీఎం

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 31: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను మూడు దశాబ్దాల క్రితం ఉపయోగించిన అంబాసిడర్ కారును పరిశీలించి, ఆ కారుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 393 నెంబరుతో ఉండే ఈ అంబాసిడర్ కారు చంద్రబాబు నాయుడు సొంత వాహనం. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా 393 నెంబర్ ఉన్న అంబాసిడర్ కాన్వాయిలో ముఖ్యమంత్రి రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించేవారు. 393 అంబాసిడర్ అంటేనే సీబీఎన్ బ్రాండ్ కార్ అనేలా ఈ కారు గుర్తింపు పొందింది. ప్రస్తుతం నాలుగోసారి సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు... భద్రతా



పరంగా ఆధునిక వాహనాలు వినియోగిస్తున్నా... తన సొంత కారు అయిన నాటి అంబాసిడర్ ను మాత్రం అపురూపంగానే చూసుకుంటున్నారు. ఇప్పటి వరకు హైదరాబాదులో ఉన్న ఈ కారును అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఇకపై ఉంచనున్నారు. పార్టీ కార్యాలయానికి వచ్చి... తిరిగి వెళ్తున్న సమయంలో ఆనాడు తాను వాడిన అంబాసిడర్ కారును చంద్రబాబు పరిశీలించి... ఆ కారులో తన ప్రయాణ స్మృతులను గుర్తు చేసుకున్నారు.

## జి.ఎస్‌టి శాఖకే గర్వకారణం నాగరాజు

గుంటూరు విద్య ప్రభాతవార్త: కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్, జిఎస్టీ శాఖలోని ఐ.ఆర్.ఎస్ అధికారి ఎం. నాగరాజు అందించిన సేవలు డిపార్ట్మెంట్ లో చిరస్థాయిగా నిలిచిపోతాయని సెంట్రల్ జి. ఎస్. టి కమిషనర్ సుజిత్ మల్లిక్ పేర్కొన్నారు. శుక్రవారం పలకలూరు రోడ్ లోని గుంటూరు క్లబ్ లో జరిగిన జిఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఎం. నాగరాజు ఉద్యోగ విరమణ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దీనికి రిటైర్డ్ జిఎస్టీ చీఫ్ కమిషనర్ సి. పి. రావు అధ్యక్షత వహించారు. కమిషనర్



సుజిత్ మల్లిక్ మాట్లాడుతూ.. నాగరాజు శాఖ పరంగా ఎన్నో ప్రభుత్వ అవార్డులు, రివార్డులు పొంది శాఖకు గర్వకారణంగా నిలిచారన్నారు. రిటైర్డ్ చీఫ్ కమిషనర్ సి. పి. రావు , జిఎస్టీ అడిషనల్ కమిషనర్ బి. లక్షీ ్మనారాయణ మాట్లాడుతూ.. నాగరాజు సేవలు సాటిలేనివన్నారు. ఆయన పనితీరు ఉద్యోగులందరికీ మార్గదర్శకమన్నారు. జిఎస్టీ జాయింట్ కమిషనర్ దేవ్ కుమార్ మాట్లాడుతూ.. అభివృద్ధి ధ్యేయంగా అహర్నిశలు కృషి చేసి జిఎస్టీ శాఖలో సుస్థిరమైన స్థానాన్ని నాగరాజు పొందకలిగారన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న ఎం. నాగరాజు మాట్లాడుతూ..విధుల పట్ల అంకితభావం, బాధ్యయుతంగా పనిచేస్తే, ఏ ఉద్యోగికైనా గుర్తింపు లభిస్తుందన్నారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నాగరాజును పెద్ద ఎత్తున అధికారులు, ఉద్యోగులు సత్కరించి, జ్ఞాపికలు బహుకరించారు. కార్యక్రమంలో మాజీ ఎం. ఎల్. సి పందుల రవీంద్ర బాబు, గజిటెడ్ అధికారుల సంఘ నాయకులు గాదె శ్రీనివాస రెడ్డి, కె. యుగంధర్ కుమార్, బి. నవీన్ రాజు, సూర్యదేవర రమేష్ బాబు మినిస్టీరియల్ సంఘ నేతలు శాఖమూరి శ్రీనివాస్, బిల్లా ప్రశాంత్ కుమార్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు టి. వివేకానంద, గద్దె తిలక్, పి.వి.సత్యనారాయణ, పి.ఎస్.వి. ప్రసాద్, గుమ్మడి సీతారామయ్యచౌదరి, ఎన్. ఎస్. నగేష్ బాబు, కె. సాంబ్రాజ్యం పాల్గొన్నారు.

## పేదలకు నిత్యాసర సరుకుల పంపిణీ

పెదనందిపాడు అక్టోబర్ 31 (ప్రభాతవార్త): పెదనందిపాడు ప్రభుత్వ ఆసుపత్రి ముందు నివాసం ఉంటున్న పేదలకు శుక్రవారం టిడిపి నాయకులు యార్డ్ డైరెక్టర్ చాగంటి సత్యహర్ష ఆధ్వర్యంలో షేక్



ఖలీల్ . నూతి శ్రీనివాసరావు. దిలీప్. శంకర్రావు తదితర పార్టీ ప్రముఖులు తమ సొంత డబ్బులతో. నిత్యావసర సరుకులు అందజేసి పలువురు మన్ననలు పొందారు.

## ప్రత్తిపాడు వైసిపి ఇన్‌చార్జి బలసాని ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

పెదనందిపాడు అక్టోబర్ 31. (ప్రభాతవార్త)ఫ పెదనందిపాడు మండలం పాలపర్రు, రాజుపాలెం గ్రామాలలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా మరియు ప్రజల వైద్య ఆరోగ్య భద్రత కోసం కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రత్తిపాడు వైసిపి ఇంచార్జ్ బలసాని కిరణ్ కుమార్ మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్యం అందించాలని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్



రాజశేఖర్ రెడ్డి ఆశయాల మేరకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలను శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేయడమే కాకుండా నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రైవేటీకరణ చేసి ప్రజలపై పెనుబారం మోయాలని చూస్తుందన్నారు .పార్టీ పిలుపుతో ప్రజల ఆరోగ్యం విద్యను కాపాడే ఈ పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ షేక్ ఖాసింపీరా, జంపని సంజీవరావు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పటేల్ చిత్రపటానికి నివాళులు



పెదనందిపాడు అక్టోబర్ 31 (ప్రభాతవార్త) పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం భారత స్వాతంత్ర్య సమరయోధుడు మరియు స్వతంత్ర భారత తొలి ఉప ప్రధాని, కేంద్ర హోం శాఖ మంత్రి. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి వీరరాఘవయ్య. మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ భారతదేశానికి చేసిన పలు రకాల సేవలను వివరించారు. భారతదేశ స్వాతంత్రానంతరం కూడా ఎన్నో సంస్థానాలు భరత్ లో విలీనం కాకుండా స్వతంత్రంగా ఉండిపోయాయియని. సర్దార్ వల్లభాయ్ పటేల్ వాటన్నిటిని భరత్ లో విలీనం చేయటానికి విశేషంగా కృషి చేశారన్నారు. ముఖ్యంగా హైదరాబాద్, జునాగడ్ సంస్థానాలను భరత్ లో కలపడానికి వారు చేసిన కృషి ప్రశంసనీయం అన్నారు. విద్యార్థులు వారిని ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. తొలుత ప్రిన్సిపాల్ అధ్యాపకులు విద్యార్థులు సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

## ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

గుంటూరు విద్య,అక్టోబర్ 31,ప్రభాతవార్త : సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జన్మదిన వేడుకలు స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ అధ్యక్షతన జిల్లా కార్యాలయంలో ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు.జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుంచి పార్టీ నాయకులు కార్యకర్తలు కార్యక్రమానికి హాజరై పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులరి ్పంచారు.దేశాన్ని స్థిరత్వం వైపు నడిపించిన ఆ మహనీయుడ్ని నేటితరం గుర్తుంచుకోవాలని ఏసుబాబు మాదిగ పేర్కొన్నారు.అందుకే ఆయన జన్మదినాన్ని జాతీయ సమైక్యతా దినంగా యావత్ భారతదేశం జరుపుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

## ఘనంగా నేషనల్ టీచర్స్ డే



గుంటూరు విద్య,అక్టోబర్ 31,ప్రభాతవార్త : ప్రైవేట్ టీచర్స్,లెక్చరర్స్ ప్రొఫెసర్స్ యూనియన్ స్టేట్ ప్రెసిడెంట్ కె.బాబ్జి ఆధ్వర్యంలో కెవిఆర్ కాలేజీ లో నేషనల్ టీచర్స్ డే సెలబ్రేషన్స్ జరిగాయి.ఈ సందర్భంగా కార్యక్రమానికి అప్సా డెమొక్రాటిక్ స్టేట్ ప్రెసిడెంట్ జి.మోహన రావు,అపుస్మా స్టేట్ ప్రెసిడెంట్ కే.తులసీ విష్ణు ప్రసాద్,శరత్‌చంద్ర సివిల్స్ కోచింగ్ సంస్థ చైర్మన్,శరత్‌చంద్ర హర్ష ఐఐటి మెడికల్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డిలు ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు.ఎస్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు టీచర్స్‌యొక్క సమస్యల గురించి వాటిని ఎలా సమర్ధంగా సంపాదించుకోవాలో అనే ఇత్యాధి అంశాలపై మాట్లాడారు.ముఖ్యంగా హెల్త్ కార్డ్ ్స గురించి చక్కగా అందరికి అర్ధమయ్యే విధంగా మాట్లాడారు.అనంతరం ఎస్.శ్రీనివాసరెడ్డిని ప్రైవేటు టీచర్స్ లెక్చరర్స్ ప్రొఫెసర్ యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించుకున్నారు.కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్ ్స రాష్ట్రనేతల జి.మోహనరావు,తులసీ విష్ణు ప్రసాద్‌లు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పిఎఫ్ ఈఎస్‌ఐ హెల్ ్తకార్డులు తదితర సమస్యలపై తగిన పరిష్కార దిశగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు.వివిధ జిల్లాల నుండి యూనియన్ నాయకులు సభ్యులు కార్యక్రమానికి పెద్దఎత్తున హాజరయ్యారు.

## ఆర్‌విఆర్ జేసి కళాశాల్లో ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకలు




గుంటూరు విద్య,అక్టోబర్ 31,ప్రభాతవార్త : సమైక్య భారత నిర్మాతగా సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని ఆర్‌విఆర్ జేసి ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్,ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్,డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు.మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల ్ జయంతిని పురస్కరించుకొని స్థానిక చౌడవరంలోని ఆర్‌విఆర్ జేసి కళాశాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు,సిబ్బంది ఏక్తాదివస్‌పేరుతో ప్లకార్డులు ప్రదరి ్శస్తూ కళాశాల ప్రాంగణం నుండి ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్,వివిధ విభాగాల డైరెక్టర్లు డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు,ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ్స కోఆర్డినేటర్లు,అధ్యాపక,అధ్యాపకేతర సిబ ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## 2న అవగాహన...లో ఆరోగ్యసభ

గుంటూరు కల్చరల్,అక్టోబర్ 31,ప్రభాతవార్త : అవగాహన సంస్థ గత 18సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ప్రతిఆదివారం ఆరోగ్యసభలో ్ల భాగంగా ఈవారం కిడ్ని సంబంధిత వ్యాదులు-నిర్ధారణ-చికిత్స అన్న అంశంపై సభ ఏరా ్పటు చేయబడిందని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు.నవంబర్ 2వ లేది ఆదివారం ఉదయం 11గంటలకు సంస్థ కార్యాలయంలో నిర్వహించే ఆరోగ్యసభకు ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ నిహారిక జొన్నలగడ్డ ప్రధానవక్తగా పాల్గొంటారన్నారు.367వ ఆదివారం ఆరోగ్యసభగా నిర్వహించబడే ఈ సభకు ఆరోగ్యాభిలాషులందరూ హాజరు కావలసిందిగా విజ్ఞపి ్త చేశారు.

## వామపక్షయోధుడు స్టాలిన్‌బాబు సంస్మరణ సభ



గుంటూరు కల్చరల్,అక్టోబర్ 31,ప్రభాతవార్త : వామపక్ష యోధుడు,ఉద్యమకారుడు, స్ఫూర్తిప్రధాత,ఆత్మీయతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన బొప్పూడి స్టాలిన్‌బాబు సంస్మరణ సభ నవంబర్ 1వ తేది శనివారం ఉదయం 10గంటలకు మెట్టు అంజిరెడ్డి కన్వెన ్షన్ హాల్ శ్యామలానగర్ రైలుగేటు వద్ద జరపబడే ఈ సభకు సిపిఐ రాష్ట్రనాయకులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు అధ్యక్షత వహిస్తారు.సభలో సిపిఐ కేంద్ర కార్యదర్శ వర్గ సభ్యులు కె.రామకృష్ణ,సిపిఐ తెలగాణా రాష్ట్ర సమితి కార్యదర్శి కూనంనే సాంబశివరావు,మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు తదితరులు పాల్గొని స్టాలిన్‌బాబుకి నివాళులర్పిస్తారు.స్టాలిన్‌బాబు సన్నిహితులు,మిత్రులు,అవగాహన సంస్థ సభ్యులు ఈ సంస్మరణ సభలో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

## పోలీసు అమరవీరుల వారోత్సవాలు..ఆయుధాల ప్రదర్శన

గుంటూరు విద్య,అక్టోబర్ 31,ప్రభాతవార్త : నగరంలో పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసు కళ్యాణమండపంలో ఆయుధాల ప్రదర్శన ఘనంగా నిర్వహించారు.ఈ ప్రదర్శనను జిల్లా పోలీసు అధికారి వకుల్ జిందాల్ ప్రారంభించారు.తమ సిబ్బందికి అందుబాటులో ఉన్న ఆధునిక తుపాకులు,బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు,కమ్యూనికేషన్ పరికరాలు,బాంబ్ డిటెక్షన్ పరికరాలు,సెక్యూరిటీ సామాగ్రి వంటి వివిధ రకాల ఆయుధాలను ఈ ప్రదర్శనలో ప్రదరి ్శంచింది.కార్యక్రమంలో మొదటగా పోలీస్ శాఖ ఆహ్వానం మేరకు నగరంలోని



ప్రముఖ విద్యాసంస్థ జైన్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.పెద్దసంఖ్యలో వచ్చిన విద్యార్థులు పోలీసు శాఖ ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించారు.పోలీసు అధికారులు ఆయుధాల ఉపయోగ విధానాలు,వాటి ప్రాముఖ్యత,దేశ భద్రతలో పోలీసుశాఖ పాత్ర,ప్రజారక్షణ కోసం అధికారులు ఎదుర్కొనే సవాళ్ళు వంటి అంశాలపై విద్యార్థులకు సమగ్ర వివరణ ఇచ్చారు.విద్యార్థులు తమ ప్రశ్నలను అడిగి,పోలీస్ సిబ్బందితో ప్రత్యక్షంగా సంభాషించడం ద్వారా ఆసక్తి కరమైన అనుభవాన్ని పొందారు.ఈ సందర్భంగా జైన్ హైస్కూల్ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ మున్ను మాట్లాడుతూ పోలీసు శాఖ సమాజ భద్రతకు అంకితభావంతో పనిచేస్తుందని,ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి,క్రమశిక్షణ,ప్రజా సేవా భావం పెంపొందుతాయన్నారు.ఆయన పోలీసు శాఖ ఆహ్వానానికి ధన్యవాదాలు తెలుపుతూ విద్యార్థులు సమాజ సేవలో పోలీసుల కృషిని సమీపంగా చూడగలిగిన ఈ అవకాశాన్ని విలువైనందిగా అభివర్ణించారు.కార్యక్రమంలో జైన్ హైస్కూల్ ఉపాధ్యాయులు,విద్యార్థులు,పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.కార్యక్రమం ముగింపు సందర్భంగా విద్యార్థులు పోలీసు శాఖ కృషిని ప్రశంసిస్తూ భవిష్యత్తులో ఇలాంటి విద్యాపరమైన కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని అభిలషించారు.మొత్తం మీద పోలీసు శాఖ నిర్వహించిన ఆయుధాల ప్రదర్శన విద్యార్థుల్లో కొత్త అవగాహనను,భద్రతా దృక్పధాన్ని,దేశ సేవ ప్రేరణను నింపింది.జైన్ హైస్కూల్ విద్యార్థుల సందర్శన ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్

గుంటూరు కల్చరల్,అక్టోబర్ 31,ప్రభాతవార్త : గణతంత్ర భారత పునాదులను పటిష్టంగా తీర్చిదిద్దిన మహనీయుల్లో ప్రముఖుడు స్వతంత్ర భారత తొలి ఉపప్రధాని,హోమంత్రి సర్దార్‌వల్లభాయ్ పటేల్ అని స్వాతంత్ర సమరంలో ఉక్కుమనిషిగా దేశప్రజల చేత కీర్తించబడ్డ ధైర్యశాలి పటేల్ అని




అవగాహన సంస్థ సభ్యులు నివాళులర్పించారు.కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ దేశ విభజనానంతర పరిస్థితుల్లో పటేల్ వాస్తవిక దృక్పధం ,సహనం,దృఢత్వాలే భారత ఉపఖండం విచ్చినం కాకుండా నిరోదించగలిగామన్నారు.కార్యక్రమలో సంస్థ సీనియర్ సభ్యులు టివి సాయిరామ్,సత్యనారాయణ,రాజ్యాంగ చర్చ వేదిక కన్వీనర్ అవధానుల హరి,జోస్పిన్, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## ఇందుపల్లి వర్ధంతి సందర్భంగా పేదలకు ఉచిత కంటి వైద్య శిబిరం

మంగళగిరి రూరల్, అక్టోబర్ 31, ప్రభాతవార్త: జన చైతన్య ప్రచార కమిటీ అధ్యక్షుడు మాచర్ల ఏసోబు నాయకత్వంలో సంధ్య కంటి హాస్పటల్‌చే ఉచిత కంటి వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. హైకోర్టు న్యాయవాది కుమ్మరి కుంట ప్రేమ్ కుమార్ కార్యాలయంలో జరిపారు. ప్రథమ కంటి ఆస్పటల్ డాక్టర్ కాశి రాజు యాదవ్ ఆయన బృందం నేత్ర వైద్య చికిత్సలు చేశారు. లక్ష్మీనరసింహ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు మేకల మోహన్ రావు ప్రారంభించారు. యుఎస్ఎఫ్ఐ భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కూర జాన్ బాబు, దళిత క్రైస్తవ మహిళా నాయకురాలు కూర ఝాన్సీ రాణి, సి ఎం డి ఎఫ్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నూతక్కి కృష్ణ రేఖ, న్యాయవాది మంగళంపల్లి షమ్మ పాల్, తెనాలి కళ్యాణ్, బిర్నీడి రవి, పల్లె నాగయ్య, నేలపట్ల విజయరావు, మాకం రవి, చిత్రం పడిగేశ్వరరావు, ఇంకా తదితరులు పాల్గొన్నారు.



## కుంచనపల్లిలో శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ పున:నిర్మాణ శంకుస్థాపన

తాడేపల్లి, అక్టోబర్ 31, ప్రభాతవార్త : మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి మండలం కుంచనపల్లిలో శ్రీగంగా, శ్రీఅన్నపూర్ణాదేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామివార్ల ఆలయ పున:నిర్మాణ శంకుస్థాపన మహోత్సవంలో విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ కు..గ్రామస్థులు, ఆలయ పున:నిర్మాణ అభివృద్ధి కమిటీ సభ్యులు బాణాసంచాతో ఘనస్వాగతం పలికారు. వేదమంత్రోచ్చారణ మధ్య ఆలయ పున:నిర్మాణ అభివృద్ధి కమిటీ సభ్యులతో కలసి శ్రీగంగా, శ్రీఅన్నపూర్ణాదేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి వార్ల ఆలయ పున:నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ధాన్యాది వాసంలోని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అందరితో కలసి ఫోటోలు దిగారు. కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య, ఏపిఎంఎస్ఐడిసి ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టిటిడి బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావుతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



## ఇందిరా గాంధీ 41వ వర్ధంతి కార్యక్రమం

మంగళగిరి, అక్టోబర్ 31, ప్రభాతవార్త: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 41వ వర్ధంతి సందర్భంగా మంగళగిరినియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ సలీమ్ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. మంగళగిరి బస్టాండ్ సెంటర్లో, భార్గవపేట లో గల ఇందిరా గాంధీ విగ్రహానికి షేక్ సలీం పూల మాలలు వేసి వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ బ్యాంక్ లు జాతీయం చేయడం, ఎల్ఐసి అభివృద్ధి చేయడం, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు రిజర్వేషన్ కల్పించి వారి అభివృద్ధికి ఇందిరా గాంధీ ఎంతో దోహదపడ్డారన్నారు. పాకిస్తాన్ పై యుద్ధం చేసి విజయవంతం చేసిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి ఉక్కు కర్మాగారం ఇవ్వటం, 20 సూత్రాల పథకాలను అమలు చేయడంవంటి మరెన్నో సంక్షేమ పథకాలు ఇందిరమ్మ నేతృత్వం లో చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జి షేక్ సలీం, గుంటూరు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎస్.కె. మున్ని, గుంటూరు జిల్లా కాపు సంఘం సాధికార ఛైర్మన్ రామినిశెట్టి హనుమంతు రావు, మంగళగిరి మండల అధ్యక్షులు తుపాకుల కృష్ణ చౌదరి, మంగళగిరి సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జె జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం

పొన్నూరు, అక్టోబరు 31, ప్రభాతవార్త: తుఫాను బాధితుల పక్షాన ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, బాధితులు ఎలాంటి అపోహలు నమ్మవద్దని, అన్ని విధాలుగా ఆదుకోవాడానికి కూటమి నాయకులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బండ్లమూడి బాబూరావు అన్నారు. మండల పరిధిలోని ఉప్పరపాలెం, నండూరు, పెద ఇటికంపాడు, ములుకుదురు, ఆరెమండ, మామిళ్ళపల్లి గ్రామాల్లో తుఫాను బాధితులకు ప్రభుత్వం నుంచి వచ్చిన నిత్యావసరాలను నాయకులు పంపిణీ చేశారు. ఈ గ్రామాల్లో సుమారు 162మంది కుటుంబాలకు 25కిలోల బియ్యం, కంది పప్పు, వంటనూనె, ఉల్లిపాయలు, బంగాళా దుంపలు, పంచదార ఒక్కొక్కటి కిలో చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో విఆర్వో శ్రీనివాసరావు, నాయకులు మాదల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, చలమశెట్టి సీతారామయ్య, గణిపిశెట్టి రామకృష్ణ, సొపాటి వెంకట్రావు తదితరులున్నారు.



## రూరల్ సిఐగా కృష్ణయ్య

పొన్నూరు, అక్టోబరు 31, ప్రభాతవార్త: పొన్నూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పూండ్ల కృష్ణయ్య శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు మహిళా పోలీస్ స్టేషన్ నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేసిన యాదం కోటేశ్వరరావు ఏసిబికి బదిలీ అయ్యారు. 2002బ్యాచ్‌కి చెందిన కృష్ణయ్య పలు ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. గతంలో అద్దంకి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. ఎక్కడ పనిచేసినా ప్రజలతో మమేకమై సమర్థవంతంగా విధులు నిర్వహిస్తారనే మంచి పేరును సంపాదించుకున్నారు. పొన్నూరు రూరల్ సర్కిల్ పరిధిలో ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూ, శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా కర్తవ్యాన్ని నిర్వహిస్తానన్నారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా తనను నేరుగా కలిసి కష్ట సుఖాలను తెలుపుకోవచ్చన్నారు. ప్రజలు రక్షణ బాధ్యతలు చేపట్టడమే ధ్యేయంగా పోలీసులు పనిచేస్తారన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. పేకాట, అక్రమ మద్యం, గంజాయి, తదితర అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కృష్ణయ్య కోరారు.




## పారదర్శక పాలన కూటమికే సాధ్యం

పొన్నూరు, అక్టోబరు 31, ప్రభాతవార్త: రాష్ట్రంలో పారదర్శక పాలన అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే చెందుతుందని ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బూసవల్లి ప్రభాకర లక్ష్మి ప్రసాదరావు అన్నారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో శనివారం తుఫాను బాధితులకు ప్రభుత్వం నుంచి వచ్చిన నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బూసవల్లి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన అన్నీ వాగ్దానాలను అమలు చేసి మంచి ప్రభుత్వంగా పేరు తెచ్చుకుందన్నారు. మైనార్టీ నాయకుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలు అందరూ సుఖశాంతులతో ఉన్నారన్నారు. గత ప్రభుత్వం పాలనలు సర్వనాశనం చేసిందన్నారు. గత ప్రభుత్వ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముందు చూపుతో మొంథా తుఫాను నష్టాన్ని తగ్గించగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో అన్నారు వెంకటేశ్వరరావు, బైసాని నాగరాజు, వేమజ్జ హనుమంతరావు, పిన్నమనేని కోటేశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులున్నారు.



## ఆచార్య ఎన్జీ రంగా జయంతి సభను జయప్రదం చేయండి

పొన్నూరు, అక్టోబరు 31, ప్రభాతవార్త: ప్రపంచ రైతాంగ నేత, రైతు జన బాంధవుడు, పద్మవిభూషణ్, ఆచార్య ఎన్జీరంగా 125వ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని రంగా ట్రస్ట్ ఛైర్మన్ రామినేని కిషోర్‌బాబు పిలుపునిచ్చారు. నిడుబ్రోలు రంగాజీ స్వగృహంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 7వ తేదీన లాం ఫామ్‌లోని ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీ లో జరిగే రంగా జయంతి బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రులు, పార్లమెంట్ సభ్యులు పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో రంగా జీవిత చరిత్రకు సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్, అధునాతన వ్యవసాయ పరికరాల ప్రదర్శన, నూతన వంగడాల వివరాల ప్రదర్శన జరుగుతుందన్నారు. సమావేశంలో మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ సజ్జా హేమలత, బొద్దులూరి రంగారావు, ఆకుల జానకీబాబు, షేక్ యాసిన్‌బాబా, గురుబాలు తదితరులు పాల్గొన్నారు.



## సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

పొన్నూరు, అక్టోబరు 31, ప్రభాతవార్త: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు ఆదేశించారు. మండల పరిధిలోని మన్నవ సచివాలయంలో ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని, ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో లేరని, తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయి. దీంతో ఎంపిడిఓ గ్రామంలోని సచివాలయాన్ని శుక్రవారం ఆకస్మింగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయితీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. రైతు సేవా కేంద్రం గ్రామ వ్యవసాయ సహాకుడు గ్రామంలో అందుబాటులో ఉండడం లేదన్న పిర్యాదుపై ఎంపిడిఓ అతనిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించని పక్షంలో చర్యలు తీసుకొంటామన్నారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాల కార్పోరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబూరావు ఉన్నారు.



## రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

బాపట్ల, అక్టోబరు 31, ప్రభాతవార్త: ధాన్యం పండించిన రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించుకునే విధంగా ఏర్పాట్లు చేసినట్లు డీసిఎమ్మెస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు అన్నారు. బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేల పర్యవేక్షణలో రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. ధాన్యం కొనుగోలు చేసేందుకు నియమించిన సిబ్బంది కొనుగోలు కేంద్రాలపై, ధాన్యంపై పూర్తి అవగాహన పెంచుకొని రైతుల ప్రయోజనం కోసం పనిచేయాలన్నారు. రైతులకు మరీ మరీ చేప్పేదేమంటే దళారుల మాయలోపడి మోసపోవద్దని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, ఎఎం నాగమల్లేశ్వరి, డిఎస్ఓ జమీర్‌బాషా, జీడీసీఎమ్మెస్ బిజినెస్ మేనేజర్ శ్రీహరి గోపాలం, డీసీఎమ్మెస్ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## కార్మికుల హక్కుల సాధనకు కృషి చేసిన ఘనత ఏఐటియుసిదే

పొన్నూరు, అక్టోబరు 31, ప్రభాతవార్త: కార్మికుల హక్కుల సాధనకు కృషి చేసిన ఘనత ఏఐటియుసికే దక్కుతుందని ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు అన్నారు. స్థానిక ఐలాండ్ సెంటర్‌లో ఏఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ఏఐటియుసి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆరేటి రామారావు మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటిగా స్థాపించిబడిన యూనియన్ ఏఐటియుసి అని చెప్పారు. 105వసంతాల ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొందన్నారు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు అన్ని రాష్ట్రాల్లో వ్యాపించిన ఉన్న అతి పెద్ద యూనియన్ ఏఐటియుసి మాత్రమేనన్నారు. బ్రిటీష్ కాలం నుంచి ఇప్పటి వరకు అనేక హక్కుల సాధన కోసం శ్రమించిందన్నారు. ఈ యూనియన్‌కు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు లాలా లజపతిరాయ్ అధ్యక్షులుగా పనిచేశారన్నారు. ఎందరో ప్రముఖ నాయకులు ఈ యూనియన్ ద్వారా ముందుకొచ్చి అనేక పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మీనుగ సత్యనారాయణ, గుంటూరు ఏడుకొండలు, కూచిపూడి రత్నబాబు, మిక్కిలి బాబూరావు, కూరాకుల కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సాంబయ్య, రాంబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




## విధ్వంసం కోరుకునే మనస్తత్వం జగన్‌ది



పొన్నూరు, అక్టోబరు 31, ప్రభాతవార్త: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మొంథా తుఫాన్‌కు ముందస్తు చర్యలు తీసుకోవడంతో ప్రాణ నష్టాన్ని తగ్గించగలిగామని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ చెప్పారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో గుడిసెల్లో నివశించే వారిని వెంటనే గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించి వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం, సీనియర్ ఐఎఎస్ అధికారులను పర్యవేక్షణకు నియమించడం, ముఖ్యమంత్రి నిరంతరం సమీక్షలు నిర్వహించడం వల్ల అధికార యంత్రాంగం వెంటనే స్పందించిందన్నారు. ప్రస్తుతం బెంగుళూరు ప్యాలెస్‌లో కూర్చుని సమీక్షలు జరిపి తుఫాను రావడం ప్రభుత్వ వైఫల్యం వల్లేనని చెప్పడం ఆయన ఆలోచనా రాహిత్యానికి నిదర్శనమన్నారు. తుఫానులు ఎవరికీ చెప్పిరావని, వాటిని ఆపడం ప్రభుత్వాల వల్ల, మనుష్యుల వల్ల సాధ్యం కాదని గుర్తు చేశారు. జగన్ కేవలం రాజకీయ కోణంలోనే మాట్లాడుతున్నారన్నారు.

## ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణపై శిక్షణ

క్రోసూరు అక్టోబర్ 31 ప్రభాతవార్త: ఆసిస్ట్-ఐటిసి ఆధ్వర్యంలో క్రోసూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సర్పంచులకు ఎస్హెచ్జి వివోఏలకు సిఆర్పి లకు ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణపై శిక్షణా కార్యక్రమం ఇవ్వడం జరిగింది . అసిస్ట్ కోఆర్డినేటర్ సిహెచ్ శ్రీనివాసరావు ద్వారా ఘన ద్రవ వ్యర్థాలు నిర్వహణపై అవగాహన కల్పించడం జరిగింది. అసిస్ట్ ట్రైనర్ సిహెచ్ బోలయ్య మాట్లాడుతూ గ్రామాలలో తడి పొడి చెత్త వేరు చేసి సేకరించాలని తద్వారా గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా గవర్నమెంట్ ప్రవేశపెట్టిన స్వచ్ఛ రథాలను ఉపయోగించుకొని గ్రామాలలో పొడి చెత్త లేకుండా బహిరంగ ప్రదేశాల్లో పడి వేయకుండా పారిశుద్ధ గ్రామాలుగా ఉండాలని తెలియజేశారు . అసిస్ట్ ట్రైనర్ బొలయ్య , క్రోసూర్ ఎంపీడీవో ,రవికుమార్ ,ఈవోపీఆర్డి శ్రీనివాస రావు , ఏవో రమణ,అన్ని గ్రామాల పంచాయతీ సెక్రెటరీ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సర్పంచులు ఎస్ ఎస్ జి మెంబర్స్ సీఆర్పీలు ,శ్రీనివాస్ ,ట్రైనర్ బోలయ్య, సి ఓ అనిల్ కుమార్ పాల్గొన్నారు



## 19 అంశాలకు కౌన్సిల్ ఆమోదం



రేపల్లె, అక్టోబరు 31 ప్రభాతవార్త:పట్టణంలోని పురపాలక సంఘంలో శుక్రవారం ఛైర్ పర్సన్ కె.మంగ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో 19 అంశాలను తీర్మానించారు. వైస్ ఛైర్మన్ గుజ్జర్ల మూడి ప్రశాంత్ కుమార్ ఎజెండా లోని అంశాలను చదివి వినిపించారు. ఎక్కువ మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, డిఇఓ మధుసూదనరావు, గా జాన్ శామ్యూల్ ఈ ఈ మధుసూదన రావు ఏఈ జాన్ శామ్యూల్, శానిటరీ ఇన్స్పెక్టర్ రామచంద్రరావు, ఆర్ఓ.రత్నాంజలి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికులను ఆదుకోవాలి



రేపల్లె అక్టోబరు 31 ప్రభాతవార్త:తుఫాను కారణంగా నష్టపోయిన చేనేత కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. వర్షాలకు చేనేత కార్మికుల పనులు నిలిచిపోయాయన్నారు. మగ్గాలపై ఉన్న వస్త్రాలు, నూలు తడిసిపోయినందున నష్టం ఏర్పడిందన్నారు. సత్వరమే సహాయక చర్యలు చేపట్టాలని పట్టెం శ్రీనివాసరావు కోరారు. గత సంక్షేమ పథకాల బకాయిలను విడుదల చేయాలని సూచించారు. నేతన్న నేస్తం కింద రూ. 25 వేలు మంజూరు చేసి కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

## పందులను అడవికి పంపుతాం

రేపల్లె, అక్టోబరు 31, ప్రభాతవార్త: పట్టణంలోని జనావాసాల వద్ద సంచరించే పందులను అడవికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.సాంబ శివరావు తెలిపారు. శుక్రవారం



ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని పందుల యజమానులకు తెలియజేసామన్నారు. రెండు రోజుల గడువిస్తున్నందున పట్టణంలో పందులు సంచరించకుండా యజమానులు కట్టడి చేసుకోకపోతే నెల్లూరుకు చెందిన పందులు పెట్టేవాడిని పిలిపించి అడవులకు తరలిస్తామని కమిషనర్ సాంబశివరావు హెచ్చరించారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, మున్సిపల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## హిందీలో శశికాంత్ ప్రతిభ



గురజాల, అక్టోబరు 31 ప్రభాతవార్త: దక్షిణ భారత హిందీ ప్రచారసభ మద్రాస్ ఆధ్వర్యాన నిర్వహించే హిందీ పరీక్షల్లో గురజాలకు చెందిన మాలపాటి శశికాంత్ అద్భుత ప్రతిభను కనబరుస్తున్నాడు. దాచేపల్లిలోని స్కాలర్స్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతూ గురజాలలోని తాజూన్ హిందీ కోచింగ్ సెంటర్ నిర్వాహకులైన ఎం రవికుమార్, ఎస్కె తాజూన్ శిక్షణతో మంచి మార్కులు సాధిస్తున్నాడు. ప్రాథమిక 2021 సెప్టెంబరులో, 2022 ఫిబ్రవరిలో మధ్యమ, సెప్టెంబర్‌లో రాష్ట్ర బాష, ప్రవేశిక 2023 సెప్టెంబర్‌లో, 2024 ఫిబ్రవరిలో విశారద పూర్వార్థ, 2025 ఫిబ్రవరిలో ప్రవీణ ఉత్తరార్థ, సెప్టెంబరులో ప్రవీణ ఉత్తరార్థ పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. హిందీ ఉపాధ్యాయులు ఎస్ తాజూన్, రవికుమార్‌లు ఇస్తున్న శిక్షణ, తమ తల్లిదండ్రులు మాలపాటి ఆదిత్య, దినేష్‌కుమార్‌లు ఇస్తున్న ప్రోత్సాహంతో తాను హిందీలో ప్రతిభ కనబరుస్తున్నానని శశికాంత్ తెలిపారు. రాబోయే రోజుల్లో హిందీలోమరింత ప్రతిభ చూపుతానని అన్నారు.

## ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకలు

విజయపురిసౌత్, అక్టోబరు 31 ప్రభాతవార్త: భారతదేశపు ఉక్కు మనిషిగా పేర్గాంచిన సర్దార్ వల్లభబాయి పటేల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సెంట్రల్ రిజర్వు పోలీసు ఫోర్స్




ఇన్‌స్పెక్టర్ డి.జయచంద్రనాయుడు, విజయపురిసౌత్ ఎస్సై అశోక్, ఏపీఆర్‌డీసీ ప్రిన్సిపల్ నయీంభాను ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ తరఫున నిర్వహించిన ఐక్యతా ర్యాలీలో 200 మంది విద్యార్థులతో జాతీయ జెండాలతో, దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా ఐక్యతా స్పూర్తితో ర్యాలీ కొనసాగింది. డిగ్రీ కళాశాల నుంచి డ్యాం మీదుగా, ప్రధాన వీధులను కలుపుకుంటూ అంబేద్కర్ కూడలిని చేరుకొని విద్యార్థులంతా మానవహారంగా ఏర్పడ్డారు. జాతీయ ఐక్యతను, సమగ్రతను కాపాడిన భారతదేశ ప్రథమ హోంశాఖ మంత్రి ఉక్కుమనిషిగా పేరొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమాండింగ్ ఆఫీసర్ ఎఫ్-234 సెంట్రల్ రిజర్వు పోలీసు బలగాలు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా॥ ఎస్‌కేఎం బాషా, ఇన్‌స్పెక్టర్ గిరీష్ చంద్‌భట్, ఎస్సైలు, కిమ్ అసెంగ్, బసవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## పంటలను పరిశీలించిన జిల్లా ఉద్యాన అధికారి

మాచర్ల, అక్టోబరు 31 ప్రభాతవార్త: మొంథా తుపాను నేపథ్యంలో దెబ్బతిన్న ఉద్యాన పంటలను జిల్లా ఉద్యాన అధికారి ఐ.వెంకట్రావు శుక్రవారం పరిశీలించారు. మాచర్ల మండల పరిధిలోని కొత్తపల్లి, కొప్పునూరు గ్రామాల పరిధిలో సాగు చేసిన ఉద్యాన పంటలను ఆయన పరిశీలిచారు. సాగులో ఉన్న మిరప, పుచ్చ పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తుపాను వల్ల ఉద్యాన పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. గుంటూరు లాం ఫామ్‌కు చెందిన కీటక శాస్త్రవేత్త డాక్టర్ బి.నాగేంద్రరెడ్డి పంటలకు పురుగు ఆశించకుండా చేపట్టాల్సిన చర్యలను తెలిపారు. మొక్కల మధ్యలో నీరు నిల్వ ఉండి దెబ్బతినకుండా నీటిని బయటికి వెళ్లేలా చేయాలన్నారు. వాటికి పిచికారీ చేయాల్సిన మందులను రైతులకు సూచించారు. కార్యక్రమంలో మాచర్ల గ్రామ ఉద్యాన సహాయకులు వై.మోహన్, వెంకటేశ్వర్లు, తులసీనాయక్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## అవినీతికి వ్యతిరేకంగా ఎన్టీపీసీ ఉద్యోగుల ర్యాలీ

మాచర్ల, అక్టోబరు 31 ప్రభాతవార్త: అవినీతి దేశ అభివృద్ధికి ఆటంకమని, అవినీతి లేని సమాజమే లక్ష్యంగా, అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషి చేయాలని తాళ్లపల్లి ఎన్టీపీసీ డీజీఎం జి.దివాకర్, చీఫ్ మేనేజర్లు రాము, శివకోటయ్యలు అన్నారు. విజిలెన్సు వారోత్సవాల్లో భాగంగా ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు మాచర్ల పట్టణంలోని రింగురోడ్డు సెంటర్ నుంచి బస్టాండ్ వరకు అవినీతికి వ్యతిరేకంగా ర్యాలీ ఎనిర్వహించారు. ఈ సందర్భంగా డీజీఎం దివాకర్ మాట్లాడుతూ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 27 నుంచి నవంబరు 2 వరకు విజిలెన్సు అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా పలు పాఠశాలల్లో విద్యార్థులకు అవినీతికి వ్యతిరేకంగా డిబేట్‌లు, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ర్యాలీలో ఎన్టీపీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.




## పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా ర్యాలీ

మాచర్ల, అక్టోబరు 31 ప్రభాతవార్త: పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా మాచర్ల పట్టణ సీఐ టి.వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులతో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జనసేవలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. సమాజ శాంతి భద్రతల కోసం తమ ప్రాణాలను అర్పించి చిరస్మరణీయులయ్యారు. వారి త్యాగాలు మనందరికీ ప్రేరణగా నిలవాలి అన్నారు. కొవ్వొత్తుల ర్యాలీలో పోలీసులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగి పోలీసు స్టేషన్ వద్ద ముగిసింది. ర్యాలీలో పట్టణ ఎస్సై అనంతకృష్ణ, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ కొమెర దుర్గారావు, పోలీసులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.




## చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు: సీఐ

మాచర్ల, అక్టోబరు 31 ప్రభాతవార్త: చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మాచర్ల అర్బన్ సీఐ వెంకటరమణ హెచ్చరించారు. శుక్రవారం పోలీసు స్టేషన్లో ఏర్పాటు చేసిన



విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో ప్రధాన రహదారిలో దుకాణాల ఎదుట వాహనాలు నిలపకూడదన్నారు. పార్కింగ్ స్థలంలోనే ద్విచక్రవాహనాలను నిలపాలని సూచించారు. రాత్రి 11 గంటల తర్వాత మద్యం సేవించి రోడ్లపై తిరిగే వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ట్రాఫిక్‌కి అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. జూదం, వ్యభిచారం నిర్వహించినట్లు తెలిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవన్నారు. స్థానిక కూరగాయల మార్కెట్ సెంటర్లో తెల్లవారుజాము నుంచి పోలీసులను అక్కడ ఏర్పాటు చేసి ట్రాఫిక్ కంట్రోల్ చేస్తామన్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లో కొంతమంది యువకులు గంజాయి అమ్ముతూ, సేవిస్తున్నట్లు తెలిసిందని వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అర్బన్ ఎస్సై అనంతకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చింతలతండాలో గొర్రెల కాపరిపై రాయితో దాడి

### - గొర్రెల కాపరి మృతి

విజయపురిసౌత్, అక్టోబరు 31 ప్రభాతవార్త: తన పొలంలోకి గొర్రెలు వచ్చాయనే కోపంతో వ్యక్తి గొర్రెల కాపరిపై రాయితో దాడి చేయడంతో గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన మాచర్ల మండలం చింతలతండాలో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గొర్రెల కాపరి జగ్గప్పల సాయితోపాటు మరో ఆరుగురు వ్యక్తులు కొంతకాలంగా వలస వచ్చి చింతలతండా శివారులో జీవాలు మేపుకుంటూ జీవిస్తున్నారు. శుక్రవారం చింతలతండాకు చెందిన రమావత్ బుడ్డానాయక్ తన పొలంలో గొర్రెలు ఎందుకు మేపుతున్నావని జగ్గప్పల సాయి (26)పై రాయితో, కర్రతో దాడి చేశాడు. దీంతో జగ్గప్పల సాయి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

## పోరాటంతోనే హక్కులు సాధ్యం

రేపల్లె అక్టోబరు 31 ప్రభాతవార్త: కార్మికుల హక్కులు,చట్టాలను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, ఎఐటియుసి నాయకులు బండారు శ్రీనివాసరావు లు పిలుపునిచ్చారు. ఎఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం భట్టిప్రోలు లోని ఎఐటియుసి కార్యాలయం వద్ద ఎఐటియుసి పతాకాన్ని బండారు శ్రీనివాసరావు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు కె. సత్యనారాయణ,తాజుద్దీన్,చేనేత కార్మిక సంఘం నాయకులు కె. పార్ధసారథి,ఎఐవైఎఫ్ నాయకులు వి. శ్రీనివాసరావు, ఓబులశెట్టి రమేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామ కళ్యాణ వేదిక ప్రారంభం

రేపల్లె, అక్టోబరు 31, ప్రభాతవార్త: అద్దేపల్లిలోని శ్రీ రామ నామ క్షేత్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామ కళ్యాణ వేదికను పెదముత్తేవి గౌరవ కృష్ణ ప్రారంభించారు. హోమాలు,పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హరే రామ హరే రామ హరే కృష్ణ హరే కృష్ణ అంటూ హరినామ సంకీర్తనలను మార్కండేయ భజన సమాజం, శ్రీ సాయి భక్త భజ నసమాజం వారు ఆలపించారు. అన్న సమారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో కె. భాస్కరరావు,సూర్యకుమారి,కె. సత్యసాయి,ఝాన్సీ వాణి,దొక్కు సుబ్బారావు,నాంచారమ్మ,పాలకుర్తి రామకృష్ణ,రాము,నిర్మల,కూరపాటి సుధాకర్ శాస్త్రి,కౌతా సత్య వెంకట నాగరాజు, రామనామ క్షేత్రం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఏఐటియుసి ఆవిర్భావ దినోత్సవం

రేపల్లె, అక్టోబరు 31, ప్రభాతవార్త:ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయుసి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని పురపాలక సం ఘ కార్యాలయం ఎదుట ఏఐటీయుసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. రేపల్లె మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు ఏఐటీయుసి జండా ఎగరవేశారు. బాపట్ల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పడమటి బిక్షాలు, ఏఐటీయుసి కన్వీనర్ సింగం వాణిశ్రీ, ఏఐటీయుసి గౌరవాధ్యక్షుడు కన్నెగంటి రమేష్, ఏఐటియుసి నియోజకవర్గ నాయకులు కోన శ్రీనివాసరావు, ఆవుల సాంబశివరావు, నాంచారయ్యలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, వై వేణు, జి.శివ పార్వతి, శివరామకృష్ణ, శాంత కుమారి, పి.కోటయ్య,శ్యామల,పోతురాజు, వెంకటరమణ, సుజాత, అర్జున్ రావు, శ్రీనివాసరావు, శంకర్, ముత్యాల లక్ష్మణరావు,వెంకన్న,నాగరాజు, శీలం కోటయ్య,మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

## బియ్యం, పంచదార పంపిణీ



రేపల్లె,అక్టోబరు 31, ప్రభాతవార్త: కృష్ణా నదీ వరదను దృష్టిలో ఉంచుకుని పెనుమూడి పునరావాస కేంద్రంలో పల్లెపాలెం బాధితులకు శుక్రవారం ఉదయం అల్పాహారం,మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. పునరావాస కేంద్రాన్ని రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, తహశీల్దార్ శ్రీనివాసరావు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ పరిశీలించారు. పునరావాస కేంద్రంలోని మత్స్యకారుల కుటుంబాలకు బియ్యం,పంచదార పంపిణీ చేశారు.

## ఉక్కుమహిళ ఇందిరాగాంధీ

తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్ 31 (ప్రభాతవార్త):భారతదేశాన్ని ఆర్థికంగా, రాజకీయంగా,సాంస్కృతికంగా, సాంకేతికంగా,సైనికంగా, స్వయం సమృద్ధిగా, స్వతంత్రంగా,నిలిపి ఉండేందుకు కృషి చేసిన శ్రీమతి ఇందిరాగాంధీ ఉక్కు మహిళగా దేశ ప్రజల అభిమానాన్ని చూడగొన్నారని తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ చందు సాంబశివుడు పేర్కొన్నారు. మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ



మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ 41వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని చిట్టి ఆంజనేయస్వామి గుడి వద్ద గల ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ చందు సాంబశివుడు మాట్లాడుతూ, 1966 లో ఇందిరా గాంధీ ప్రధానమంత్రి అయ్యేనాటికి దేశంలో ఆర్థిక మాంద్యం, పారిశ్రామిక ఉత్పత్తుల పతనం, ఎగుమతులు తగ్గడం, ఆహార ధాన్యాల సంక్షోభం,ఏర్పడగా వీటితో పాటుగా బడ్జెట్ పెరగడం పెరగడం,విదేశీ ఆర్థిక సాయం పై ఎక్కువగా ఆధారపడడం లాంటివి కాకుండా 1962 1965 నాటి యుద్ధాలు వలన సైన్యంపై ఖర్చు పెరగటం, వర్షాలు లేక కరువు ఏర్పడి ధరలు పెరగడం లాంటి సమస్యలను తన ప్రతిభతో ఎదుర్కొన్న ధీరమహిళ అని ఆయన పేర్కొన్నారు. ధారా రామకృష్ణ మాట్లాడుతూ,అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అమలుపరిచి అందరికీ సమాన అవకాశాలు కల్పించడంలో ఇందిరాగాంధీ ఎంతో పేరు గడిచారని, అందుచేతనే ఇందిరాగాంధీ మరణించినప్పుడు, దేశవ్యాప్తంగా బడుగు బలహీన వర్గాలు మైనారిటీ ప్రజలంతా తమ అమ్మను కోల్పోయినట్లుగా బాధపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొన్నూరు నాగ సూర్య శశిధర్ రావు బుల్లయ్య మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల కోసం ఏఐటియుసి నిరంతర కృషి

తెనాలి టౌన్ అక్టోబర్ 31 (ప్రభాతవార్త): ఏఐటీయూసీ 106 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా,చెంచుపేట లోని తెనాలి డివిజన్ విద్యుత్ కార్యాలయం వద్దపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్ గురుబ్రహ్మం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, భారతదేశానికి స్వాతంత్రం రాక మునుపు స్థానికంగా విడివిడిగా ఉన్న కార్మిక సంఘాలన్నింటినీ కలిపి అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఏఐటియుసి గా ముంబై నగరంలో ఆవిర్భవించింది అన్నారు. స్వాతంత్రంకోసం,కార్మిక హక్కుల కోసం పోరాటాన్ని



నడిపిందని,స్వాతంత్రం అనంతరం కార్మికుల పనిగంటలు,పనిదినాలు , హక్కులు సంక్షేమం భద్రత కోసం అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. సీనియర్ సీనియర్ బొల్లిమంత కృష్ణ మాట్లాడుతూ,ఏఐటీయూసీ గత 105 సంవత్సరాలుగా కార్మికుల ఉద్యోగుల హక్కుల కోసం సంక్షేమం కోసం భద్రత కోసం అలుపెరుగని పోరాటం చేస్తుందని అదే స్ఫూర్తితో కార్మికుల హక్కుల కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ తెనాలి నియోజవర్గ ఇన్చార్జ్ చెరుకుమల్లి సింగారావు ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ తెనాలి డివిజన్ అధ్యక్షులు మునిపల్లి శ్రీకాంత్, కార్యదర్శి కే.ప్రవీణ్, జాయింట్ సెక్రటరీ కే.సత్య శివరాం యూనియన్ నాయకులు , నాగరాజు, నాగేశ్వరరావు, ఎలీషా, వెంకటేశ్వరావు, గోపి, మనోజ్ , ఏఐఎస్ఎఫ్ నాయకులు పాశం వెంకటేష్, మద్దినేని కిరణ్ పాల్గొన్నారు.

## వీధికుక్కల సమస్యపై అసహనం వ్యక్తంచేసిన కౌన్సిల్

తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్ 31 (ప్రభాతవార్త): వీధి కుక్కల సమస్యపై మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం సభ్యుల వాదోపవాదాలతో దద్దరిల్లిపోయింది. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక ఆధ్వర్యంలో నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం లో పట్టణంలో వీధి కుక్కల సమస్య తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో దీనిపై శాశ్వత పరిష్కారం కోసం కమిటీ వేయాలని కౌన్సిల్ సమావేశంలో నిర్ణయించారు. దీనిపై 19వ వార్డు కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి మాట్లాడుతూ వీధి కుక్కలకు శాస్త్ర చికిత్సలు చేయించినంతమాత్రాన అవి దాడి చేయకుండా



ఉంటాయా అని ప్రశ్నించారు. వీధి కుక్కల సమస్యపై సభ్యులందరితో మాట్లాడి కమిటీ వేసి చర్చించి సమస్యకు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. రోజులు గడుస్తున్నప్పటికీ వార్డుల్లో సమస్యలు పరిష్కారం అవ్వక,అభివృద్ధి పనులు చేయటం లేదని ప్రజలు తమను నిలదీస్తున్నారని కౌన్సిలర్లు అన్నాభత్తుని పద్మజ,అత్తోట నాగవేణి,ఆవుల కోటయ్య, జి.మానసారెడ్డి,కే.జయపాల్ వాపోయారు. అలాగే కౌన్సిల్ హాల్ లో తరచుగా ఇతర సమావేశాలు నిర్వహించడం పై 25 వ వార్డు కౌన్సిలర్ తాడిపోయిన రామయ్య అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం 27 వ వార్డు కౌన్సిలర్ బోయపాటి అరుణ మాట్లాడుతూ తుఫాను బాధితుల పునరావాస కేంద్రాల విషయంలో అధికారులు కౌన్సిలర్లకి సమాచారం ఇవ్వకపోవడంపై మొదలైన చర్చ తీవ్రవాదోపవాదాలకి దారితీసింది. దీంతో చైర్మన్ తాడుపోయిన రాధిక సభ్యురాలు బోయపాటి అరుణ మధ్య మాటల యుద్ధం జరిగింది. కౌన్సిలర్ అరుణ కోపంతో ఎజెండా పేపర్స్ ని చింపేసి మాట్లాడటంతో చైర్ పర్సన్ అసహనం వ్యక్తం చేశారు. సభ మర్యాదలు పాటించకపోతే సభ నుండి సస్పెండ్ చేయడానికి వెనుకాడబోనని చైర్మన్ రాధిక హెచ్చరించారు. అనంతరం అజెండాలోని అంశాలను ఆమోదించి, సభను వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ తాడిబోయిన రాధిక ప్రకటించారు.

## పట్టణంలో ఉత్సాహంగా"ఏక్ థా దివస్"ర్యాలీ

తెనాలి టౌన్ అక్టోబర్ 31 (ప్రభాతవార్త): పట్టణంలో శుక్రవారం సబ్ డివిజన్ పోలీస్ వారి ఆధ్వర్యంలో "ఏక్ థా దివస్" ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని చెంచుపేటలో గల ఉమేష్ చంద్ర విగ్రహం వద్ద నుండి మార్కెట్ సెంటర్ వరకు నిర్వహించిన ఈ సమైక్యతా ర్యాలీని,సబ్ డివిజన్ పోలీస్ అధికారి బి.జనార్ధన్ రావు ప్రారంభించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులతో కలిసి విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ అనంతరం డిఎస్పి జనార్ధనరావు మాట్లాడుతూ,స్వతంత్ర భారత తొలి ఉప ప్రధానమంత్రి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ప్రతియేటా అక్టోబర్ 31న జాతీయ సమైక్యత దినోత్సవం జరుపుకుంటున్నామని,డిఎస్పి జనార్ధనరావు వివరించారు. అంతేకాకుండా దేశఐక్యతా ప్రస్థానంలో దేశప్రజలందరూ భాగమని,దీనిని ప్రతి భారతీయుడు భావించేలా చూడడమే ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కి మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో, పట్టణ సీఐలు బి.మల్లికార్జున రావు, కే.బాలాజీ నాయక్,ఎస్ సాంబశివరావు,ఇతర ఎస్సైలు పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా వార్త



## పొంగిపొర్లుతున్న వాగులు ,కాలువలు సజావుగానీటి ప్రవాహం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి

బాపట్ల,అక్టోబర్31,ప్రభాతవార్త: తుఫాను ప్రభావం వల్ల పొంగిపొర్లుతున్న వాగులు ,కాలువలు సజావుగానీటి ప్రవాహం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అర్. టి.జి.ఎస్. మరియు ఐ.టి కార్యదర్శి కాటంనేని భాస్కర్ కోస్తా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం స్థానిక అమరావతి



సచివాలయం నుండి కోస్తా జిల్లాల కలెక్టర్లతో తుఫాను ప్రభావం వల్ల కాలువల పర్యవేక్షణ, మరమ్మత్తులు, ముంపుప్రాంతాల్లో నీటిని తొలగించ డానికితీసుకోవలసిన చర్యల పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించారు. ఈ సందర్భంగా బాస్కర్ మాట్లాడుతూ తుఫాను ప్రభావం వలన కోస్తా జిల్లాలలో పొంగిపొర్లుతున్న కాలువలు, వాగుల మరమ్మత్తులు చేపట్టాలని కలెక్టర్లకు చెప్పారు. కోస్తా జిల్లాలలో పొంగిపొర్లు తున్న కాలువలు, వాగులను డ్రోన్ ల ద్వారా పరివేక్షించాలన్నారు.. కోస్తా జిల్లాలలో తుఫాను ప్రభావం వలన నష్టపోయిన బాధితులకు పరిహారం అందించి నివేదికలను వెంటనే పంపించాలన్నారు. బాపట్ల నుండి వీడియో కాన్ఫరెన్స్లోకి పాల్గొన్న జిల్లా కలెక్టర్ వి. వినోద్ కుమార్ మాట్లాడుతూజిల్లాలో రాబోయే 48 గంటల్లో పొంగిపొర్లుతున్న వాగులు, కాలువల నీటి ప్రభావం సాధారణ స్థితికి వస్తుందన్నారు. పర్చూరు వాగుకు సంబంధించి కానుటూర్ మ్యాప్ ను ఇప్పించవల సిందిగా కలెక్టర్ కోరారు. జిల్లాలో తుఫాను ప్రభావం వల్ల నష్టపో యిన బాధిత లకు నష్టపరిహారం అందించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. బాపట్లజిల్లా నుండి జిల్లా కలెక్టర్ తో పాటు వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్ వ్యవసాయశాఖ ఏ.డి అన్నపూర్ణ తదిత రులు పాల్గొ న్నారు.

## ప్రభుత్వ ఆలోచనలకు తగినట్టుగా ఉద్యోగులు బాధ్యతతో విధులు నిర్వహించాలి

బాపట్ల,అక్టోబర్31,ప్రభాతవార్త: ప్రభుత్వ ఆలోచనలకు తగినట్టుగా ఉద్యోగులు బాధ్యతతో విధులు నిర్వహించాలని సమాచార మరియు పౌర సంబంధాల శాఖ, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు టి.కస్తూరి బాయ్ తెలిపారు. జిల్లా సమాచార మరియు పౌర సంబంధాల శాఖ అధికారి కార్యాలయాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో ఉద్యోగుల హాజరు పట్టిక, పలు



దస్త్రాలను ఆమె పరిశీలించి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ప్రభుత్వం ఆశించిన విదంగా అందరూ విదులు నిర్వహించాలన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ ప్రతిష్టను మరింత ఇనుమడింప చేయాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలన్నారు. జిల్లా పరిపాలన వ్యవస్థకు అనుబంధంగా పని చేయాల్సిన బాధ్యత సమాచారం శాఖపై ఉందన్నారు. సిబ్బంది అందరూ కార్యాలయపు సమయాపాలనను తప్పక పాటించాలన్నారు. కార్యాలమానికి వచ్చే ఉత్తర ప్రత్యుత్తరముల సమాచారం సకాలంలో అందించాలన్నారు. ప్రభుత్వ కార్యకలాపాలకు ఎటువంటి అంతరాయం కలగకుండా సిబ్బంది పని చేయాలన్నారు. సిబ్బంది అందరూ అధికారి సూచనల మేరకు సంతోషకరమైన వాతావరణంలో పని చేసి, వారి నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార మరియు పౌర సంబంధాల అధికారి పి వెంకట్రమణ, జిల్లా పౌర సంబంధాల అధికారి టి మోహన్ రాజు, సహాయ కార్యనిర్వాహక సమాచార ఇంజనీరు షేక్ మస్తాన్ మరియు సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

## దేశ సేవ నుంచి ప్రజా సేవలోకి విశ్రాంత సైనికుడు..

కర్లపాలెం,అక్టోబర్31,ప్రభాతవార్త: ఇంతకాలం భారత్ మాత సేవలో తరించిన ఓ విశ్రాంత సైనికుడు.. ఇప్పుడు ఏకంగా ప్రజాసేవకు సిద్ధమయ్యారు! ఊహించని విధంగా రాజకీయాల్లోకి అడుగుపెడుతున్నట్లు ప్రకటించి, పిట్టు ధనుంజయ రెడ్డి అనే ఈ మాజీ సైనికుడు ఒక్కసారిగా స్థానిక



రాజకీయాల్లో సంచలనం సృష్టించారు. దేశ రక్షణలో కీలక పాత్ర పోషించిన తాను, ఇప్పుడు రాజకీయాల ద్వారా ప్రజల మధ్య పనిచేయాలని సంకల్పించారు. తొలి అడుగులోనే ఆయన మాజీ డిప్యూటీ స్పీకర్, బాపట్ల వైసిపి ఇన్చార్జ్ కోన రఘుపతి ని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల బోకేను అందించారు.. ప్రజాసేవ చేయాలనే తన దృఢ సంకల్పాన్ని రఘుపతి కి వివరించారు. కర్లపాలెం రాజకీయం జోరు: అసలు ఎవరూ ఊహించని విధంగా ధనుంజయ రెడ్డి రాజకీయ రంగ ప్రవేశం చేయడంతో.. ముఖ్యంగా కర్లపాలెం పంచాయతీ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది! ఆయన రాకతో కర్లపాలెం పాలిటిక్స్ ఒక్కసారిగా జోరందుకున్నాయనడంలో సందేహం లేదు. సైనికుడి మాదిరిగా క్రమశిక్షణతో, ధైర్యంతో ధనుంజయ రెడ్డి ఏ విధంగా ముందుకు సాగుతారు, ఎలాంటి రాజకీయాలకు తెరలేపుతారు అనేదానిపై ఉత్కంఠ నెలకొంది. రాజకీయాల్లో ఎలా ముందుకు వెళ్లాలి అనే కార్యాచరణను కూలంకుషంగా త్వరలోనే వెల్లడిస్తానని ధనుంజయ రెడ్డి ఈ సందర్భంగా తెలియజేశారు. మొత్తానికి, ఆయన రాకతో స్థానికంగా నూతనోత్తేజం నెలకొంది.

## బుజ్జి అకాల మరణం బాధాకరం

కర్లపాలెం,అక్టోబర్31,ప్రభాతవార్త: మండల పరిధిలోని యాజలి గ్రామంలో ఆకస్మికంగా మృతి చెందిన నాలుగో వార్డ్ మెంబర్ కట్టుపల్లి ఏసుమణిమ అత్త కట్టుపల్లి బుజ్జి మృతదేహానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పేరాల వెంకట సురేష గురువారం నివాళులర్పించారు. బుజ్జమ్మ మృతికి గల



కారణాలను ఆమె కుమారుడు సుబ్బారావును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక మంచి కార్యకర్తను కోల్పోయింది అన్నారు. నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోన రఘుపతి బుజ్జమ్మ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసినట్లు తెలిపారు. అనంతరం మృతురాలి కుమారుడు సుబ్బారావుకు 5000 రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. వారి కుటుంబానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొంతు కోలు ఏ బాబు, ఏపూరి ఏసుబాబు, బంగారయ్య, మాజీ సర్పంచ్ ఏపూరి పురుషోత్తం. గాలిమార్క్ .ఇసాక్ .బొలిమేర శశి. మద్దాల జాన్. గాలి గాబ్రియల్ తదితరులు పాల్గొన్నారు.

## దళితుల ఐక్యతపై ఎస్సీ వర్గీకరణ రాజకీయ కుట్ర

బాపట్ల,అక్టోబర్31,ప్రభాతవార్త: ఎస్సీ వర్గీకరణ పేరుతో కేంద్రంలో బీజేపి ,రాష్ట్రంలో కాంగ్రెస్,టిడిపిలు దళితుల ఐక్యతను దెబ్బతీసెందుకు దేశవ్యాప్తంగా అతిపెద్ద కుట్రకు పాల్పడుతున్నారని మాల మహానాడు అండ్ రాక్స్ నేషనల్ ప్రసిడెంట్ డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ అగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని లాడ్జీలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ



సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ తక్షణమే రద్దు చేయాలన్నారు. ఈ మేరకు తెలుగు రాష్ట్రాల మాల సమాజిక వర్గ ప్రతినిధులు శాంతియుత పోరాటానికి సిద్దం కావాలన్నారు. ఈ కుట్రకు కాంగ్రెస్ పార్టీ పంజాబ్,హార్యానాలో బీజం వేయగా ప్రధాని నరేంద్ర మోడీ దానిని దేశవ్యాప్తం చేశారన్నారు. ఈ దేశ సంపద ముఖ్యమంత్రి పదవులు,దేవ పరిశ్రములు,జడ్జీల నియామకాల్లో దళితులకు వాటా అక్కర్లేదా దీనికి పాలకులు సమాదానం చెప్పాలన్నారు. ఎస్సీ వర్గీకరణ వలన వందల్లో కేవలం నలుగురికి మాత్రమే ఉపయోగం జరుగుతున్నప్పుడు ఆ ఫలాలను దేశ వ్యాప్తంగా ఎస్సీ జాబితాలోని 1108 కులాలలకు మోడి ప్రభుత్వం ఎలా పంచుతుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని 59 ఎస్సీ కులాలకు చంద్రబాబు,రేవంత్‌రెడ్డిలు ఈ నాల్గు సీట్లను ఎవిదంగా పంచుతారన్నారు. ఇది దళితుల ఐక్యతకు కుట్ర కాదా అని మండి పడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మాల సామాజిక వర్గం పై పగ తీర్చుకుంటే ,తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాలల పై తనకున్న ఈర్షా ద్వేషాలను చేసి చూపారన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టాలు అయిపోయాయని అనుకోవద్దని ప్రజలు తల్చుకుంటే ప్రజా స్వామ్యంలో ఏ చట్టాలనైనా వెనక్కి తీసుకోవాల్సిందేనన్నారు. తెలుగు రాష్ట్రాలలో అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని అణిచివేస్తుంటే మాల ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం అన్యాయం అన్నారు. రిజర్వేషన్‌లు పొందిన ఉద్యోగులు కూడా మాల జాతీని తొక్కేస్తున్నారని ఆయన అవేధ వ్యక్తం చేశారు. తక్షణమే శాంతియుత పోరాటానికి సిద్దం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడికొండ సుబ్బయ్య,తానికొండ అనంద్‌బాబు,చింత సురేష్‌బాబు,బండికళ్ళ రవిబాబు,ప్రభంజన్,సక్కి సంజయ్,బల్లెం లక్ష్మణ్,కనపర్తి రాజారావు,నెల్లి సూరిబాబు,కె.నాని తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్ 31 (ప్రభాతవార్త): పట్టణంలోని 7,8 డివిజన్లలో పారిశుధ్య నిర్వహణ గురించి తెలుసుకోవడానికి మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున పారిశుద్ధ్య కార్మికుల తో ప్రత్యేకంగా



సమాస సమావేశమైన ఆయన కార్మికులకు పలు సూచనలు చేశారు. ఇటీవల వచ్చిన వర్షాలవల్ల,పల్లపు ప్రాంతాలలో ఎక్కడ కూడా వాననీరు నిల్వ లేకుండా చూడాలని,మురుగు కాలువల్లో బ్లీచింగ్ చల్లాలని, అలాగే ఖాళీ స్థలాల్లో నీటిని తొలగించి దోమలు వ్యాపించకుండా ఆయిల్ బాల్స్ వేయాలని,మురుగు కాలువల్లో దోమల మందు చల్లాలని సిబ్బందికి ఆదేశించారు. అలాగే పారిశుద్ధ్య కార్మికుల హాజరును పరిశీలించారు.

## గ్రామీణరోడ్లకు మహర్దశ: ఎండిఓ అత్తోట దీప్తి

తెనాలి టౌన్ అక్టోబర్ 31 (ప్రభాతవార్త): 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టనున్నట్లు, మండల అభివృద్ధి అధికారిణి అత్తోట దీప్తి తెలిపారు. శుక్రవారం రూరల్ మండల గ్రామాలైన సోమ సుందర పాలెం కంచర్లపాలెం గుడివాడ గ్రామాల యందు,వర్షాలకు దెబ్బతిని పాడైపోయిన రోడ్లను ఆమె



పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ,15వ ఆర్థిక సంఘం నిధులను ఉపయోగించుకొని గ్రామీణ రోడ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## లంక గ్రామాలను పరిశీలించిన ఎంపీ తెన్నేటి

కొల్లూరు, అక్టోబరు 31 (ప్రభాతవార్త) : మండలంలోని తుఫాన్ వల్ల పంట దెబ్బతిన్న గ్రామాలను శుక్రవారం బాపట్ల ఎంపి సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్ పర్యటించారు. అనంతరం కొల్లూరులో



మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సంబంధిత శాఖ అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఎంత పంట నష్టం జరిగిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అగ్రికల్చర్ 7700ఎకరాలు ఆర్టికల్చర్ 2000ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు ఆయనకు వివరించడం జరిగింది. వెంటనే దెబ్బతిన్న పంట పొలాలను నమోదు చేసి ప్రభుత్వం నుండి నష్టపరిహారం రైతులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, కొల్లూరు మండల తహశీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కె.నరసింహారావు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, అక్టోబరు 31 (ప్రభాతవార్త) : మండలంలో శుక్రవారం తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా పంటలు దెబ్బతిన్న లంక గ్రామాలైన చింతలంక, పెదలంక, ఈపూరులంక, సుగ్గున లంక, గాజుల్లంక, తదితర గ్రామాల్లో వేమూరు నియోజకవర్గ శాసన సభ్యులు నక్కా ఆనందబాబు పర్యటించి రైతులను పరామర్శించి పంట నష్టాన్ని ప్రత్యక్షంగా



పరిశీలించడం జరిగింది. ప్రభుత్వం ద్వారా తగిన నష్టపరిహారం అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొల్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూధన్‌ప్రసాద్, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలి



కొల్లిపర,అక్టోబరు 31 ప్రభాతవార్త: తుఫాన్ కారణంగా రైతులకు అపారమైన నష్టం జరిగిందని నష్టపోయిన పంటలకు అంచనాలు తయారు చేసి తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివసాంబిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దావులూరుపాలెం,కొల్లిపర,తూములూరు,హనుమాన్‌పాలెం గ్రామాల్లో ఈదురుగాలులకు విరిగి పోయిన అరటి..కంద..కూరగాయల పంటలను రైతు సంఘం నాయకులతో కలసి పరిశీలించి పంట నష్టం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ మండలంలో 500 ఎకరాలలో అరటి పంట దెబ్బతిందని ప్రతి రైతుకు ఎకరానికి రూ.50 నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసారు. పంటలను పరిశీలించిన వారిలో రైతు సంఘ నాయకులు జిలుగు ముక్కంటి,బట్టా రామారావు,కేదార్నాద్ శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

## నదికి నీరొస్తుంది..లంకవాసులు అప్రమత్తంగా ఉండాలి



కొల్లిపర,అక్టోబరు 31 ప్రభాతవార్త: ఎగువన కురుస్తున్న వర్షాలకు నదికి మరలా వరద ఉధృతి పెరిగి ప్రకాశం బ్యారేజీ నుండి 4 లక్షల 56 వేల 400 క్యూసెక్కులు పైగా నీటిని కృష్ణానది దిగువకు విడుదల చేయటంతో వరద ఉధృతి కొనసాగుతోంది. కొల్లిపర తహశీల్ధార్ గుమ్మడి సిద్ధార్థ మండలంలోని వల్లభాపురం,మున్నంగి,పిడపర్తిపాలెం,కొల్లిపర,బొమ్మువానిపాలెం,అన్నవరం గ్రామాల రేవులను సందర్శించి వరద ఉధృతిని పరిశీలించారు. కృష్ణానదీ పరివాహక ప్రాంతాల ప్రజలు..లంకవాసులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేసారు. పడవ నడిపే జాలర్లు తగిన జాగ్రత్తగా ఉండాలన్నారు. తహశీల్ధార్ వెంట డిప్యూటి తహశీల్ధార్ రాజేష్,ఆర్ఐ వంశీకృష్ణ,విఆర్ఓలు రామారావు,భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేయడం ప్రతి పౌరుడి బాధ్యత

బాపట్ల,అక్టోబర్31,ప్రభాతవార్త: సమాజ సేవలో పోలీసులు ముందుండాలనే నినాదంతో బాపట్ల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపు సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ



బి ఉమామహేశ్వర్ ఐపీఎస్ ముఖ్య అతిథిగా పాల్గొని, శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రక్తదానం చేయడం ప్రతి ఒక్క పౌరుడి బాధ్యతఖి అని ఎస్పీ ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. "రక్త దానం చెయ్యండి, చేపించండి, ప్రాణాపాయ స్థితిలో వున్నవారికి ప్రాణం పొయ్యండి" అంటూ జిల్లా ప్రజలకు, యువతకు పిలుపునిచ్చారు. బాపట్ల పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న సూర్య కాళి ఫంక్షన్ హాల్ నందు ఈ రక్తదాన శిబిరం జరిగింది. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు స్థానిక ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. రక్తదాతలతో ప్రత్యేకంగా మాట్లాడిన ఎస్పీ, దానం చేసే ప్రతి ఒక్క "రక్తపు బిందువు" మరొకరికి ప్రాణం పోసే "అమృత బింధువు" అవుతుందని పేర్కొన్నారు. సమాజం కోసం ముందుకు వచ్చిన పోలీసు అధికారులను, సిబ్బందిని, ప్రజలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. వారికి స్వయంగా పళ్ళ రసం, పళ్ళు అందజేశారు. అమరవీరుల త్యాగాలు స్మరణీయమని అక్టోబర్ 21 నుండి 31 వరకు నిర్వహించిన అమర వీరుల సంస్మరణ వారోత్సవాలలో పలు కార్యక్రమాలను నిర్వహించామన్నారు. దీనిలో బాగంగా చివరి రోజున రక్తదాన శిభిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పౌరుడు రక్తదానం చేయడం బాధ్యతగా బావించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ డిహెచ్ఎంఓ వి.సోమ్లనాయక్,డిఎస్పీ జి.రామాంజనేయులు, ఏఆర్ డిఎస్పీ పి.విజయసారథీ,ఎస్బీ ఇన్స్పెక్టర్ జి.నారాయణ,పట్టణ సిఐ రాంబాబు,వేల్ఫేర్ ఆర్ఐ శ్రీకాంత్,తదితరులు పల్గొన్నారు.

## అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూనినాదాలతో మార్మోగిన పట్టణ వీదులు



బాపట్ల,అక్టోబర్31,ప్రభాతవార్త: పోలీస్ అమరుల కుటుంబాలకి మేము ఎప్పుడు అండగా ఉన్నామనే భరోసాను వారిలో కల్పించడానికి ప్రతి ఏడాది పోలీస్ వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బాపట్ల పట్టణంలో పోలీస్ అమరుల సంస్కరణార్థం పోలీస్ అధికారులు, సిబ్బంది పట్టణ ప్రజలు విద్యార్థులతోశుక్రవారం "క్యాండిల్ ర్యాలీ" నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్పీ గారు జెండా ఊపి ర్యాలీని పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద ప్రారంభించి స్వయంగా పాల్గొన్నారు. బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్ నుండి గడియార స్తంభం సెంటర్ వరకు అమరవీరులకు జోహార్లు పలుకుతూ ర్యాలీ నిర్వహించారు.


## ఒరిజినల్ డాక్యుమెంట్లు పోయినవి

పెదకూరపాడు మండలం తమ్మవరం గ్రామానికి చెందిన షేక్ సైదాసాహెబ్ తండ్రి బాదులా సాహెబ్ కు సంబంధించిన సేల్ డిడి 255/1983 డాక్యుమెంట్లు 20/10/25న అమరావతిలోని జిరాక్స్ షాపు నుంచి ఆటో లో తమ్మవరం వస్తున్న సమయంలో జారిపోయినవి. దొరికిన వారు 63052 89451 ఈ నెంబర్‌లో సంప్రదించగలరు.

## పనిచేసే ప్రభుత్వం.. అనుభవజ్ఞుడైన నాయకుడు ఉండబట్టే ప్రాణ, ఆస్తినష్టం తగ్గింది : మాజీమంత్రి ప్రత్తిపాటి

చిలకలూరిపేట, అక్టోబర్ 31, ప్రభాతవార్త: తుపాను విలయంతో ఇళ్లు కోల్పోయిన వారు ఇంటి నిర్మించుకుంటే ప్రభుత్వ సాయం అందేలా చూస్తామని, ఇంటి స్థలాలు కూడా త్వరలోనే ప్రభుత్వం మంజూరు చేస్తుందని, పంట నష్టపోయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పరిహారం అందేలా అధికారులు చొరవచూపాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. గురువారం రాత్రి ఆయన తుపాను వరదతో నీటమునిగి నిరాశ్రయులైన పసుమర్రు ఎస్టీ కాలనీ నిర్వాసితులకు ప్రభుత్వం పంపిణీ చేసిన ఆర్థిక సాయం, బియ్యం, 6 రకాల నిత్యావసరాలు అందించారు. ఇంటిలో ఒక్కరుంటే రూ.1000లు 25 కేజీల బియ్యం... నిత్యావసరాలు.. ఇద్దరుంటే రూ.2,000, బియ్యం, నిత్యావసరాలు.. ముగ్గురు అంతకంటే ఎక్కువ ఉన్నవారికి రూ.4,000 బియ్యం నిత్యావస రాలను 205 మందికి ప్రత్తిపాటి స్వయంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాసితుల్ని ఉద్దేశించి మాట్లాడారు. పసుమర్రు గ్రామస్తులు, అధికారులు సకాలంలో స్పందించి ఎస్టీ కాలనీలో ప్రాణనష్టం జరక్కుండా సకాలంలో స్పందించి ప్రజల్ని కాపాడారని ప్రత్తిపాటి చెప్పారు. పనిచేసే ప్రభుత్వం ఉంటే ప్రజలకు, రాష్ట్రానికి ఎలాంటి నష్టం జరగదని మరోసారి కూటమిప్రభుత్వ పనితీరు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం నిరూపించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ మొంథా తుపాను ఏర్పడింది మొదలు ఈ రోజువరకు కూడా నిత్యం రాత్రింబవళ్లు పర్యవేక్షించి, సమర్థతతో రాష్ట్రంలో ఆస్తి.ప్రాణనష్టం లేకుండా చూశారన్నారు. జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, తేళ్ల సుబ్బారావు, ఎమ్మార్వో షేక్ మహమ్మద్ హుస్సేన్, గ్రామ నాయకులు జాలాది సుబ్బారావు, కొడాలి శ్రీనివాసరావు, చైతన్య, గద్దె చౌదరి, కిషోర్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, ఎంపీడీవో, అధికారులు , టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## బ్రదర్ నందమూరి క్రిష్టర్‌కు బిషప్‌గా పదోన్నతి



చిలకలూరిపేట, అక్టోబర్ 31, ప్రభాతవార్త: యేసుక్రీస్తు దివ్య శాంతినిలయం అధినేత, పల్నాడు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బ్రదర్ నందమూరి క్రిష్టర్ కు, ఈ నెల 29 వ తేదీన డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాస్టర్స్ ఫెలోషిప్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం లో బిషప్ గా పదోన్నతి కల్పించారు. గత 25 సం.లుగా క్రైస్తవ సమాజానికి బ్రదర్ నందమూరి క్రిష్టర్ చేస్తున్న సేవలను గుర్తించి బిషప్ గా పదోన్నతి కల్పించామని రాష్ట్ర పాస్టర్ల సంఘం అధ్యక్షుడు బిషప్ డా. ప్రతాప్ సిన్హా కొమానపల్లి మరియు ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ బిషప్ డా.డేనియల్ పాల్ తెలియజేసారు. తనకు పదోన్నతి కల్పించిన జాతీయ, రాష్ట్ర నాయకులకు క్రిష్టర్ ధన్యవాదాలు తెలియజేసారు. మరియు భారతీయ క్రైస్తవ సమాజంలో ఐక్యత, అభివృద్ధి కొరకు మరింత పని చేస్తానని ఈ సందర్భంగా వారు తెలియజేసారు.

## జాతీయ రహదారి విస్తరణకు భూములిచ్చిన రైతులకు నేటికీ పరిహారం ఇవ్వకపోతే వ్యవస్థలపై ప్రజల్లో అపనమ్మకం ఏర్పడదా? : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, అక్టోబర్ 31, ప్రభాతవార్త: ప్రభుత్వాలు తమకు న్యాయం చేస్తాయని నమ్మి అభివృద్ధిపనులకు భూములు, స్థలాలు ఇచ్చే రైతులకు వెంటనే న్యాయం చేయకపోతే పాలనా వ్యవస్థలపై వారికి అపనమ్మకం ఏర్పడదా అని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా జాతీయ రహదారి విస్తరణకు వ్యవసాయ భూములు, ఇళ్లు, స్థలాలు ఇచ్చిన రైతులు ప్రత్తిపాటిని కలిసి తమ సమస్య తెలియచేశారు.





న్యాయంగా రావాల్సిన పరిహారం కోసం ఆందోళనలు, దర్నాలు చేస్తున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదని వాపోయారు. రైతుల సమస్య విన్న ప్రత్తిపాటి వారి సమక్షంలోనే నేరుగా జాయింట్ కలెక్టర్ తో మాట్లాడారు. వెంటనే సమస్యపై దృష్టి పెట్టాలని, రహదారి విస్తరణ పనులు పూర్తయినా నేటికీ వారికి పరిహారం ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విధంగా జాప్యం చేస్తే రైతులు భవిష్యత్ లో ప్రభుత్వాలు చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు ఎలా సహకరిస్తారన్నారు. అలానే ఎండుగుల పాలెం ఎస్టీ కాలనీ వాసులు శ్మశానవాటికకు అవసరమైన భూమిని వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేసి తమకు అప్పగించాలని గతంలో అర్జీ ఇచ్చారని, మరలా నేడు సమస్యను మరోసారి తన దృష్టికి తీసుకొచ్చారని ప్రత్తిపాటి జేసీకి తెలిపారు. రెండు సమస్యల్ని వెంటనే పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలన్న ప్రత్తిపాటి సూచనపై జేసీ సూరజ్ గనోరే స్పందించారు. అర్జీలు పరిశీలించి రెండు సమస్యల్నీ వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని స్పష్టంచేశారు. శ్మశాన వాటిక భూమిని రైతు నుంచి భూసేకరణ పద్ధతిలో తీసుకోవాల్సి ఉన్నందున ఆర్థిక పరమైన అంశమైనందున ప్రభుత్వాన్ని సంప్రదించి నిర్ణయం తీసుకుంటామని జేసీ తెలిపారు. వివిధ సమస్యలపై ప్రజలనుంచి అర్జీలు స్వీకరించిన ప్రత్తిపాటి, వారి సమక్షంలోనే అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కార దిశగా చొరవ చూపారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, టీడీపీ నాయకులు మద్దూరి వీర రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులున్నారు.

## పంటనష్టం అంచానాల్లో అనవసర ప్రచారం వీడి.. రైతుల్ని ఆదుకోవడంపై దృష్టిపెట్టండి : ప్రత్తిపాటి


యడ్లపాడు, అక్టోబర్ 31, ప్రభాతవార్త: పత్తి కొనుగోళ్లకు ఇన్ పుట్ సబ్సిడీ అంచనాలకు ఎలాంటి సంబంధం లేదని, ప్రభుత్వ ఆదేశాలు లేకుండ తోచినట్లు ప్రచారం చేయకండని, క్షేత్రస్థాయిలో పంటనష్టాన్ని పరిశీలించి ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూడండని, వ్యవసాయ అధికారులు సిబ్బందికి మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాలు ఇచ్చారు. యడ్లపాడు, నాదెండ్ల మండలాల్లో మొంథా ధాటికి దెబ్బతిన్న పొలాలను పరిశీలించారు. పంటల భీమా పరిహారం, ఇన్పుట్ సబ్సిడీ వంటివి అందించడంలో ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు పెట్టలేదని, సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ప్రత్తి విక్రయాలకు రైతులకు అందించే పరిహారానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆయన శుక్రవారం యడ్లపాడు, నాదెండ్ల మండలాలలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి జరిగిన నష్టం ఎంత పెట్టుబడి పెట్టారనే వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రైతులు, వ్యవసాయ అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. తిమ్మాపురం, సొలస, జంగాలపల్లి, నాదెండ్ల గ్రామాల్లో పర్యటించిన ఆయన బురద మేటవేసిన ప్రత్తి, మిరప పైర్లను పరిశీలించారు. మొంథా పెనువిపత్తు వ్యవసాయ అధికారులకు, సిబ్బందికి సవాల్ విసిరిందని, ఉరితేత్తే దశలో ఉన్న వివిధ పంటలు తిరిగి బతికించి రైతుకు మేలు చేయడంపై వ్యవసాయ యంత్రాంగం దృష్టి సారించాలని అన్నారు. ..అనవసర ప్రచారం వదిలేసి పంటనష్టం సమగ్ర అంచనాలపై దృష్టి పెట్టి రైతులకు న్యాయం చేయండి : పంటనష్టం అంచనాలో నిబంధనలు పేరిట వ్యవసాయ అధికారులు సిబ్బంది రైతుల్ని ఇబ్బందిపెట్టవద్దని, ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావద్దన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేకుండా అనవసర ప్రచారం చేయవద్దని, క్షేత్రస్థాయి పర్యటనతో నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి పంట నష్టం లెక్కల్ని సమగ్రంగా రూపొందించాలని, ఎక్కడా అలసత్వం ప్రదర్శించిన



ఉపేక్షించేది లేదన్నారు. నియోజకవర్గ రైతాంగం సమస్యలు, మొంథా ప్రభావంతో దెబ్బతిన్న పంటనష్టం లెక్కింపుపై వ్యవసాయ శాఖ జేడీతో ఫోన్లో మాట్లాడారు. ఎన్యూమరేషన్ విధివిధానాలపై సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

**..ఇన్పుట్ సబ్సిడీకి..పత్తి కొనుగోళ్లకు సంబంధం లేదు :** రైతులకు ప్రభుత్వం అందించే ఇన్పుట్ సబ్సిడీకి..పంటల భీమా సాయానికి, సీసీఐ కేంద్రాల ద్వారా జరిపే పత్తి కొనుగోళ్లకు ఎలాంటి సంబంధంలేదని ఆయన తెలిపారు. యడ్లపాడు మండల హార్టీ కల్చర్ అసిస్టెంట్ రైతులకు అనుమానాలు రేకెత్తించిన మీదట ఆయన ఈవిధంగా స్పందించారు. పంట నష్టపోయిన రైతుల్లో ఆందోళన పెంచకుండా వ్యవసాయ అధికారులు, సిబ్బంది, మొంథా నష్టం అంచనాల్ని సమగ్రంగా రూపొందించి ప్రభుత్వానికి సకాలంలో నివేదికలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలు లేకుండా సచివాలయ వ్యవసాయ అధికారులు లేనిపోని అనవసర ప్రచారాలతో రైతుల్ని భయాందోళనలకు గురిచేస్తే జరిగే పరిణామాలకు వారే బాధ్యులవుతారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జ్ తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, టీడీపీ నాయకులు అంబటి సోంబాబు, గుర్రం నాగపూర్ణ చంద్రరావు, మద్దూరి శ్రీనివాసరావు, పిచ్చయ్య, బ్రహ్మయ్య, రాజేష్, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## ప్రజాదర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట, అక్టోబర్ 31 ప్రభాతవార్త : శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తన కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ వార్డులు, మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ముఖ్యంగా ఇళ్ళస్థలాలు, ఇళ్ళు, రేషన్‌కార్డులకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని ఎమ్మెల్యే అరవింద్‌బాబు తెలియజేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కరించాలని ఆదేశాలివ్వడం జరిగిందన్నారు.



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా క్రమం తప్పకుండా ప్రతి వారం నియోజకవర్గ ప్రజల కోసం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ప్రభుత్వ నిధులతో సంబంధం లేనటువంటి అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్‌బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసి సమస్యలను వివరించిన ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట, అక్టోబర్ 31 ప్రభాతవార్త : జిల్లా కలెక్టర్ కృతికాశుక్లాను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు శుక్రవారం కలిసి ప్రజా సమస్యలకు సంబంధించి వినతిపత్రం అందించారు. మండలంలోని కోటప్పకొండ వద్ద గత ముప్పై ఏళ్ళుగా యానాది సామాజిక వర్గానికి చెందిన 150కు పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నట్లు తెలిపారు. వారికి తక్షణమే ఇళ్ళ స్థలాలతో పాటు ఇళ్ళు నిర్మించే అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం ఎల్లప్పుడు ప్రజాపక్షం అన్నారు. పేద ప్రజలకు సంబంధించి సమస్యలు ఏవైనా పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. 150 కుటుంబాలు ప్రభుత్వ పోరంబోకు స్థలాలలో చిన్నచిన్న గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఈ కుటుంబాలు తుఫాన్ కారణంగా గుడిసెలు చల్లాచెదురుకావడంతో నిరాశ్రయులుగా మిగిలారని తెలిపారు. యానాదులకు నివాస స్థలాలు ప్రభుత్వం ఇవ్వవలసి ఉందన్నారు. ఆ కుటుంబాలకు ఖచ్చితంగా న్యాయం చేస్తామని కలెక్టర్ కృతికాశుక్లా ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నాయకులు, బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి ప్రత్యేక పూజలు

నరసరావుపేట, అక్టోబర్ 31 ప్రభాతవార్త : పట్టణంలోని బరంపేటలో వేంచేసియున్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో జిల్లా వైకాపా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 59 సంవత్సరాలుగా ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రత్యేక వార్షికోత్సవ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. కుల,మతాలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలలో నిత్యయజ్ఞయాగాలు, గోపూజ మహోత్సవాలు వారం రోజుల పాటు నిర్వహించడం విశేషమన్నారు. 24 గంటల పాటు రామనామ సంకీర్తన, భజనా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అదే విధంగా నవంబర్ 2వతేదీన మహా అన్నసంతర్పణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులకు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అభినందనలు తెలిపారు.



## పట్టాభిరామస్వామి దేవస్థానంలో హరేరామ - హరేకృష్ణ నామదీక్ష మహోత్సవం

నరసరావుపేట, అక్టోబర్ 31 ప్రభాతవార్త : స్థానిక పట్టాభిరామస్వామి దేవస్థానంలో హరేరామ - హరేకృష్ణ నామదీక్ష మహోత్సవం ఆలయ ధర్మకర్త నాగసరపు సుబ్బరాయగుప్తా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి స్వామివారికి సంకీర్తన కార్యక్రమాలు జరిగాయి. పెద్ద ఎత్తున మహిళలు, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నాగసరపు సుబ్బరాయగుప్తా దంపతులు 29వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి విష్వక్సేన పూజలు నిర్వహించారు. అదే విధంగా మండపారాధన, అఖండ దీపోత్సవం కార్యక్రమాలు జరిగాయి. ఆలయ పూజారి వేదాంత రాంబాబు, పూజారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారికి శనివారం లక్షనామ సహిత తులసి దలార్చన జరుగుతుందన్నారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.




## విపత్తుల నుండి సిఎం చంద్రబాబు కాపాడారు : కొమ్మాలపాటి



నరసరావుపేట, అక్టోబర్ 31 ప్రభాతవార్త : రాష్ట్రంలో ప్రజలను విపత్తుల నుండి సిఎం చంద్రబాబు కాపాడారని టిడిపి జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు ముందస్తుగానే తుఫాన్ తీవ్రతను అంచనా వేశారన్నారు. అందుకు తగిన విధంగా అధికార యంత్రాంగాన్ని సిద్ధం చేసి ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు తుఫాన్ తీవ్రతను గమనిస్తూ పక్కా ప్రణాళికతో, తన అపారమైన అనుభవంతో జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. అనేక వేల సంఖ్యలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలను తరలించారని తెలిపారు. జిల్లా అధికారులతో పాటు ఎమ్మెల్యేలు, మంత్రులకు తుఫాన్‌కు సంబంధించి సూచనలు చేయడం జరిగిందన్నారు. తుఫాన్ వలన నష్టపోయిన వారికి తక్షణమే బియ్యం, నిత్యావసర సరుకులను ప్రజా ప్రతినిధుల ద్వారా అందించారని తెలిపారు. అదే విధంగా కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉందన్నారు. వరి రైతులకు వైకాపా గతంలో మద్దతు ధర ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ధాన్యం అమ్మిన తర్వాత 48 గంటల్లోనే రైతుల ఖాతాలలో డబ్బులు జమ అవుతున్నాయని తెలిపారు. డ్రిప్ సబ్సిడీని పూర్తిగా గతంలో నిలిపివేశారన్నారు. ఖరీఫ్, రబీ సీజన్‌లలో కూటమి ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు, యూరియా వంటివి సకాలంలో అందజేశామని తెలిపారు.

## మొంథా తుపాను కలిగించిన నష్టంపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలి

వెల్దుర్తి, అక్టోబరు 31 ప్రభాతవార్త: మొంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన బాధితులను ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆదుకోవాలని వైసీపీ నాయకులు దేవినేని శ్రీనివాసరెడ్డి, బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి అన్నారు. వైసీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెలిన్ల రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు వెల్దుర్తి మండలంలోని చెంచుకాలనీలో తుపానుతో నష్టపోయిన చెంచుకాలనీలో నీట మునిగిన ఇళ్లను పరిశీలించి వారికి నిత్యావసర సరకులు అందించారు. ఈ కార్యక్రమంలో బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పోతిరెడ్డి కోటిరెడ్డి, ఈగల అయ్యన్న, అన్నెం అనంతరావమ్మ, గుంటక కొండారెడ్డి, అంబటి అంకిరెడ్డి, బలిగొడుగుల శ్రీనివాసరావు, మడతల చిన్న గాలిరెడ్డి, కుర్రి శ్రీనివాసరెడ్డి, మడతల వెంకటరెడ్డి, చిర్రా రామాంజిరెడ్డి, మగాలి దాను, కొమ్ము గిరి, పొనుగోటి నాగిరెడ్డి, కేతావత్ రవినాయక్, నాగుల అంజినాయక్, కుక్కమూడి జగన్, కాళంగి అనిల్, వజ్రాల మల్లయ్య, తంగిరాల మేరిబాబు, కొమ్ము అశోక్, కొమ్ము వెంకటేష్, కుక్కమూడి చిన్న యేసయ్య, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.





## పొలంలో నిల్చిన నీటిని తరలించే ప్రక్రియ చేపట్టండి

యడ్లపాడు, అక్టోబర్ 31, ప్రభాతవార్త : మొంథా తుపాన్ కారణంగా పంట పొలంలో నిల్చిన నీటిని ఆన్‌లైన్ గుగూల్ మ్యాప్ ద్వారా సీఎంవో అధికారులు గుర్తించి వెంటనే సంబంధిత జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇవ్వటం జరిగిందని, సంబంధిత కలెక్టర్ అర్‌డివోకు సమాచారం ఇవ్వగా అర్‌డివో స్థానిక తహశీల్దార్‌ను పురమాయించి పొలంలో నిల్చిపోయిన నీటిని మరల్చే ప్రక్రియను చేపట్టారు. మండల పరిధిలోని తుర్లపాడు గ్రామంలో నక్కవాగు ఉధృతికి పొలాలలో నీరు చేరటం జరిగింది. అయితే నీటి నిల్వను ఉన్నతాధికారులు గుర్తించి వెంటనే స్పందించి సంబంధిత అధికారులను పురమాయించి రైతులకు ఇబ్బందులు లేకుండా చేయాలని ఆదేశించటంతో స్థానిక తహశీల్దార్ విజయశ్రీ వెంటనే సిబ్బందితో వెళ్లి అక్కడ పరిస్తితులను గుర్తించి నీటి నిల్వ లేకుండా చర్యలు తీసుకోవటం జరిగింది.



## సర్దార్ వల్లబాయ్‌పటేల్‌కు నివాళులర్పించిన ఎస్పీ

నరసరావుపేట క్రైం, అక్టోబర్ 31 ప్రభాతవార్త : సర్దార్ వల్లబాయ్‌పటేల్‌కు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రత, భద్రత కోసం వల్లబాయ్‌పటేల్ చేసిన కృషిని వివరించారు. దేశ వ్యాప్తంగా ఉన్న 565 సంస్థానాలను దేశంలో విలీనం చేయడం జరిగిందన్నారు. వల్లబాయ్‌పటేల్ సూచించిన ఐక్యత కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ నిర్వహించారు.



**పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో రక్తదాన శిబిరం...** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో రెడ్‌క్రాస్ సహకారంతో జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని డిఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి ప్రారంభించారు. రక్తదానం చేసిన పోలీస్ అధికారులను ఆయన అభినందించారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌తో పాటు రెడ్‌క్రాస్, బ్లడ్‌బ్యాంక్ వైద్యులు, సిబ్బంది సేవలను అభినందించారు.

**క్యాండిల్ ర్యాలీ నిర్వహించిన పోలీస్ అధికారులు...** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో క్యాండిల్ ర్యాలీని జిల్లా పోలీస్ కార్యాలయం నుండి ప్రభుత్వ హాస్పటల్ వరకు నిర్వహించారు. దేశభద్రత, సమాజ రక్షణ కోసం అశువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని డిఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు గోపినాథ్, యువరాజ్, ఆర్.ఐ.కృష్ణ, ఎం.రాజా తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఛాంపియన్‌షిప్ జిల్లా జట్టుకు స్విమ్మర్స్ ఎంపిక

నరసరావుపేట టౌన్, అక్టోబర్ 31 ప్రభాతవార్త : ఎస్ఎస్ఎన్ కళాశాలలోని స్విమ్మింగ్ ఫూల్‌లో స్విమ్మింగ్ సబ్ జూనియర్స్ టీమ్‌కు జిల్లా ఎంపికలు జరుగుతున్నాయని స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి శుక్రవారం తెలియజేశారు. గ్రూప్-4లో 2015-16 సంవత్సరాలలో జన్మించిన వారు, గ్రూప్-5లో 2017-2018 ఏడాదిలో జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఎంపిక చేయబడ్డ జిల్లా జట్టు నవంబర్ 16న విజయవాడలో జరిగే రాష్ట్ర ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. నవంబర్ 1తేదీ నాటికి కళాశాల స్విమ్మింగ్‌ఫూల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా మూడవ శీతాకాల అంతర్‌జిల్లా ఎంపికలను మూడు గ్రూపుల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2009-2010, 2011-12, 2013-14 సంవత్సరాలలో జన్మించిన వారు పోటీలలో పాల్గొనాలన్నారు. ఈ విభాగాలలో ఎంపికైన వారు నవంబర్ 22,23 తేదీలలో విశాఖలో జరిగే ఛాంపియన్‌షిప్‌లో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలియజేశారు. 25 సంవత్సరాల నుండి 80 సంవత్సరాల వరకు వయస్సును బట్టి గ్రూపుల వారీగా నవంబర్ 9న విజయవాడలో జరిగే ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ప్రాతినిధ్యం వహిస్తారని కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి వివరించారు.

## చంద్రబాబు ముందుచూపుతో తుఫాను తీవ్ర నష్టాన్ని నివారించాం: చీఫ్‌విప్ జీ.వీ, డీసీసీబీ ఛైర్మన్ మక్కెన

నూజెండ్ల, అక్టోబర్31, ప్రభాతవార్త: సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు గత ఐదు రోజులుగా తుఫాను పరిస్థితులను ఆర్‌టీజీఎస్ కేంద్రం నుంచి సమీక్షిస్తూ అధికారులను, ప్రజలను అనుక్షణం అప్రమత్తం చేసి తుఫాను వల్ల జరిగే తీ వ్ర నష్టాన్ని నివారించగలిగారని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో వరద బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని డీసీసీబీ ఛైర్మన్



మక్కెనతో కలసి జీ.వీ శుక్రవారం సందర్శించారు. ప్రభుత్వం వరద బాధిత కుటుంబాలకు అందించిన బియ్యం, నిత్యవసర సరుకులు రూ.1000 నుంచి గరిష్టంగా రూ.3000 వరకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ తుఫాను బాధిత కుటుంబాలకు ఎన్డీయే ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తుఫాను కారణంగా నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టులు, విద్యుత్ స్తంభాలు యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించేందుకు అన్ని శాఖల అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశామన్నారు. తుఫాను బాధిత ప్రజలు, రైతులు ధైర్యంగా ఉండాలని జరిగిన నష్టాన్ని ప్రభుత్వం భర్తీ చేస్తుందని చెప్పారు. గత వైకాపా ఐదేళ్ళ పాలనలో విపత్తుల సమయంలో ప్రజలను పట్టించుకోలేదని తీవ్రంగా ఇబ్బందులు పడ్డారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రజల కోసం నిరంతరం పని చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజాదర్బార్: చీఫ్‌విప్ జీ.వీ

వినుకొండ, అక్టోబర్31, ప్రభాతవార్త: ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కొత్తపేట నందు చీఫ్‌విప్ కార్యాలయం నందు నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో జీ.వీ పాల్గొన్నారు. వివిధ సమస్యలపై పట్టణంతోపాటు నియోజకవర్గంలోని గ్రామాలకు చెందిన ప్రజలు అర్జీలను జీ.వీకి అందజేశారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ గత వైకాపా పాలనలో ప్రజలు సమస్యలతో సతమతమయ్యారన్నారు. ప్రజాదర్బార్‌కు వచ్చే ప్రతి అర్జీని అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం లాంటి: చీఫ్‌విప్ జీ.వీ,డీసీసీబీ ఛైర్మన్ మక్కెన

వినుకొండ, అక్టోబర్31, ప్రభాతవార్త: సీఎం రిలీఫ్ ఫండ్ ఆపదలో ఉన్న పేదలకు వరం లాంటిదని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కొత్తపేట నందు గల చీఫ్‌విప్ కార్యాలయం నందు నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులైన 40 మందికి రూ.26.73 లక్షల చెక్కులు జీ.వీ అందజేశారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ పేదలకు సహాయం చేయాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబునాయుడు నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. గత వైకాపా పాలనలో సీఎంఆర్‌ఎఫ్ పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. పేదలకు మంచి చేసే ప్రభుత్వంపై మాజీ సీఎం జగన్‌రెడ్డి తప్పుడు ప్రచారాలు చేయడం తగదన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.







## పటేల్ ఎనలేని సేవలు

వినుకొండ, అక్టోబర్31, ప్రభాతవార్త: భారతదేశ ఉక్కుమనిషి, భారతరత్న సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి పురస్కరించుకొని పట్టణంలోని చీఫ్‌విప్ జీ.వీ కార్యాలయంలో పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీ.వీ, డీసీసీబీ ఛైర మ్రన్ మక్కెన మాట్లాడుతూ పటేల్ ఆశయాలు ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు దేశ ప్రగతికి, అభ్యుదయానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

1-11Pg5 9_1-11Pg5.qxd 31/Oct/25 11:06 PM Page 1



# 3న కోర్టుకు రండి

## వీధికుక్కల కేసులో వివిధ రాష్ట్రాల సిఎస్‌లకు 'సుప్రీం' ఆదేశం

## మినహాయింపు కోరిన బీహార్ సిఎస్‌ను మందలించి ప్రత్యక్షంగా హాజరుకావాలన్న కోర్టు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 31:** వీధి కుక్కల కేసులో రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై శుక్రవారం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు తీర్పును గౌరవించడం లేదంటూ అసహనం వ్యక్తం చేసింది. ఈ కేసులో నవంబర్ 3న కోర్టు ముందు వర్చువల్‌గా హాజరయ్యేందుకు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు అనుమతి కోరగా నిరాకరించింది. అధికారులు కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా నిద్రపోతున్నారు. పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా వారు అఫిడవిట్లు ఎందుకు దాఖలు చేయలేదో వ్యక్తిగతంగా వచ్చి వివరించాలి. కోర్టు సమయం ఇచ్చినా ఎలాంటి చర్యలు లేకపోవడం దురదృష్టకరం అని సుప్రీం ధర్మాసనం తీవ్రంగా మందలించింది. తమ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయని వ్యక్తిగత హాజరుకు మినహాయింపు ఇవ్వాలని బీహార్ ప్రధాన కార్యదర్శి నుంచి వచ్చిన అభ్యర్థనను తోసిపుచ్చింది. రాష్ట్రంలో అంతా ఎన్నికల సంఘం చూసుకుంటుంది. మీరు చింతించకండి. కోర్టుకు రండి అని తేల్చి చెప్పింది. వీధి కుక్కల దాడుల వల్ల ఢిల్లీ, ఎన్సీఆర్ పరిధిలో రేబిస్ మరణాల సంఖ్య పెరుగుతోందని వచ్చిన వార్తలను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం 8 వారాల్లోపు అన్ని వీధి కుక్కలకు షెల్టర్లకు తరలించాలిన ఆగస్టు 11న ఆదేశించింది. దానిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఆ నేపథ్యంలో జస్టిస్ విక్రమనాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజరియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఆ కేసును విచారించింది. ఆ సందర్భంగా రేబిస్ లక్షణాలు లేదా విపరీత ప్రవర్తన కలిగిన కుక్కలు మినహా ఇప్పటివరకు షెల్టర్లకు తరలించిన వాటిని విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసిన తర్వాత వాటిని ఎక్కడి నుంచి తీసుకువచ్చారో అక్కడే విడిచిపెట్టాలని పేర్కొంటూ ఆగస్టు 11న ఇచ్చిన తీర్పును సవరించింది. ఈ క్రమంలోనే ఆ ఆదేశాల అమలుపై తీసుకుంటున్న చర్యలను తెలియచేసేలా అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. అయితే తెలంగాణ, పశ్చిమబెంగాల్, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మాత్రమే వాటిని దాఖలు చేశాయి. అలాగే ఆగస్టులో ఇచ్చిన ఉత్తర్వుల తర్వాత కూడా వీధి కుక్కల దాడులు నమోదవుతుండటాన్ని గత విచారణలో తీవ్రంగా పరిగణించింది. ఆ క్రమంలోనే అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు వ్యక్తిగతంగా న్యాయస్థానం ముందు హాజరుకావాలని ఆదేశించింది. తాజాగా వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరగా ఆ అభ్యర్థనను తోసిపుచ్చింది.



# యువతకు కోటి ఉద్యోగాల కల్పన

## - కోటి మంది లఖ్‌పతి దీదీలు - కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య - బీహార్ ఓటర్లపై ఎన్‌డిఎ హామీల వర్షం

## - 24 హామీలతో మేనిఫెస్టో విడుదల

**పాట్నా, అక్టోబరు 31:** ఎన్‌డిఏ కూటమి మళ్లీ అధికారంలోకి వస్తే యువతకు కోటి ఉద్యోగాలు కల్పిస్తామంటూ 69 పేజీలతో కూడిన మేనిఫెస్టోను శుక్రవారంనాడిక్కడ విడుదల చేసింది. ఇందులో 24 హామీలను పొందుపరిచింది. ఈ మేనిఫెస్టోను 'సంకల్ప పత్ర'గా నామకరణం చేశారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా, సిఎం నితీశ్ కుమార్, కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, జితిన్‌రామ్ మాంజి తదితరుల చేతుల మీదుగా మేనిఫెస్టోను విడుదల చేశారు. రాబోయే ఐదేళ్లలో రాష్ట్ర యువతకు కోటికిపైగా ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చింది. వీటిలో ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ఇతరత్రా ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపింది. నైపుణ్యం ఆధారంగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్రంలో స్కిల్స్ సెన్సస్‌ను నిర్వహిస్తామని పేర్కొంది. ప్రతి జిల్లాలో మెగా స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని వెల్లడించింది. గ్లోబల్ స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌గా బీహార్‌ను మారుస్తామని తెలిపింది. వలస కార్మికులను ఆకట్టుకునేలా రాష్ట్రంలో కోటి ఉద్యోగాల హామీతో పాటు కోటి మంది మహిళలను లక్షాధికారులను (లక్‌పతి దీదీస్) చేయడమే తమ లక్ష్యమని ప్రకటించింది. మహిళలు వ్యాపారాలు ప్రారంభించేందుకు రూ.2 లక్షల వరకు ఆర్థికసాయం చేస్తామని హామీ ఇచ్చింది. ప్రతి జిల్లాలో మెగా లెర్నింగ్ సెంటర్లతో బీహార్‌ను ప్రపంచ అభ్యాస కేంద్రంగా ఏర్పాటు చేస్తామని కూటమి ప్రభుత్వం తన మేనిఫెస్టోలో తెలిపింది. కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తారు. ఉన్నత విద్యను చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు నెలకు రూ.2వేల సాయాన్ని అందిస్తారు. రాష్ట్రంలో ప్రపంచ స్థాయి మెడిసిటీని నిర్మిస్తారు. ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కాలేజీని నిర్మిస్తారు. ఈబీసీలకు రూ.10 లక్షల వరకు ఆర్థిక ప్రోత్సాహకాలు, గిగ్ వర్కర్లు, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం, ప్రతి రైతుకు ఏడాదికి రూ.9 వేల పెట్టుబడి సాయం, బీహార్‌లో ఏడు ఎక్స్‌ప్రెస్‌వేలు, నాలుగు నగరాల్లో (పాట్నా, దర్భంగా, పూర్ణియా, భాగల్పూర్) అంతర్జాతీయ విమానాశ్రయాలు, మెట్రో రైలు సేవల ఏర్పాటు, 3,600 కి.మీ రైలు మార్గాలను ఆధునీకరించడం వంటి హామీలను మేనిఫెస్టోలో పొందుపరిచారు.

రాష్ట్ర ప్రజలకు ఉచిత రేషన్ అందిస్తారు. పేదలకు 50 లక్షలకుపైగా పక్కా ఇళ్లను నిర్మిస్తారు. రాష్ట్ర ప్రజలకు రూ.5 లక్షల దాకా ఉచిత వైద్య చికిత్సల సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తారు.

# 'బంగ్లాను వీడటం నాకు తప్పనిసరి అవసరం'

## మాజీ ప్రధాని షేక్ హసీనా



**న్యూఢిల్లీ, అక్టోబరు 31:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా తన ప్రవాసంపై తొలిసారిగా మౌనం వీడారు. తన ప్రాణాలను, తన చుట్టూ ఉన్నవారి భద్రతను కాపాడేందుకే దేశం విడిచి పెట్టాల్సి వచ్చిందని, అదొక 'తప్పనిసరి అవసరం'గా మారిందని ఆమె స్పష్టం చేశారు. తన పాలనను కూల్చివేసిన విద్యార్థుల నిరసనలను 'హింసాత్మక తిరుగుబాటు'గా అభివర్ణించిన ఆమె, భద్రతా బలగాలు కాల్పులు జరపాలని తాను ఆదేశించానన్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. బ్రిటిష్ మీడియా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో హసీనా పలు కీలక విషయాలు వెల్లడించారు. "నేను అక్కడ ఉండి ఉంటే నా ప్రాణాలకే కాదు, నా చుట్టూ ఉన్నవారికి కూడా ప్రమాదం వాటిల్లేదని ఆమె పేర్కొన్నారు. గత ఏడాది ఆగస్టు 5న ఆమె దేశం విడిచి భారత్ కు వచ్చేసిన విషయం తెలిసిందే. బంగ్లాదేశ్‌లో తన అవామీ లీగ్ పార్టీపై నిషేధం ఉన్నప్పటికీ, దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడమే తన లక్ష్యమని ఆమె పునరుద్ఘాటించారు.

స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు ఉద్యోగాల్లో కోటాను రద్దు చేయాలనే డిమాండ్‌తో మొదలైన విద్యార్థుల నిరసనలు, చివరికి తన ప్రభుత్వాన్ని కూల్చివేసే స్థాయికి చేరాయని హసీనా అన్నారు. ఈ నిరసనలను 'హింసాత్మక తిరుగుబాటు'గా పేర్కొన్న ఆమె, "నాయకురాలిగా నేను బాధ్యత తీసుకుంటాను. కానీ, భద్రతా బలగాలను కాల్పులు జరపమని ఆదేశించాననడం పూర్తిగా అబద్ధం" అని తేల్చిచెప్పారు. ఘర్షణల్లో మరణాలు సంభవించడానికి క్షేత్రస్థాయిలో భద్రతా దళాల్లో క్రమశిక్షణ లోపించడమే కారణమని ఆరోపించారు. మృతుల సంఖ్యను 1,400గా ప్రచారం చేయడాన్ని ఆమె తోసిపుచ్చారు.

అది కేవలం తనపై జరుగుతున్న ప్రచారంలో భాగమేనని, ఆ సంఖ్యను భారీగా పెంచి చెబుతున్నారని అన్నారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లోని అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ ఐసిజె తనపై జరుపుతున్న విచారణను హసీనా 'బూటకపు విచారణ'గా కొట్టిపారేశారు.

"నన్ను రాజకీయంగా అంతం చేయడానికే, ఎన్నిక కాని ప్రభుత్వం నా రాజకీయ ప్రత్యర్థులతో ఈ బూటకపు కోర్టును నడుపుతోంది" అని ఆమె ఆరోపించారు. ఈ విచారణలో తనకు మరణశిక్ష విధించినా ఆశ్చర్యపోనని,

భయపడబోనని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన ప్రాసిక్యూటర్ తాజుల్ ఇస్లాం మాత్రం విద్యార్థుల నిరసనల సమయంలో జరిగిన హింసకు, మానవ హక్కుల ఉల్లంఘనకు షేక్ హసీనానే 'ప్రధాన సూత్రధారి' అని ఆరోపిస్తున్నారు.

ఈ ఇంటర్వ్యూలో హసీనా తన రాజకీయ పునరాగమనంపై గానీ, బంగ్లాదేశ్‌కు తిరిగి వచ్చే ప్రణాళికలపై గానీ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

# షట్‌డౌన్‌తో ఆహార సంక్షోభం

## ఎమర్జెన్సీ ప్రకటించిన న్యూయార్క్



**వాషింగ్టన్, అక్టోబరు 31:** అమెరికాలో కొనసాగుతున్న ప్రభుత్వ షట్‌డౌన్ తీవ్ర ఆహార సంక్షోభానికి దారితీస్తోంది. ఫెడరల్ ప్రభుత్వం నుంచి అందే ఆహార సాయం నిలిచిపోనున్న నేపథ్యంలో న్యూయార్క్ రాష్ట్రం స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీ ప్రకటించింది. ఈ మేరకు గవర్నర్ కేథీ హోచుల్ సంచలన ప్రకటన చేశారు. అత్యవసర ఆహార సహాయం కోసం రాష్ట్రం తరఫున 65 మిలియన్ డాలర్ల నిధులను విడుదల చేస్తున్నామని, దీని ద్వారా 4 కోట్ల మీల్స్ అందిస్తామని ఆమె మీడియా సమావేశంలో వెల్లడించారు. ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా అమెరికాలో అల్పాదాయ కుటుంబాలకు జీవనాధారమైన సప్లిమెంటల్ న్యూట్రిషన్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్ లేదా ఫుడ్ స్టాంప్స్ ప్రయోజనాలు కోట్లాది మందికి అందకుండా పోయే ప్రమాదం ఏర్పడింది. నిధుల కొరత కారణంగా నవంబర్ నెల ప్రయోజనాలను తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు నిలిపివేయాలని ఈ నెల ప్రారంభంలోనే అమెరికా వ్యవసాయ శాఖ రాష్ట్ర ఏజెన్సీలను ఆదేశించింది. రిపబ్లికన్ పార్టీ ఆధ్వర్యంలోని ఫెడరల్ ప్రభుత్వ షట్‌డౌన్ కొనసాగుతుండగా, ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు చట్టబద్ధంగా ఆమోదించిన అత్యవసర నిధులను విడుదల చేయడానికి ట్రంప్ ప్రభుత్వం నిరాకరిస్తోందని గవర్నర్ హోచుల్ ఆరోపించారు. ఈ సంక్షోభం నేపథ్యంలో పలు రాష్ట్రాలు సొంతంగా చర్యలు తీసుకుంటున్నాయి. లూసియానా గవర్నర్ జెఫ్ లాండ్రీ గత వారం ఎమర్జెన్సీ ప్రకటించి, లబ్ధిదారులకు రాష్ట్ర నిధులను కేటాయించారు. వెర్మంట్ రాష్ట్రం కూడా నవంబర్ 15 వరకు ఫుడ్ స్టాంప్స్ కొనసాగించేందుకు నిధులను ఆమోదించింది. న్యూ మెక్సికో సైతం 30 మిలియన్ డాలర్ల అత్యవసర ఆహార సహాయాన్ని ప్రకటించింది. ఈ నేపథ్యంలో 25 రాష్ట్రాలకు చెందిన డెమోక్రటిక్ గవర్నర్లు, అటార్నీ జనరళ్లు ట్రంప్ ప్రభుత్వంపై మంగళవారం దావా వేశారు. అత్యవసర నిధులను వినియోగించే అధికారం తమకు లేదనడాన్ని వారు సవాలు చేశారు. ప్రజలకు ఆహార సాయం కొనసాగించేందుకు కాంగ్రెస్ ఆమోదించిన నిధులను వెంటనే విడుదల చేయాలని కోర్టును కోరారు. అమెరికాలో న్యూట్రిషన్ పథకం ద్వారా సుమారు 4.2 కోట్ల మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారు.

# వలసదారులపై అమెరికా అక్కసు

## భారత్‌ను నిందిస్తూ యాడ్



**వాషింగ్టన్, అక్టోబరు 31:** మాస్ డిపోర్టేషన్, అరెస్టులు, చట్టపరమైన ప్రవేశాలపై ఆంక్షలు.. ఇలా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి వలసదారులపై విరుచుకుపడుతున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే హెచ్-1బి వీసాదారులను ఉద్దేశించి ట్రంప్ యంత్రాంగం అక్కసు వెళ్లగక్కింది. ఈ మేరకు లేబర్ డిపార్ట్‌మెంట్ ఎక్స్ వేదికగా ఒక యాడ్ విడియోను విడుదల చేసింది. ఆ వీసాను కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయని, అమెరికన్ యువత స్థానంలో విదేశీ కార్మికులతో భర్తీ చేస్తున్నాయని నిందించింది. ఆ వీసాదారుల్లో అత్యధికులు భారతీయులే ఉన్నారని ఆక్షేపించింది.

'హెచ్-1బి వీసా దుర్వినియోగం కారణంగా విదేశీ కార్మికులతో ఉద్యోగాలు భర్తీ అవుతున్నాయి. యువ అమెరికన్ల అమెరికా డ్రీమ్ దొంగతనానికి గురవుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, లేబర్ విభాగం నాయకత్వంలో వీసాను దుర్వినియోగం చేస్తోన్న కంపెనీలను జవాబుదారీ చేస్తున్నాం. అమెరికా ప్రజల కోసం అమెరికా కలను తిరిగి స్వాధీనం చేసుకుంటున్నాం. కష్టపడి పనిచేస్తే.. అమెరికా కలను సాధించుకోవచ్చని మేం తరతరాలుగా చెప్తున్నాం. కానీ మా యువత విషయంలో అలా జరగడం లేదు' అని యాడ్‌లో ప్రస్తావించారు. హెచ్-1బిల్లో 72 శాతం భారతీయులకే వెళ్తున్నాయని ఒక గ్రాఫ్ రూపంలో వెల్లడించారు. ఈ వీసా విషయంలో ఏవైనా అవకతవకలు చోటుచేసుకుంటున్నాయా? అని గుర్తించేందుకు 'ప్రాజెక్టు ఫైర్‌వార్' పేరిట లేబర్ విభాగం ఆడిట్ నిర్వహిస్తోంది. ఈ సమయంలోనే ఈ యాడ్‌ను పోస్ట్ చేసింది. అమెరికన్ యువత స్థానంలో తక్కువ జీతాలకు పనిచేసే విదేశీ యువతతో భర్తీ చేయకుండా చూడటమే దీని ఉద్దేశం. వాచ్-1బి వీసా విషయంలో ట్రంప్ కఠినంగా వ్యవహరిస్తోన్న సంగతి తెలిసిందే. ఆ ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం సంచలనం సృష్టించింది 'హెచ్-1బి వీసా వ్యవస్థ మోసాలతో నిండి ఉంది. అది అమెరికన్ల వేతనాలను తగ్గించింది. కాబట్టి ట్రంప్ ఈ వ్యవస్థను మెరుగు పరచాలనుకుంటున్నారు' అని అమెరికా ప్రభుత్వం స్పందించిన సంగతి తెలిసిందే. అయితే ఆయన నిర్ణయాన్ని అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ కోర్టులో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ట్రంప్ నిర్ణయం కాంగ్రెస్ తీసుకొచ్చిన సంక్లిష్టమైన వీసా వ్యవస్థను దెబ్బతీస్తోందని ఆ గ్రూప్ ఆందోళన వ్యక్తం చేసింది. హెచ్-1బిపై ఆధారపడిన వ్యాపారులపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోందని తన వ్యాజ్యంలో వాదించింది. ఇక పలు ఉద్యోగ సంఘాలు కూడా న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. అధ్యక్షుడు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ అమెరికా చట్టసభ సభ్యులు ఆయనకు లేఖ కూడా రాశారు. ట్రంప్ నిర్ణయం యుఎస్ కంపెనీలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నైపుణ్యం కలిగిన వలసదారులను కోల్పోవాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు.

# నేటి నుంచి 'భారత్ పర్వ్'



## దేశవ్యాప్తంగా ఘనంగా ఏక్తా దివస్

## సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ప్రధాని నివాళి

## ఏక్తానగర్‌లో ఘనంగా ప్రత్యేక కార్యక్రమాలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 31:** భారతదేశ ఉక్కు మనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ గౌరవార్థం ఏటా అక్టోబర్ 31న నిర్వహించినట్లుగానే ఈసారి కూడా దేశవ్యాప్తంగా వాడవాడలా రాష్ట్రీయ ఏక్తా దివస్ (జాతీయ ఐక్యతా దినోత్సవం)ను ఘనంగా నిర్వహించారు. పటేల్ స్వస్థలం గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో నిర్వహించిన ఏక్తా దివస్ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉక్కు మనిషికి ప్రధాని పుష్పాంజలితో నివాళి అర్పించారు. ఏక్తానగర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలు దేశ ఐక్యత, సాంస్కృతిక వైవిధ్యం, దేశభక్తిని ప్రతిబింబించాయి. ఆహుతులను ఆకట్టుకున్నాయి. సర్దార్ పటేల్ 150వ జయంతిని జరుపుకుంటున్నందున ఈ వేడుక ప్రత్యేక ప్రాముఖ్యత ఏర్పడింది. సర్దార్ పటేల్ దార్శనికత మరియు సంకల్పం 565 రాచరిక రాష్ట్రాలను ఏకం చేసి, ఆధునిక భారత దేశాన్ని రూపొందించాయి. ఈ రోజు జాతీయ సమైక్యత, ఐక్యత మరియు సమగ్రతకు ఆయన జీవితకాల అంకితభావాన్ని గుర్తుచేస్తుంది. కేంద్ర సాయుధ పోలీసు దళాలు (సిఎపిఎఫ్‌లు), రాష్ట్ర పోలీసు యూనిట్లు, నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సిసి) బృందాలను ఒకచోట చేర్చే గ్రాండ్ పెరేడ్, సాంస్కృతిక ఉత్సవం నిర్వహించారు. ఈసారి వేడుకల్లో మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిచ్చారు. ప్రధానమంత్రికి అందించే గార్డ్ ఆఫ్ ఆనర్‌కు ఒక మహిళా అధికారి నాయకత్వం వహించారు. సిఐఎస్ఎఫ్, సిఆర్‌పిఎఫ్ నుండి మహిళా సిబ్బంది భారతీయ మహిళల బలం, విశ్వాసాన్ని ప్రతిబింబించే మార్షల్ ఆర్ట్స్, పోరాట ప్రదర్శనలను ప్రదర్శించారు.

**నవంబర్ 1 నుండి 15 వరకు భారత్ పర్వ్**

ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతిని పురస్కరించుకుని నవంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు 'భారత్ పర్వ్' పేరిట కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దేశమంతటా సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రాంతీయ వంటకాలను ప్రదర్శించే గొప్ప ఆహార ఉత్సవం.. జాతీయ సమైక్యతను జరుపుకునే ప్రదర్శనలు, కార్యకలాపాలు ఇందులో ఉండనున్నాయి. ఈ భారత్ పర్వ్ ఉత్సవాలు నవంబర్ 15న బిర్సా ముండా జయంతితో ముగియనున్నాయి. గిరిజన వీరుడు బిర్సా ముండా, భారతదేశ గిరిజన సమాజాల గొప్ప వారసత్వాన్ని సత్కరించనుంది.

# సంక్షిప్తంగా..

## ఆరెస్సెస్‌ను నిషేధించాలి: మల్లికార్జున ఖర్గే



**న్యూఢిల్లీ, అక్టోబర్ 31:** దేశంలో ఎక్కువగా శాంతి భద్రతల సమస్యలు తలెత్తడానికి బిజెపి, ఆరెస్సెస్ కారణమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఆరోపించారు. ఈ క్రమంలో ఆరెస్సెస్‌ను నిషేధించాలన్నది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా కాంగ్రెస్‌పై ప్రధాని మోడీ చేసిన విమర్శలను పటేల్‌చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ చీఫ్ ఉదహరించారు. ఉక్కు మనిషి సర్దార్ పటేల్, ఉక్కు మహిళ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ గొప్ప నేతలని ఖర్గే పేర్కొన్నారు. వారు దేశానికి ఎంతో సేవ చేశారని, దేశ ఐక్యతను కాపాడేందుకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. రాష్ట్రీయ స్వయంసేవకరసంఘ్ నిషేధం వ్యాఖ్యలపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తు అది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. మహాత్మాగాంధీ హత్యకు దారితీసిన వాతావరణానికి ఆరెస్సెస్ సృష్టించిందన్నారు.

## ఆయుర్వేద సిరప్ తాగి చిన్నారి మృతి

**భోపాల్, అక్టోబరు 31:** ఆయుర్వేద సిరప్ తాగి ఆరు నెలల చిన్నారి మరణించింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆయుర్వేద సిరప్ అమ్మిన షాపును సీజ్ చేశారు. దర్యాప్తు కోసం కమిటీని ఏర్పాటు చేశారు. విషపూరిత దగ్గు మందు తాగి 24 మంది పిల్లలు మరణించిన మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆరు నెలల వయస్సున్న రోహి మినోటేకు వారం కిందట జర్వం, జలుబు వచ్చింది. ఆ పాప తల్లిదండ్రులు డాక్టర్‌కు చూపించలేదు. స్థానిక మెడికల్ స్టోర్‌లో ఆయుర్వేద దగ్గు సిరప్ కొనుగోలు చేశారు. ఆ చిన్నారికి ఆ మందు తాగించారు. నాలుగు రోజుల తర్వాత ఆ చిన్నారి ఆరోగ్యం క్షీణించింది. దీంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ పాప మరణించింది. ఈ నేపథ్యంలో ఆయుర్వేద దగ్గు సిరప్, డాక్టర్ల నిర్లక్ష్యం వల్ల తమ కుమార్తె చనిపోయినట్లు ఆ కుటుంబం ఆరోపించింది.

## భారత్‌కు చైనా ఎయిర్‌లైన్స్ విమానసర్వీసులు


**బీజింగ్,అక్టోబరు 31:** భారత్, చైనా మధ్య విమాన ప్రయాణాలు తిరిగి పుంజుకుంటున్నాయి. ప్రముఖ విమానయాన సంస్థ చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్, షాంఘైన్యూఢిల్లీ మధ్య డైరెక్ట్ విమానాల సంఖ్యను పెంచుతున్నట్లు శుక్రవారం ప్రకటించింది. భారత మార్కెట్ నుంచి బలమైన డిమాండ్ ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. వారానికి మూడుగా ఉన్న సర్వీసులను 2026 జనవరి 2 నుంచి ఐదుకు పెంచనుంది. ఈ సంస్థవిమాన సర్వీసులు ఢిల్లీ నుంచి బయలుదేరే విమానం రాత్రి 7:55 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 4:10 గంటలకు షాంఘై చేరుకుంటుంది. షాంఘై నుంచి బయలుదేరే విమానం మధ్యాహ్నం 12:50 గంటలకు ప్రారంభమై, సాయంత్రం 5:45 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) న్యూఢిల్లీలో ల్యాండ్ అవుతుంది.

## రోగాలు తెచ్చిపెడుతున్న ఢిల్లీ కాలుష్యం!



**న్యూఢిల్లీ, అక్టోబరు 31:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకీ క్షీణిస్తోంది. దీపావళి తర్వాత గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి చేరింది. ఢిల్లీఎన్సీఆర్ ప్రాంతంలో ఏక్యూఐ లెవెల్స్ 400కిపైనే నమోదవుతున్నాయి. ఈ వాయు కాలుష్యం రాజధాని ప్రాంత వాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. విషపూరిత గాలి ప్రజారోగ్య సంక్షోభానికి దారి తీస్తోంది. గాలి కాలుష్యం కారణంగా ప్రతీ ఇంట్లో ఒకరు ఏదో ఒక అనారోగ్య సమస్యతో సతమతమవుతున్నారు. కమ్యూనిటీ ప్లాట్‌ఫామ్ లోకల్ సర్కిల్స్ నిర్వహించిన సర్వేలో అనేక శారీరక రుగ్మతల అంశాలు బయటపడ్డాయి. ఢిల్లీఎన్సీఆర్ ప్రాంతంలోని దాదాపు 75 శాతం కుటుంబాల్లోని ప్రతి కుటుంబంలో కనీసం ఒకరు అనారోగ్యంతో ఉన్నారని తేలింది. ఢిల్లీ, గురుగ్రామ్, నోయిడా, ఫరీదాబాద్, ఘజియాబాద్ నుంచి దాదాపు 15వేల కంటే ఎక్కువ .


## బాలీవుడ్ బిగ్ బీ అమితాబ్‌కు భద్రత పెంపు!



**ముంబయి, అక్టోబరు 31:** బాలీవుడ్ బిగ్‌బీ అమితాబ్ బచ్చన్‌కు భద్రత పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఖలిస్తానీ అనుకూల సంస్థ 'సిక్స్ ఫర్ జస్టిస్' (ఎస్ఎఫ్‌జె) నుంచి ఆయనకు బెదిరింపులు రావడంతో కేంద్ర ఏజెన్సీలు అప్రమత్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఆయనకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఇటీవల అమితాబ్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'కౌన్ బనేగా కరోడ్‌పతి' (కెబిసి) షోకు పంజాబీ గాయకుడు, నటుడు దిల్జిత్ దోసాంజ్ హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన అమితాబ్ కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సంఘటనే తాజా వివాదానికి దారితీసింది. దిల్జిత్ చర్య

# పంజాబ్‌లో కేజ్రీవాల్‌కు ఏడంతస్తుల అద్దాల మేడ

## బిజెపి జాతీయ ప్రతినిధి షెహజాద్ పూనావాలా



**న్యూఢిల్లీ, అక్టోబరు 31:** ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌పై మళ్లీ ఆరోపణలు వస్తున్నాయి. పంజాబ్ సిఎం భగవంత్ మాన్ తన కోటాలో.. కేజ్రీవాల్ కోసం అద్దాల మేడ నిర్మిస్తున్నట్లు బిజెపి ఆరోపించింది. 7-స్టార్ సదుపాయాలు ఆ మేడలో కల్పిస్తున్నట్లు పేర్కొన్నది. పంజాబ్‌లో కేజ్రీవాల్ ఎమ్మెల్యే కాదు, కనీసం ప్రభుత్వంలో లేరని బిజెపి పేర్కొన్నది. బిజెపి జాతీయ ప్రతినిధి షెహజాద్ పూనావాలా దీనిపై ఆరోపణలు చేశారు. ఢిల్లీ ఎన్నికల్లో ఓడిన ఆమ్ ఆద్మీ నేతలు పంజాబ్‌లోని వివిధ బోర్డులు, కమిషన్‌లలో చోటు దక్కించుకున్నట్లు ఆరోపించారు. అద్దాల మేడ నిర్మాణం పట్ల కేజ్రీవాల్, ఆయన పార్టీ సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బిజెపి చేస్తున్న ఆరోపణల పట్ల ఆప్ కానీ, పంజాబ్ ప్రభుత్వం కానీ ఎటువంటి వివరణ ఇవ్వలేదు. ఢిల్లీలో నిర్మించిన అద్దాలమేడ నుంచి కేజ్రీవాల్‌ను అక్కడ ప్రజలు తరిమేశారని, కానీ అద్దాలమేడ కాన్సెప్ట్ అనేది ఆయన మెదడు నుంచి పోలేదని, అద్దాలమేడ రెండో భాగం పంజాబ్‌లో జరుగుతున్నదని, ఆ రాష్ట్ర ప్రజలు పన్నులతో దాన్ని నిర్మిస్తున్నారని, అది కూడా సిఎం కోటాలో పనులు జరుగుతున్నాయన్నారు.

# నేతాజీ మరణం విమానప్రమాదం కాదు!

## ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

**చెన్నై, అక్టోబరు 31:** నేతాజీ సుభాష్ చంద్రబోస్ మరణంపై భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అందరూ భావిస్తున్నట్లుగా నేతాజీ విమాన ప్రమాదంలో మరణించలేదని తాను గట్టిగా విశ్వసిస్తున్నట్లు తెలిపారు. అయితే, తన నమ్మకాన్ని బలపరిచేందుకు తన వద్ద ఎలాంటి ఆధారాలు లేవని ఆయన స్పష్టం చేయడం గమనార్హం. తమిళనాడు పర్యటనలో ఉన్న ఉప రాష్ట్రపతి మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు, నేతాజీకి అత్యంత నమ్మకమైన అనుచరుడైన పసుపొన్ ముత్తురామలింగ దేవర్ చెప్పిన మాటల వల్లే తాను ఈ విషయాన్ని నమ్ముతున్నట్లు వివరించారు. నేతాజీ ఆ విమాన ప్రమాదంలో మరణించలేదు, నేను ఆయన్ను కలిశాను' అని దేవర్ నాతో చెప్పారు. అందుకే నేను నమ్ముతున్నాను" అని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. దేవర్ ఎప్పుడూ అబద్ధం చెప్పలేదని, రాజకీయ ప్రస్థానంలోనూ ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించారన్నారు.

# బీమా సొమ్ముకోసం కొడుకును హత్యచేసిన తల్లి



**లక్నో, అక్టోబరు 31:** బీమా డబ్బు కోసం ఒక మహిళ తన ప్రియుడితో కలిసి కుమారుడ్ని హత్య చేసింది. రోడ్డు ప్రమాదంలో మరణించినట్లుగా నమ్మించేందుకు ప్రయత్నించింది. దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ దేహత్‌లో ఈ సంఘటన జరిగింది. 23 ఏళ్ల ప్రదీప్ శర్మ తండ్రి కొన్ని నెలల కిందట మరణించాడు. ఆ తర్వాత మయాంక్ అలియాస్ ఇషు కటియార్‌తో అతడి తల్లికి వివాహేతర సంబంధం ఏర్పడింది. ప్రదీప్ దీనిని వ్యతిరేకించాడు. ఈ నేపథ్యంలో తల్లికి దూరంగా ఉంటూ విడిగా నివసిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగం సంపాదించాడు. కాగా, తమ సంబంధాన్ని వ్యతిరేకించిన కుమారుడు ప్రదీప్ అడ్డు తొలగించుకునేందుకు ప్రియుడు మయాంక్‌తో కలిసి అతడి తల్లి ప్లాన్ వేసింది. మయాంక్ తన సోదరుడు రిషితో కలిసి ప్రదీప్ పేరు మీద పలు బీమా పాలసీలు కొనుగోలు చేశాడు. మరోవైపు దీపావళి సందర్భంగా ప్రదీప్ సొంతూరుకు తిరిగి వచ్చాడు. అక్టోబర్ 26న మయాంక్, రిషి కలిసి డిన్నర్ పేరుతో అతడ్ని కారులో తీసుకెళ్లారు. సుత్తితో తలపై పలుసార్లు కొట్టి హత్య చేశారు. రోడ్డు ప్రమాదంలో మరణించినట్లుగా నమ్మించేందుకు ప్రయత్నించారు. బల్హరామౌ గ్రామం సమీపంలోని కాన్పూర్‌ఎటావా హైవేపై మృతదేహాన్ని పడేశారు. కాగా, ఒక వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణించినట్లు తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు.

31-10pg6exHMNWJQE 10_31-10pg6exHMNWJQE.qxd 31/Oct/25 11:08 PM Page 1



# విజయవాడ పశ్చిమ బైపాస్ రెడీ

**● వాహనాల రాకపోకలకు సిద్ధం చేస్తున్న అధికారులు ● విద్యుత్ హైటెన్షన్ వైర్ల అలైన్‌మెంట్ వివాదానికి హైకోర్టు తీర్పుతో స్పష్టత**



విజయవాడ, అక్టోబరు 31 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడ పశ్చిమ బైపాస్ (ప్యాకేజీ-3)లో కొన్ని నెలలుగా కొనసాగుతున్న విద్యుత్ హైటెన్షన్ వైర్ల అలైన్‌మెంట్ వివాదానికి హైకోర్టు తీర్పుతో స్పష్టత లభించింది. హైకోర్టు ఆదేశాలతో పశ్చిమ బైపాస్ రహదారి త్వరలో వాహనాల రాకపోకలకు సిద్ధమవుతున్నదని అధికార వర్గాలు వెల్లడించాయి. జక్కంపూడి, అంబాపురం ప్రాంతాల్లోని ఆరు టవర్ల విషయంలో పాత అలైన్‌మెంట్ ప్రకారమే టవర్లను ఉంచి, వాటి ఎత్తును పెంచాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పుతో రైతులు, ఎన్‌హెచ్‌ఏఐ మధ్య వివాదానికి తెరపడే అవకాశం కనిపిస్తోంది. చినఅవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు ఉన్న పశ్చిమ బైపాస్ రహదారి ప్యాకేజీ-3లో జక్కంపూడి, అంబాపురం, నున్న పరిధిలో మొత్తం 8 విద్యుత్ టవర్లు ఉన్నాయి. ప్రస్తుతం ఇవి రోడ్డు ఉపరితలం నుంచి 9 మీటర్ల ఎత్తులో ఉన్నాయి. ఎన్‌హెచ్‌ఏఐ, ల్యాంకో పవర్ ప్రాజెక్ట్ సంస్థలు ఈ టవర్లను తొలగించి కొత్త అలైన్‌మెంట్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. అయితే, దీనికి వ్యతిరేకంగా జక్కంపూడి, అంబాపురంలోని 24 మంది రైతులు, నున్నలోని 8 మంది రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పాత అలైన్‌మెంట్‌నే కొనసాగిస్తూ వైర్ల ఎత్తును పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, పాత మార్గం ప్రకారమే టవర్ల ఎత్తును రోడ్డుపైనుంచి కనీసం 14 మీటర్లకు పెంచాలని స్పష్టమైన తీర్పు ఇచ్చారు. రైతులు తమ ఆవేదనను ప్రధాని కార్యాలయం, కేంద్ర రహదారుల శాఖ మంత్రికి కూడా తెలియజేశారు. వారి విన్నపాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, వ్యవసాయ భూములకు నష్టం కలగకుండా ప్రాజెక్ట్‌ను కొనసాగించేలా నిర్ణయం తీసుకుంది.

ప్రస్తుతం ప్యాకేజీ-3లో పనులు దాదాపు పూర్తి కావొచ్చే దశలో ఉన్నాయి. విద్యుత్ వైర్ల ఎత్తుపై తలెత్తిన వివాదం కారణంగా రహదారిని వాడుకలోకి తీసుకురాలేకపోయారు. నున్నలో కూడా ఇలాంటి పరిస్థితులు నెలకొన్నప్పటికీ, అక్కడ పెద్దగా అడ్డంకులు లేనందున అదే విధమైన తీర్పు వచ్చే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. రాబోయే పది రోజుల్లో నున్న టవర్ల విషయంలోనూ కోర్టు తీర్పు వెలువడే అవకాశం ఉంది. ఈ వివాదం పరిష్కారం అవగానే పశ్చిమ బైపాస్ రహదారి పూర్తిస్థాయిలో ప్రయాణానికి సిద్ధమవుతుందని అధికారులు తెలిపారు. విజయవాడ నగర రవాణాకు ఈ మార్గం కొత్త ఊపిరినిచ్చేలా మారనుంది.

### ప్రభుత్వ చొరవతోనే పరిష్కారం సాధ్యమైంది

పశ్చిమ బైపాస్ ప్రాజెక్టు ఆలస్యానికి కారణమైన ఈ టవర్ల వివాదం పరిష్కార దిశగా సాగడానికి కూటమి ప్రభుత్వం కీలక పాత్ర పోషించింది. ప్రజాప్రతినిధులు నిత్యం కేంద్రంలో, రైతులతో సంప్రదింపులు జరిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, కలెక్టర్ లక్ష్మీశ‌లతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ రైతులు, ఎన్‌హెచ్‌ఏఐ, పవర్ కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరిపి తగిన పరిష్కారం సూచించింది. ఎన్‌హెచ్‌ఏఐ కూడా సానుకూలంగా స్పందించడంతో, ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులు అన్నీ తొలగిపోయాయి. దీంతో ప్రస్తుతం పశ్చిమ బైపాస్ పూర్తి దిశగా అడుగులు పడుతున్నాయి.



రైల్వే సిబ్బందిచే ఏక్తాదివాస్ ప్రతిజ్ఞ చేయిస్తున్న డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

## దేశ ఐక్యత, సమగ్రతలకు పునరంకితం అవుదాం

గుంతకల్లు రైల్వే, అక్టోబరు 31 ప్రభాతవార్త: జాతీయ సమైక్యత, సమగ్రతలకు పటిష్ట పరిచే క్రమంలో ప్రతిఒక్కరూ దేశ ఐక్యతకు పునరంకితం అవుదామని డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా రైల్వే సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డిఆర్ఎం కార్యాలయంలో జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దీవస్) ఘనంగా జరిగింది. స్థానిక డిఆర్ఎం కార్యాలయం నుంచి స్టేషన్ వరకు సమగ్రత ర్యాలీని నిర్వహించిన కార్యక్రమంలో అదనపు డిఆర్ఎం సుధాకర్, సీనియర్ డిపిఓ యం. బాలమురళీధర్ అధికారులు ప్రసాద్, కల్పన, రాజశేఖర్ నాయక్, శైలా సుధాకర్, మధుసూదనరావు, వెటరన్ అధికారులు రామాంజనేయులు, ఆయా విభాగాల అధికారులు, రైల్వేపాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## లోకోషెడ్ సీనియర్ డిఇఇగా వీరయ్య

గుంతకల్లు రైల్వే, అక్టోబరు 31 ప్రభాతవార్త: దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు విద్యుత్ లోకోషెడ్ తొలి సీనియర్ డిఇఇగా సి.వీరయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక విద్యుత్ విభాగంలో పనిచేసే అధికారులకు స్థానచలనం గావిస్తూ సంబంధిత ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసిన విషయం పాఠకులకు విధితమే. దీంతో స్థానిక విద్యుత్ లోకో షెడ్ సీనియర్ డిఇఇగా వీరయ్య, టిఆర్ఎస్ఓ డిఇఇగా నాగేశ్వరరావులు తమ తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు.

## నేటి నుంచి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపెయిన్

గుంతకల్లు రైల్వే, అక్టోబరు 31 ప్రభాతవార్త: రైల్వే పెన్షనర్లు తమ తమ లైవ్ సర్టిఫికెట్‌లను ఈనెలాఖరు లోగా తమ తమ ఖాతా గల బ్యాంకులలో గానీ లేదా డిజిటల్ రూపంలో గాని తమ లైవ్ సర్టిఫికెట్‌లను సమర్పించాలని దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ సిపిఓ, గుంతకల్లు సీనియర్ డిపిఓ యం. బాలమురళీధర్ తెలిపారు. పెన్షనర్లలో చైతన్యం, అవగాహన కల్పించేందుకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ ప్రచార కార్యక్రమాలను నవంబర్ 01 నుంచి 30 నిర్వహిస్తున్నామన్నారు.



పత్తి వరదుని ప్రాణ ప్రతిష్ఠలో ఆలయాధికారులు, పాలకమండలి

## ప్రసన్న వరదరాజస్వామికి ప్రాణప్రతిష్ఠ

శ్రీకాళహస్తి, అక్టోబరు 31 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి ప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో అత్తి కొయ్యతో ప్రసన్నవరదరాజస్వామిని విగ్రహాన్ని దారుశిల్పులు ఆనందాచ్చారి, జగన్ ఆచారిల సారథ్యంలో తయారు చేసారు. శాస్త్రోక్తంగా పూజలు, హోమాలు నిర్వహించిన మీదట మూడవ రోజు శుక్రవారం స్థానిక ఆచారాల మేరకు స్వామి వారికి ప్రాణప్రతిష్ట గావించారు. చిత్రపటం స్థానంలో అత్తి వరదుని ప్రతిష్టించి ప్రాణ ప్రతిష్ట జరిపి అభిషేకాలు పూజలు నిర్వహించారు. యాగశాలలో కలశోద్వాసన, పూర్ణాహుతి కార్యక్రమాలను ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్ దంపతులు, ఇఓ డి.బాపిరెడ్డి దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు పగడాల మురళి, విజయమ్మ, దండి రాఘవయ్య, ప్రత్యేక ఆహ్వానితులు చాగణం శైలజ, టిడిపి నేత కిట్టు, ఎఇఓ హేమామాలిని, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, దుర్గా ప్రసాద్, బిజెపి నాయకుడు గరికపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కబ్జా చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నట్లు?

**● సునీతమ్మా.. నీ చుట్టూ కబ్జాదారులున్నారు ● 15 వేల కుటుంబాలను భయపెడుతున్నారు**

**● 15 రోజుల్లో పాపంపేట సంగతి తేల్చకపోతే చలో అమరావతి పిలుపునిస్తాం: సిపిఐ నేత రామకృష్ణ**




అనంతపురం, అక్టోబరు 31 ప్రభాతవార్త బ్యూరో: అనంతపురం శివారులోని పాపంపేటలో 15వేల కుటుంబాలను కబ్జాదారులు భయపెడుతుంటే ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు ఏమి చేస్తున్నారు? అంటూ సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ హెచ్చరిక చేశారు. సీఎం చంద్రబాబుకు ప్రజాస్వామ్య మీద నమ్మకం లేకపోతే పోలీస్ స్టేషన్లు అన్నింటిని ఎమ్మెల్యేల ఇండ్ల వద్ద పెట్టుకోవాలని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాపంపేట భూ వివాదంలో తనకు సంబంధం లేదని ఎమ్మెల్యే పరిటాల సునీత నిరూపించుకోవాలన్నారు. సునీత చుట్టూ కబ్జాదారులున్నారని, ఒక సోదరిగా చెబుతున్నాను జాగ్రత్త పడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పాపంపేటలో అనంతపురం సిపిఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి అధ్యక్షతన పాపంపేట భూ బాధితులకు అండగా సిపిఐ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి రామకృష్ణ మాట్లాడుతూ పాపంపేటలో ఊరంతా కబ్జా చేసి వేల కుటుంబాలను భయపెట్టి కబ్జా చేస్తూ భూములు అన్ని మావేనంటూ భయపెడుతుంటే సిగ్గులేని అధికారులుగా కొనసాగుతుండడం ఇంతకంటే దుర్మార్గం ఏముందని సూటిగా ప్రశ్నించారు. 1964 డిసెంబర్ 26లో అప్పుటి ప్రభుత్వం సోత్రియం భూములుపై ఒక ప్రకటన చేసిందని గుర్తు చేశారు. పాపంపేట భూముల్లో హక్కు మాకు ఉందంటూ కొందరు ముందుకు రావడంతో వారికి సర్వేయర్, విఆర్ఓ, ఆర్ఐలు తప్పుడు రికార్డులు సృష్టించి హైకోర్టులో అనుకూల తీర్పు వచ్చేలా చేస్తుంటే జిల్లా ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మీరు దుర్మార్గంగా వ్యవహరిస్తే బాధితులు తరుపున సిపిఐ ఎర్ర జెండా అండగా వుంటుందని ఎవరూ భయపడవద్దని భరోసా ఇచ్చారు. ఒక సోదరిగా సలహా ఇస్తున్నానంటూ రామకృష్ణ సునీతమ్మను ఉద్దేశించి మీ ప్రమేయం లేకపోతే భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని అధికారులపై ఒత్తిడి తేవాలని సూచించారు. భూ బాధితుల అందరిని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దగ్గరికి తీసుకుపోతామని 15 రోజులు సమయం ఇచ్చి న్యాయం జరిగేదాకా సిపిఐ అండగా ఉంటుందని హామి ఇచ్చారు. అవసరమైతే చలో అమరావతి కార్యక్రమాన్ని పెట్టి ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్తామన్నారు. పాపంపేటలో దుర్మార్గం, పాపాలు జరుగుతుంటే కంప్యూటర్లో అన్ని చూస్తున్న చంద్రబాబుకు ఇక్కడి దుర్మార్గం కనబడలేదా అని ప్రశ్నించారు. కబ్జాదారులకు అండగా నిలిచిన అధికారులు అందరినీ సస్పెండ్ చేయాలి, ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించిన వారిని ఉద్యోగం నుంచి తొలగించాలని అంతేకాకుండా జైల్లో పెట్టించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి. జగదీష్, సి. జఫర్, జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శులు సి.మల్లికార్జున, జె. రాజారెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.రామకృష్ణ, ఎన్. శ్రీరాములు, బి. కేశవరెడ్డి, టీ. నారాయణ స్వామి, పద్మావతి, బి.రమణయం. రమేష్, సి. లింగమయ్య, రాజేష్, సంతోష్ కుమార్, రాప్తాడు మండల సహాయ కార్యదర్శి రామ కృష్ణ, నగర సహాయ కార్యదర్శి వి.కృష్ణుడు, మండల కార్యదర్శులు నరేష్, బి. రామకృష్ణ, లోకసత్తా జిల్లా అధ్యక్షుడు అశోక్, గోపాలరెడ్డి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పరిశోధనలను బలోపేతం చేయాలి

శ్రీకాళహస్తి, అక్టోబరు 31 ప్రభాతవార్త: ప్రజా విధాన విద్య, పరిశోధనలను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వక్తలు పిలుపు నిచ్చారు. తిరుపతి ఐఐటిలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో రిటైర్డ్ ఐఏయస్ ఎం విజయానంద్‌తో పాటు రిటైర్డ్ ఐఏయస్‌లు ఆర్.సుబ్రమణ్యం, ఆర్ఎస్ జులానియా, శ్రీరాజీవ్ సదానందన్, జె.కుంటే, డాక్టర్ సి.చంద్రమౌళి హాజరయ్యారు. వర్క్‌షాప్‌లో పేదరికం, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యం, విద్య, నైపుణ్యంతో కూడిన ఉన్నత విద్య వంటి కీలకమైన పాలనా అంశాలను వివరించారు. విద్యార్థులు, ప్రతిభావంతమైన ప్రజా విధాన రూపకల్పనపై విలువైన దృక్పథాలను అందిస్తాయన్నారు. పబ్లిక్ పాలసీల విద్య పరిశోధన న్యాయవాదంలో దీర్ఘకాలిక ఒప్పందంపై సంతకం చేసారు. ఈ అవగాహన ఒప్పందంపై తిరుపతి ఐఐటి డైరెక్టర్ కె.సత్యనారాయణ, క్రిస్ కార్యదర్శి సిఇఓ ఆర్ సుబ్రమణ్యం రిటైర్డ్ ఐఏయస్ విజయానంద్ అధ్యాపక సభ్యులు మానవీయ శాస్త్ర నిపుణులు సంతకాల చేసారు. ఈ సహకారం పాఠ్యాంశాల అభివృద్ధి, బోధనా మద్దతు, నిపుణుల ప్రతిభ, సామాజిక డేటా సైన్స్ విధానాల ఆవిష్కరణలో ఉమ్మడి చొరవల ద్వారా విద్యా పరిశోధనా సంబంధాలను బలోపేతానికి తోడ్పడుతుందన్నారు.



ఇఓకు విరాళం అందిస్తున్న హైదరాబాదు వాసులు

## వాయులింగేశ్వరునికి బంగారు ఆభరణాల బహూకరణ

శ్రీకాళహస్తి, అక్టోబరు 31 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వయంభువు వాయులింగేశ్వరునికి శుక్రవారం హైదరాబాదు వాసి జి.ఇందిరా వారి కుటుంబసభ్యులతో కలసి శివయ్యకు బంగారు ఆభరణాలు వితరణ ఇచ్చారు. 0.096 గ్రాముల బంగారు కాసుల హారం, 650 గ్రాముల వెండి బిందెను బహూకరించారు. ఈ విరాళాన్ని వారు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.బాపిరెడ్డికి అందించారు. వీటి విలువ సుమారు రూ.9.32 లక్షలు అని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి రశీదులను కూడా ఇఓకు అందించారు. ఈ కార్యక్రమాల్లో ఎఇఓ మోహన్ పాల్గొన్నారు. వారికి ఆలయంలోని స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనంతోపాటు వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు, స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.

# శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షునిగా గుత్తా హరి

**ఏపీ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎంపిక**



అనంతపురం, అక్టోబరు 31 ప్రభాతవార్త బ్యూరో: అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ "శ్రీశ్రీ కళావేదిక" ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. ప్రముఖ సాహితీవేత్త, అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆదేశాల మేరకు ఈ కమిటీని నియమించినట్లు జాతీయ అధ్యక్షురాలు జి. ఈశ్వరీభూషణం వెల్లడించారు. అన్ని జిల్లాలకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నట్లు ఆమె వివరించారు. ఏపీ రాష్ట్ర అధ్యక్షునిగా ప్రముఖ కవి, సామాజిక కార్యకర్త, సీనియర్ జర్నలిస్ట్ గుత్తా హరి సర్వోత్తమ నాయుడుకు రెండోసారి అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. జాతీయ ఉపాధ్యక్షునిగా కూడా ఆయన సేవలు కొనసాగిస్తారని స్పష్టం చేశారు. రాష్ట్ర గౌరవాధ్యక్షునిగా ప్రముఖ న్యాయవాది, సీనియర్ కవి నరహరి నారాయణ రెడ్డి (కర్నూలు), రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ప్రముఖ విద్యావేత్త, అనువాదకులు డా. పి. రమేష్ నారాయణ (అనంతపురము), రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా కవయిత్రి మలేకర్ నాగజ్యోతి (కర్నూలు)ని ఎంపిజేశారు. రాష్ట్ర గౌరవ సలహాదారుగా విద్యాసంస్థల అధినేత కామకోటి ప్రసాదరావు (మదనపల్లి), రాష్ట్ర క్రమశిక్షణా మండలి అధ్యక్షుడిగా ప్రముఖ విద్యావేత్త, రచయిత కొలచిన రామ జగన్నాథ్ (శ్రీకాకుళం), రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్‌గా ప్రముఖ న్యాయవాది, కవి మరువాడ భానోజీ (విశాఖపట్నం) నియమితులయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాయలసీమ ప్రాంతీయ అధ్యక్షుడిగా అరవ జయపాల్ (తిరుపతి), ఉత్తరాంధ్ర ప్రాంతీయ అధ్యక్షునిగా ప్రముఖ విద్యావేత్త, రచయిత డబ్బీరు గోవిందరావుకు అవకాశం దక్కింది. రాష్ట్ర సమన్వయకర్తగా సి.హెచ్. రవికుమార్ (కృష్ణా), రాష్ట్ర అధికార ప్రతినిధిగా డా. కె.ఆర్.జి. శేషుకుమార్ (విజయవాడ)లకు చోటు కల్పించారు. రాష్ట్ర కార్యదర్శులుగా నల్లా నరసింహమూర్తి (కోనసీమ), బివివి సత్యనారాయణ (అమలాపురం), ఖిఅమ్మకవిఖి కొండేపూడి తాతబ్బాయి (కాకినాడ), ఎస్.వి.వి.ఎస్. ప్రసాద్ (పశ్చిమ గోదావరి), యనమదల సూర్యనారాయణ రాజు (విశాఖపట్నం), సుజయ్ కృష్ణ (ఏలూరు), గొట్టుముక్కల నాసరయ్య (ప్రకాశం), వివిస్ ప్రసాద్ (తణుకు), నూనె రమేష్ (అల్లూరి జిల్లా), రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులుగా బోగెల ఉమా మహేశ్వరరావు (శ్రీకాకుళం), జి.ఎల్.ఎన్. శాస్త్రి (అనకాపల్లి) నియమితులయ్యారు. రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శిగా బైరపోగు బెన్నమ్మ (కర్నూలు), మహిళా కార్యదర్శులుగా శ్యామల శ్రీహరికోటి (ఏలూరు), సువర్ణ జోషి (కర్నూలు), కరణం విమల (చిత్తూరు), ఇళ్లిపిల్ల నాగపావని (విజయవాడ), ఏలూరు ధర్మవతి (భీమిలి)లను ఎంపిక చేశారు. రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శులుగా హరిత (పీలేరు), కోలకొండ వీర నాగేశ్వరయ్య(కర్నూలు)లను నియమించారు.

## విధ్వంసం కోరుకునే మనస్తత్వం జగన్‌ది



గుంటూరు, అక్టోబరు 31 ప్రభాతవార్త ప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మొంథా తుపాను నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకోవడం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం వలనే ప్రాణనష్టాన్ని తగ్గించగలిగామని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అన్నారు. శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యంగా గుడిసెల్లో నివసించే వారిని వెంటనే గుర్తించి, పునరావాస శిబిరాలకు తరలించి వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించినట్టు తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్ సహకారంతో వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురాగలిగామని వివరించారు. ఈ విజయం అంతా ప్రభుత్వ అప్రమత్తత, నిరంతర పర్యవేక్షణ వల్లే సాధ్యమైందని స్పష్టం చేశారు. ఇలాంటి ఆపద సమయంలో ప్రభుత్వానికి ప్రజలకు అండగా ఉండాల్సిన ప్రతిపక్ష నేత జగన్‌మోహన్ రెడ్డి వ్యాఖ్యలు చాలా బాధ కలిగిస్తున్నాయని విమర్శించారు. జగన్ కేవలం రాజకీయ కోణంలోనే మాట్లాడుతున్నారని, ప్రభుత్వంపై బురద జల్లి రాజకీయ ప్రయోజనం పొందాలనే ఆలోచన తప్ప, ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవాలనే ఆలోచన లేదని విమర్శించారు.

## కుప్పం మెడికల్ కాలేజీలో విద్యార్థి ఆత్మహత్య

**మృతుడు కర్నూలు జిల్లా డోన్ వాసి**

కుప్పం, అక్టోబరు 31 ప్రభాతవార్త: కుప్పం పిఇఎస్ వైద్య కళాశాలలో పి.జి. కోర్సు చదువుతున్న వైద్య విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గుడుపల్లె ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు వివరాలిలా.. కర్నూలు జిల్లా డోన్ పట్టణంకు చెందిన హర్షవర్ధన్ చౌదరి (25) స్థానిక పిఇఎస్ వైద్య కళాశాలలో పి.జి. (అనస్తీషియా) కోర్సు మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సహచర విద్యార్థులతో కూడా మాట్లాడేవాడు కాదన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం హర్షవర్ధన్ ఎంతసేపటికీ తన గది నుంచి బయటకు రాకపోగా అనుమానం వచ్చి విద్యార్థులు, సిబ్బంది చూడగా హర్షవర్ధన్ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడన్నారు. హుటాహుటిన ఐసియుకు తరలించగా హర వర్ధన్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. కాగా హర్షవర్ధన్ మత్తు మందును అధికంగా తీసుకున్నట్లు గుర్తించామన్నారు. మృతుడి తల్లిదండ్రులకు సమాచారం అందించి మృతదేహాన్ని పంచనామాకు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, మంత్రులు, ఎమ్మెల్యే

# నేడు కదిరికి సిఎం చంద్రబాబు

**ఏర్పాట్లు పరిశీలించిన ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పెందుర్తి, మంత్రులు, ఎమ్మెల్యేలు**

కదిరి, అక్టోబరు 31 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నేడు (శనివారం) కదిరి నియోజకవర్గంలోని తలుపుల మండలం పెద్దన్నవారిపల్లి గ్రామానికి వస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటన, భద్రత ఏర్పాట్లను శుక్రవారం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత, స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పరిశీలించారు. హెలీప్యాడ్ ప్రదేశం, భోజన వసతి ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లు సమీక్షించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఎటువంటి లోపం లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పోలీసు అధికారులకు సూచనలు చేస్తూ ముఖ్యమంత్రి పర్యటన మార్గం, హెలీప్యాడ్, పెన్షన్ పంపిణీ చేసే లబ్దిదారుల కాలనీ, పార్కింగ్ ప్రాంతాల్లో సమగ్ర బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అనంతపురం డిఐజిని ఆదేశించారు. వాహనాల నియంత్రణ, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. వీరితోపాటు జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్‌బాబు, పార్టీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, జాయింట్ కలెక్టర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ కొమ్ము సంపత్‌కుమార్, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గుప్త నిధులనుకొంటే సత్తురేకును చూపించారు

**ఉమ్మడి చిత్తూరు జిల్లా కోటూరులో ఘటన**

చౌడేపల్లి, అక్టోబరు 31 ప్రభాతవార్త: కొండను తవ్వి ఎలకను పట్టినంత పనైంది... అడవిలో గొర్రెకాపరులకు బంగారం దొరికిందన్న పుకార్లు చక్కర్లు కొట్టింది... చివరకు వారినుంచి సత్తురేకును చూసి అందరూ అవాక్కయ్యే పరిస్థితికి వచ్చింది... ఇంతటి దానికా ఇంత ప్రయాస పడ్డామనుకొన్నారు పెద్దమనుషులు, పోలీసులు... ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటనా పూర్వాపరాల్లోకి వెళితే.. చౌడేపల్లి మండలంలోని పెద్దకొండామర్రి పంచాయతీ కోటూరుకు చెందిన నరసింహులు, చానుళ్ళా 3రోజుల క్రితం గొర్రెలను సమీపంలోని నరసింహుల స్వామి కొండ అడవిలోకి మేతకు తీసుకెళ్ళారు. అడవిలోని చీకలదడి ప్రాంతంలో గొర్రెలకు చెక్కను సేకరించే ప్రయత్నం చేయసాగారు. పొదల మాటున వారిద్దరికీ చిన్నపాటి మట్టికుండా కనిపించింది. వెంటనే దాన్ని తీసుకున్నారు. దాన్ని పరిశీలించి చూడగా ఒక సత్తురేకు కనిపించింది. ఆ రేకు బంగారం అనుకొని ఇద్దరు రహస్యంగా ఇంటికి తీసుకొచ్చారు. పంపకంలో తేడాలు రావడంతో ఇద్దరు గొడవ పడ్డారు. గొడవ ఆ నోట ఈ నోట పడి గొర్రెల కాపరులకు అడవిలో 5కిలోల బంగారం దొరికిందనీ, పంపకాల్లో తేడా వచ్చి విషయం బయటకు వచ్చిందని పుకార్లు షికారు చేసాయి. దీంతో వారికి దొరికింది బంగారం కాదనీ, సత్తురేకని మునస్వామి, చానుళ్ళా పెద్దమనుషుల వద్ద పంచాయతీ పెట్టారు. అడవిలో దొరకింది బంగారమే అన్న వాదన బలపడటం, లేకుంటే పెద్దమనుషులు ఎందుకు కలుగ చేసుకొంటారన్న అనుమానం అందరిలో కలిగింది. చివరకు కథ పోలీసుల చెంతకు చేరింది. ఇద్దరు వ్యక్తులను పిలిపించగా వారు తమకు అడవిలో దొరికింది సత్తు రేకేనని తెలపడంతో చేసేది లేక పోలీసులు వారిని ఇళ్ళకు పంపేశారు.

## పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

**సిఎం చంద్రబాబుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ**



విజయవాడ, అక్టోబరు 31 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లేఖ రాశారు. రైతులకు రుణాలు, ఎరువులు అందిస్తూ, ధాన్యం కొనుగోలు, తదితర ముఖ్య సేవలు చేస్తున్న 7 వేల మంది పిఎసిఎస్ ఉద్యోగుల వేతనాలు తదితర సమస్యలు పరిష్కారం కాకుండా 6 సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సిఎం చంద్రబాబు జోక్యం చేసుకుని వారి సమస్యలు పరిష్కరించాలని వి.శ్రీనివాసరావు కోరారు.

## బాలికపై వృద్ధుడి లైంగిక దాడి

**తిరుపతి జిల్లా గూడూరులో ఘటన**

గూడూరు, అక్టోబరు 31 ప్రభాతవార్త: గూడూరు గవర్నమెంట్ హాస్పిటల్‌లో 8 ఏళ్ళ బాలికపై 50 ఏళ్ల వృద్ధుడు హత్యాచారయత్నం ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. హాస్పిటల్‌లో ఓ వ్యక్తి చికిత్స పొందుతుండగా అతనికి అటెండెంట్‌గా ఉన్న కుమార్తె పై అదే వార్డులో మరో పేషంట్ అటెండర్‌గా ఉన్న జమీర్ అనే వృద్ధుడు అత్యాచారం యత్నానికి పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని వెల్లడించారు. నిందితుడుపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ మనోహర్ ఆచారి, డిఎస్పీ గీత కుమారి, సిఐ శేఖర్ బాబు, సిబ్బంది ఉన్నారు.

31-10P□g7exHMNWJQE 11 GNT_31-10P□g7exHMNWJQE.qxd 01/Nov/25 1:42 AM Page 1



# జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిల్ రసాభాస

- చైర్మన్, కూటమి కౌన్సిలర్లపై అవినీతి ఆరోపణలు
- వైఎస్సార్సీ కౌన్సిలర్ మనోహర్‌పై 3 నెలల సస్పెన్షన్

జగ్గయ్యపేట, అక్టోబరు 31 ప్రభాతవార్త: ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గంద్రగోళ పరిస్థితులతో రసాభాసగా మారింది. కూటమి కౌన్సిలర్లు, చైర్మన్‌లతో వాగ్వాదపడిన వైఎస్ఆర్సీపి కౌన్సిలర్ వట్టెం మనోహర్‌ను మూడు నెలలపాటు సస్పెండ్ చేసినట్లు చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ప్రకటించారు. శుక్రవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశానికి చైర్మన్ రాఘవేంద్ర అధ్యక్షత వహించారు. అజెండాలోని పలు అంశాలపై చర్చ ప్రారంభం కాగా 5వ వార్డు వైఎస్ఆర్సీపి కౌన్సిలర్ వట్టెం మనోహర్ పలు ఆరోపణలు చేశారు. నాలుగు అంశాల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు సంబంధించి కొడవళ్లు, కత్తులు, పళ్ళ దంతెలు, ప్లాస్టిక్ టబ్బులు కొనుగోలుకు ఒక్కో అంశంలో దాదాపు రూ.5 లక్షలు అంచనావేస్తూ ప్రతిపాదించారని, అన్నింటికి కలిపి రూ.20 లక్షల అవినీతికి పాల్పడాలని యోచిస్తూ ఇలా ప్రతిపాదించారని ఇది పెద్ద అవినీతి అంటూ మనోహర్ ఆరోపించారు. ఇందుకు చైర్మన్ రాఘవేంద్ర సమాధానం చెపుతూ ఎజెండాల్లో ఈఅంశాల్లో పొరపాటున వేర్వేరుగా అంశాలుగా అధికారులు పెట్టారని, సమావేశానికి ముందే అధికారులు ఈ తప్పిదం గురించి చెప్పారని, అన్నింటికి కలిపి రూ.5 లక్షల వరకు మాత్రమే అవుతుందని వివరణ ఇచ్చారు. దీంతో ఇలా ఎజెండాల్లో తప్పుగా ముద్రణ వచ్చిన విషయాలను ముందే సమావేశంలో ప్రకటించాలని, తాను ప్రశ్నించబట్టి ఇప్పుడు ఇలా వివరణ ఇస్తున్నారు లేకుంటే రూ.20 లక్షల పనులు జరిగాయని, నిధులు డ్రాచేసేవారంటూ తిరిగి ఆరోపించారు. ఈ అంశంపై చైర్మన్ కౌన్సిలర్ల మధ్య చర్చ జరుగుతున్న సందర్భంలో టిడిపి కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, పేరం సైదేశ్వరరావు, వెంకట్, కంచేటి గీతారాణి తదితర కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం తెలిపారు. అవినీతి పనులు గతంలో జరుగలేదా అంటూ టిడిపి కౌన్సిలర్లు ప్రశ్నించిన సందర్భంలో కౌన్సిలర్ మనోహర్ స్వరం పెంచి గతం గురించి మాట్లాడే అర్హత చైర్మన్‌కు లేదు, కూటమి కౌన్సిలర్లకు లేదంటూ వ్యాఖ్యానించారు. చైర్మన్ రాఘవేంద్ర పదేపదే వారిస్తున్నా మనోహర్ వినకుండా అవినీతి పనులు చేస్తున్నారు, ప్రశ్నిస్తే సహించలేకపోతున్నారంటూ మండిపడ్డారు. మనోహర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని, చైర్మన్ స్థానాన్ని అగౌరవపర్చటంపై సస్పెండ్ చేయాలని టిడిపి కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. గతంలో అవినీతి జరిగినట్లు భావించినా అప్పుడు చైర్మన్ ఇప్పుడు చైర్మన్ ఒకరేనని, పార్టీ మారి పదవితో ఉన్నారని మనోహర్ చేసిన వ్యాఖ్యలు సభలో గందరగోళ పరిస్థితులకు దారితీశాయి. క్షమాపణ చెప్తారా, సస్పెండ్ చేయమంటారా అంటూ చైర్మన్ రాఘవేంద్ర ప్రశ్నించటంతో మనోహర్ తాను క్షమాపణ చెప్పే ప్రసక్తేలేదని స్పష్టంచేశారు. దీంతో మూడు నెలలపాటు మనోహర్‌ను సమావేశాల నుండి బహిష్కరించినట్లు వెల్లడిస్తూ ఐదు నిముషాల విరామం ఇస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. తాను అభ్యంతరం తెలిపిన అంశాలపై, అవినీతి జరుగుతుందన్న ఆరోపణలపై మనోహర్ లిఖితపూరకంగా కమిషనర్ కృష్ణారావుకు డీసెంట్ సమర్పించి సభ నుండి వెళ్ళిపోయారు.



కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ రాఘవేంద్ర, కూటమి కౌన్సిలర్లు, వైఎస్ఆర్‌సిపి కౌన్సిలర్ మధ్య వాగ్వాదం

## వల్లభాయ్ పటేల్ 150వ జయంతి

పెదకూరపాడు, అక్టోబర్ 31 ప్రభాతవార్త : మండలంలోని లగడపాడు గ్రామంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి వేడుకను శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు నండూరి సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ లగడపాడు బ్రాంచ్ మేనేజర్ గంగాధర్ పాల్గొని స్వతంత్ర భారత తొలి హోంమంత్రిగా దేశాన్ని ఐక్యం చేసి మనలో సమైక్య స్ఫూర్తిని నింపిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ అని ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు బహూకరించారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు

రాజుపాలెం, అక్టోబర్ 31 ప్రభాతవార్త : మండలంలోని కోట నెమలిపురి గ్రామ మండల ప్రాథమిక పాఠశాల ఎస్సీ కాలనీ నందు శుక్రవారం ఆయుష్ వైద్య శిబిరం డాక్టర్ ఆర్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ శ్రీనివాస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యోగా టీచర్ వెంకటరమణ, ఆయుష్ సిబ్బంది లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## ఇందిరాగాంధీ వర్ధంతి

సత్తెనపల్లి, అక్టోబర్ 31 ప్రభాతవార్త : పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 41వ వర్ధంతి, మాజీ ఉప ప్రధాని సర్దార్



వల్లభాయ్‌పటేల్ 150వ జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. నాయకులు చుక్కా చంద్రపాల్ దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్, మాదంశెట్టి వేదాద్రి, చాంద్‌బాషా, ఆరిఫ్, ఆనంద్, అబ్రహం, జెట్టి శేఖర్, కొత్త లక్ష్మయ్య, జల్లెల పాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయాలి

పెదకూరపాడు, అక్టోబర్ 31 ప్రభాతవార్త : కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయాలని పటాన్ నాగుల్‌మీరా అన్నారు. మండల కేంద్రమైన పెదకూరపాడులో హమాలీల్ గోడౌన్ వద్ద ఏఐటియుసి 106వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏఐటియుసి పతాకాన్ని ఆవిష్కరించారు. హమాలీల్ సంఘం నాయకులు తేల ప్రసాదు సుధాకర్, రతన్‌రాజు, ఏడుకొండలు, చిన్ని శేఖర్, యాకోబు, శివకోటి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులు స్వీకరించిన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, అక్టోబర్ 31 ప్రభాతవార్త : పట్టణంలోని ప్రజా వేదిక నందు శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని ప్రజల నుండి సమస్యలతో కూడిన వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## జాయింట్ కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే కన్నా



సత్తెనపల్లి, అక్టోబర్ 31 ప్రభాతవార్త : జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు శుక్రవారం జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ జాయింట్ కలెక్టర్ సూరజ్‌గనోరేకు పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం వారు నియోజకవర్గానికి సంబంధించి పలు అంశాలను చర్చించారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, అక్టోబర్ 31 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికాశుక్లాను శుక్రవారం ఎమ్మెల్యే కన్నా



లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్‌కు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. వారు నియోజకవర్గానికి సంబంధించి పలు అంశాలను చర్చించారు.

## ఏఐటియుసి 106వ వ్యవస్థాపక దినోత్సవం

సత్తెనపల్లి, అక్టోబర్ 31 ప్రభాతవార్త : ఏఐటియుసి 106వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పలు చోట్ల ఏఐటియుసి జెండాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. సత్తెనపల్లి - అమరావతి బస్‌స్టాప్ వద్ద ఏపి ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏఐటియుసి జెండాను ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కంబాల శ్రీనివాస్ ఆవిష్కరించారు. పిడబ్ల్యూడివర్క్‌షాప్ అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద ఏఐటియుసి జెండాను న్యాయవాది, ఏఐటియుసి నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు నరిశేటి వేణుగోపాల్ ఆవిష్కరించారు. బస్టాండ్ వద్ద ఏఐటియుసి జెండాను ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి యల్లమంద ఆవిష్కరించారు. ఏపిఎస్ఆర్టీసీ అండ్ హయ్యర్ బస్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జెండాను ఏఐటియుసి పట్టణ ప్రధాన కార్యదర్శి ఇసీరెడ్డి అంజిరెడ్డి ఆవిష్కరించారు. సిపిఐ పట్టణ కార్యదర్శి వి.లక్ష్మీ చెన్నకేశవరావు, ఏఐటియుసి పట్టణ అధ్యక్షులు డిఆర్ మస్తాన్, యూనియన్ నాయకులు మరియదాసు, సాంబయ్య, బ్రహ్మానందం, పాల్గొన్నారు.

# తుపాను బాధిత రైతులను ఆదుకోండి

- తడిసిన ధాన్యం కొనాలి
- వరికి ఎకరాకు రూ.30వేల పరిహారం ఇవ్వాలి
- పండ్లతోట రైతులకు వంద శాతం పరిహారాన్ని అందించాలి
- సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ



అనంతపురం, అక్టోబరు 31 ప్రభాతవార్త బ్యూరో: రాష్ట్రంలో తుపాను బాధిత రైతాంగాన్ని తక్షణం ఆదుకోవాలని, నష్టపోయిన పంటలను అంచనా వేసి పరిహారం అందించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్. శుక్రవారం సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ మొంథా తుపాను బాధిత రైతాంగాన్ని తక్షణం ఆదుకోవాలని కోరారు. మెట్ట ప్రాంత రైతులు సైతం తీవ్రంగా నష్టపోయారని, వరిపంట నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ.30 వేలు చొప్పున పరిహారం అందించాలని కోరారు. పండ్ల తోటల రైతులకు వంద శాతం పరిహారం ఇవ్వాలని, తడిసిన ధాన్యం లెక్క కట్టి ప్రతి గింజకు పరిహారం అందించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక తెప్పించుకొని కేంద్రానికి పంపిన విషయాన్ని గుర్తు చేస్తూ ఏరియల్ సర్వే చేస్తే సరిపోదని, రైతులకు పరిహారం ఎంత అందించారనేది ముఖ్యమన్నారు. క్షేత్రస్థాయికి సిపిఐ బృందాలు వెళ్లి రైతాంగం నష్టపోయిన సమాచారాన్ని ప్రభుత్వానికి అందిస్తామన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్యాయాన్ని ప్రశ్నిస్తానంటూ రాజకీయాల్లోకి వచ్చి సీజ్ ద షిప్ అని చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తూ అక్రమంగా తరలిపోతున్న బియ్యాన్ని పట్టుకున్నారా అని ప్రశ్నించారు. సత్యసాయిబాబా వంద జన్మదిన వేడుకలకు ఆరుగురు రాష్ట్ర మంత్రులను నియమించి ప్రభుత్వం ఆధ్వర్యంలో పనులు చేపట్టడం ఎంత మాత్రమూ సబబు కాదన్నారు.

### నవంబర్ 18న నిరసన ర్యాలీలు

దేశవ్యాప్తంగా దళితులు, పేద ప్రజలు, బలహీన వర్గాలపై దాడులు పెరుగుతున్నాయని, ఇది సామాజిక న్యాయ వ్యవస్థకు తీవ్రమైన ప్రమాదమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమాన హక్కులు సాధనకు కట్టుబడి ఉన్న సీపీఐ నవంబర్ 18వ తేదీన దేశవ్యాప్తంగా నిరసన ర్యాలీలు నిర్వహించేందుకు పిలుపునిచ్చింది. ఈ నిరసనల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు బలహీన వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సీపీఐ విజ్ఞప్తి చేసింది. విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.జాఫర్, జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి, సహాయ కార్యదర్శులు చిరుతల మల్లికార్జున, జె.రాజారెడ్డి,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.కేశవరెడ్డి, ఎన్.శ్రీరాములు, కార్యవర్గ సభ్యులు బి.రమణయ్యలు పాల్గొన్నారు.

# చిన్నారిపై కామాంధుల దాడి

## పోలీసుల అదుపులో నిందితులు

చౌటుప్పల్, అక్టోబరు 31, ప్రభాతవార్త: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని ముక్కుపచ్చలారని మూడున్నరేళ్ల బాలికపై ఇద్దరు కామాంధులు లైంగికదాడికి పాల్పడిన ఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ వలస కూలీ జంట జీవనోపాధి నిమిత్తం వలసవచ్చి స్థానిక పరిశ్రమలో పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. వీరి ఇంటి పక్కనే మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దినేష్ (42), శివరాజ్ (45) నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో బాలిక రోడ్డుపై ఆడుకుంటూ ఉండగా, నిందితులు ఆమెకు మిఠాయిలను చూపి మోసపూరితంగా ఇంటిలోకి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డారు. బాలిక కేకలు వేయడంతో సమీపంలో ఉన్నవారు అక్కడికి చేరుకొని తలుపు పగులగొట్టి చిన్నారిని రక్షించారు.

స్థానికులు ఆగ్రహంతో నిందితులను చితకబాదిన అనంతరం పోలీసులకు అప్పగించారు. బాలికను చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధిత బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ, వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఇదిలా ఉండగా వలస కూలీలు నిత్యం గంజాయి మత్తులో తూలుతూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వలస కార్మికులు నివాసముండే ప్రాంతాలపై పోలీసు అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తమకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

# నారా భువనేశ్వరికి గోల్డెన్ పీకాక్ అవార్డు

- ప్రజాసేవ, సామాజిక ప్రభావంలో కృషికి గుర్తింపు
- 4న లండన్‌లో ప్రదానం



అమరావతి, అక్టోబరు 31 ప్రభాతవార్త ప్రతినిధి: సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ప్రజాసేవ సామాజిక ప్రభావం అంశంలో చేసిన కృషికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందారు. భారత్‌లోని ప్రముఖ సంస్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ ఆమెను డిస్టింగ్విష్ ఫెలోషిప్ 2025 అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డుకు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. ప్రజా సేవ, సామాజిక ప్రభావం, నాయకత్వం వంటి అంశాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులకు ప్రతీ ఏటా ఈ అవార్డులకు ఐఓడీ ఎంపిక చేస్తుంది. 2025 ఏడాదికి గానూ డిస్టింగ్విష్ ఫెలోగా ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీగా ఉన్న నారా భువనేశ్వరిని ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ డిస్టింగ్విష్ ఫెలోషిప్ అవార్డును ఇవ్వాలని నిర్ణయించింది. 4న లండన్‌లో జరిగే గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌లో భువనేశ్వరి ఈ అవార్డును స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న వ్యాపార, సామాజిక, పరిపాలనా రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొననున్నారు. ఇంతకు ముందు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, హిందూజా గ్రూప్ కోఛైర్మన్ గోపీచంద్ హిందూజా, ఆదిత్య బిర్లా గ్రూప్ కమ్యూనిటీ ఇనిషియేటివ్స్ ఛైర్‌పర్సన్ రాజశ్రీ బిర్లా వంటి ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తులు అందుకున్నారు. ప్రస్తుతం ఆమె నేతృత్వం వహిస్తున్న ఎన్టీఆర్ ట్రస్టు, విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత, విపత్తు సహాయం లాంటి అంశాల్లో సేవ కార్యక్రమాలను నిర్వహిస్తోంది... ప్రజలకు సేవలం దిస్తోంది. ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, ఎన్టీఆర్ విద్యార్థి సహాయ పథకాలు, విపత్తు నిర్వహణ సేవలు, మహిళల ఆర్థిక స్వావలంబన కార్యక్రమాలు ప్రజల మన్ననలు పొందాయి. ప్రత్యేకించి తలసేమియా రోగులకు ఉచితంగా బ్లడ్ ట్రాన్స్ ఫ్యూజన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమాల ద్వారా సమాజానికి చేరువైన సీఎం సతీమణి నారా భువనేశ్వరి ప్రజాసేవా నాయకురాలిగా పేరు తెచ్చుకున్నారు. హెరిటేజ్ ఫుడ్స్ కు కార్పోరేట్ గవర్నెన్సు ఎక్సలెన్స్ లో గోల్డెన్ పీకాక్ అవార్డు నారా భువనేశ్వరి మహిళా నాయకత్వానికి స్ఫూర్తిగానూ నిలుస్తున్నారు. కార్పోరేట్ సంస్థ హెరిటేజ్ ఫుడ్స్ కు వైస్ ఛైర్ పర్సన్, ఎండీగా ఉన్న ఆమె... ఆ సంస్థను పారదర్శకత, సామాజిక బాధ్యతతో నడిపిస్తున్నారు. దేశంలోనే ప్రతిష్టాత్మక డెయిరీ బ్రాండ్ గా హెరిటేజ్ సంస్థను తీర్చిదిద్దారు. సంస్థ ఎదుగుదల, నూతన ఉత్పత్తుల ఆవిష్కరణలతో పాటు కోట్ల మంది వినియోగదారులకు హెరిటేజ్ ఉత్పత్తులు చేరువ చేయటంలో నారా భువనేశ్వరిది కీలక పాత్ర. ప్రత్యేకించి హెరిటేజ్ ద్వారా రైతుల సాధికారితకు పెద్ద పీట వేస్తున్నారు.

వాణిజ్య రంగంలో ఆమె అందిస్తున్న సేవలకు గానూ దేశంలోని అత్యంత శక్తివంతమైన మహిళా వ్యాపారవేత్తల్లో నారా భువనేశ్వరి ఒకరని 2013లోనే ఫార్చ్యూన్ ఇండియా పేర్కొంది. ఎఫ్ఎంసీజీ రంగంలో అత్యుత్తమ కార్యకలా పాలను నిర్వహిస్తున్న హెరిటేజ్ ఫుడ్స్‌కు దక్కిన ఎక్సెలెన్స్ ఇన్ కార్పోరేట్ గవర్నెన్సు విభాగంలో గోల్డెన్ పీకాక్ అవార్డును ఆ సంస్థ వీసీఎండీ హోదాలో నారా భువనేశ్వరి అందుకోనున్నారు. లండన్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఐఓడీ నుంచి ప్రతిష్టాత్మక అవార్డును ఆమె స్వీకరించనున్నారు.



# 393 అంబాసిడర్‌తో అనుబంధాన్ని గుర్తు చేసుకున్న సీఎం సీబీఎన్

అమరావతి, అక్టోబరు 31 ప్రభాతవార్త ప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను మూడు దశాబ్దాల క్రితం ఉపయోగించిన అంబాసిడర్ కారును పరిశీలించి, ఆ కారుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 393 నెంబరుతో ఉండే ఈ అంబాసిడర్ కారు చంద్రబాబు నాయుడు సొంత వాహనం. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా 393 నెంబర్ ఉన్న అంబాసిడర్ కాన్వాయిలో ముఖ్యమంత్రి రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించేవారు. 393 అంబాసిడర్ అంటేనే సీబీఎన్ బ్రాండ్ కార్ అనేలా ఈ కారు గుర్తింపు పొందింది. ప్రస్తుతం నాలుగోసారి సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు... భద్రతా పరంగా ఆధునిక వాహనాలు వినియోగిస్తున్నా... తన సొంత కారు అయిన నాటి అంబాసిడర్ ను మాత్రం అపురూపంగానే చూసుకుంటున్నారు. ఇప్పటి వరకు హైదరాబాదులో ఉన్న ఈ కారును అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఇకపై ఉంచనున్నారు. పార్టీ కార్యాలయానికి వచ్చి... తిరిగి వెళ్తున్న సమయంలో ఆనాడు తాను వాడిన అంబాసిడర్ కారును చంద్రబాబు పరిశీలించి... ఆ కారులో తన ప్రయాణ స్మృతులను గుర్తు చేసుకున్నారు.

## కేంద్రమంత్రి పాశ్వన్ జన్మదిన వేడుకలు

సత్తెనపల్లి, అక్టోబర్ 31 ప్రభాతవార్త : ఆప్ కీ బార్ యువ బీహార్ లాగే ఆప్ కి బార్ బహుజన రాజ్యాధికారం కోసం లోక్ జనశక్తి పార్టీ జాతీయ అధ్యక్షులు, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ 43వ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పరివర్తన ఆశ్రమ పాఠశాలలో జరిగిన వేడుకల్లో లోక్ జనశక్తిపార్టీ జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. జొన్నలగడ్డ విజయ్‌కుమార్ కేక్ కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. నాయకులు మహంకాళి వెంకట్రావు, కొరబండి రాబర్ట్, జొన్నలగడ్డ సంజయ్‌కుమార్, షేక్.సుభాని, కొరబండి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కన్నా సమీక్షా సమావేశం

సత్తెనపల్లి, అక్టోబర్ 31 ప్రభాతవార్త : పట్టణంలోని 9వ వార్డు నందు శుక్రవారం టిడిపి ముఖ్య నాయకులు, సచివాలయ అధికారులతో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే రూ.50 లక్షలతో వార్డులో అభివృద్ధి పనులు చేశామన్నారు. అలాగే వార్డులో శానిటేషన్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వార్డులో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలన్నారు.

# పటేల్ దృఢ సంకల్పం నేటి తరానికి ఆదర్శం

- ఐక్యత రన్‌ను ప్రారంభించిన మెగాస్టార్ చిరంజీవి
- తెలంగాణ డిజిపి శివధర్‌రెడ్డి, సిపి సజ్జన్నార్ హాజరు



హైదరాబాద్ (బేగంపేట), అక్టోబరు 31 ప్రభాతవార్త : భారతదేశ ఉక్కు మనిషి అఖండ భారత్ నిర్మాత సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా రాష్ట్రీయ ఏక్తాదివస్ (జాతీయ ఐక్యతా దినోత్సవం) జరుపు కుంటున్న సందర్భంగా ఐక్యత రన్‌ను నిర్వహించారు. రాష్ట్ర ఏక్తా దివస్ 2025లో భాగంగా నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర మాజీ మంత్రి, మెగాస్టార్ కొణిదెల చిరంజీవి హాజరై రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రీయ ఏక్తా దివస్ హైదరాబాద్ సిటీ పోలీసు ఆధ్వర్యంలో నిర్వహించిన రన్‌ఫర్ యూనిటీ అనే కార్యక్రమంలో డిజీపీ శివధర్‌రెడ్డి, హైదరాబాద్ నగర పోలీసు కమీషనర్ సజ్జనార్ హాజరయ్యారు. వీరితోపాటు సందీప్ శాండిల్య, యంయం భగవత్,విసి సజ్జనార్, తఫ్సీర్ ఇక్బాల్, జోయల్ డేవిస్, కె.శిల్పవల్లి, కె.అపూర్వరావు, ధార కవిత, లావణ్యానాయక్‌జాదవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీమంత్రి, సినీహీరో చిరంజీవి మాట్లాడుతూ 560 ముక్కలైన దేశాన్ని ఒక్కటిచేసి వన్ నేషన్‌ను మనకు అందించిన గొప్పవరం సర్దార్ పటేల్ అని తెలిపారు. యూనిటీ ఇన్ డైవర్సిటీ అనే పటేల్ సందేశాన్ని పోలీసులు ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయ మన్నారు. డీప్ ఫేక్ అనేది పెద్ద గొడ్డలిపెట్టు లాంటిదని, ఈ సమస్యను డిజిపి శివధర్‌రెడ్డి, హైదరాబాద్ సిపి సజ్జనార్ సీరియస్‌గా తీసుకుని స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, ప్రజలకు పోలీసు లు అండగా ఉన్నారని ధైర్యం చెప్పారు.

### జాతీయ ఐక్యత కోసం స్ఫూర్తిగా తీసుకోవాలి: డిజిపి బి.శివధర్‌రెడ్డి

డీజీపీ బి.శివధర్‌రెడ్డి మాట్లాడుతూ ఇది కేవలం పరుగు మాత్రమే కాదని, అందరూ జాతీయ ఐక్యత కోసం స్ఫూర్తిగా తీసుకోవాల్సిన కార్య క్రమం అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ తన పట్టుద లతో 560కు పైగా ముక్కలైన సంస్థా నాలను ఏకతా టిపైకి తెచ్చి దేశాన్ని బలోపేతం చేసారని కొని యాడారు.

### మంచి సమాజ నిర్మాణానికి పాటుపడాలి: సిపి విసి సజ్జనార్

హైదరాబాద్ నగర పోలీసు కమీషనర్ వి.సి. సజ్జనార్ మాట్లాడుతూ యువత సర్దార్ వల్ల భాయ్ పటేల్‌ను ఆదర్శం గా తీసుకుని మంచి సమాజ నిర్మాణం కోసం పాటుపడాలని తెలిపారు. సైబర్ నేరాల విషయంలో ప్రజలు ఆందోళణ చెంద వద్దన్నారు. ముఖ్యంగా డీప్‌ఫేక్ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని సైబర్ నేరస్థుల మూలాలపై దృష్టి సారించామన్నారు. పిల్లలు 5000, 10,000 కోసం సైబర్ నేరస్థులకు మ్యూల్ అకౌంట్స్ ఇవ్వడం వల్ల వారు చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది కాబట్టి జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సిటీ పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# భారత్-అమెరికాల మధ్య పదేళ్ల కాలానికి రక్షణరంగ ఒప్పందం

**కౌలాలంపూర్, అక్టోబరు 31:** అమెరికా భారత్‌లమధ్య ట్రేడ్‌వార్ జరుగుతున్న తరుణంలో రెండుదేశాలమధ్య పదేళ్లకాలానికి రక్షణరంగంలో పరస్పర సహకారం మరింత పటిష్టంచేసుకోవాలన్న ఒప్పందం జరిగింది. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, అమెరికా రక్షణ మంత్రి పీటర్ హెగ్సెత్‌లమధ్య జరిగిన చర్చల అనంతరం ఈ ఒప్పందంపై సంతకాలుజరిగాయి. భారత్ అమెరికా రక్షణ భాగస్వామ్యంలో అన్ని అంశాలను ఈ ఒప్పందం స్పృశిస్తుందని అన్నారు. వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఇదొక కీలక సంకేతలమని అన్నారు. ద్వైపాక్షిక సంబంధాల్లో రక్షణరంగం అనేది కీలకంగా నిలుస్తోంది. ఇండోపసిఫిక్ ప్రాంతంలో నిబంధనల ఆధారిత స్వేచ్ఛాయుత సహకారం అనేది కొనసాగుతుందని రక్షణ మంత్రి తన ఎక్స్ సందేశంలో పేర్కొన్నారు. ఈ ఒప్పందం వల్లప్రాంతీయ స్థిరత్వం, అశాంతికి కళ్లెం పడుతుందని ఆశాభావం వ్యక్తంచేసారు. రక్షణరంగంలో అధునాతన టెక్నాలజీ భాగస్వామ్యం, సాంకేతిక సహకారం కూడా పెరుగుతాయని, దీనివల్ల రెండు దేశాలమధ్య అధునాతన రక్షణ సాంకేతికతను బదలీచేసుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. ఆగ్నేయాసియా రక్షణమంత్రుల సమావేశం సందర్భంగా రెండుదేశాల రక్షణమంత్రులు కౌలాలంపూర్‌లో భేటీ అయ్యారు. బ్రూనే, కంబోడియా, ఇండోనేసియా, లావోస్, మలేసియా, మైన్మార్, ఫిలిప్పైన్స్, సింగపూర్, థాయిలాండ్, టిమోర్‌లెస్టే, వియత్నాం దేశాలు ఈకూటమిలో ఉన్నాయి. వీటితోపాటు ఎనిమిది దేశాలు భాగస్వాములుగా అంటే చర్చల భాగస్వాములుగా భారత్, అమెరికా, చైనా, రష్యా, జపాన్, దక్షణకొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలున్నాయి.

# మహిళల వరల్డ్ కప్.. భారత్, సౌతాఫ్రికా ఫైట్




## 2న తుది సమరం

**న్యూఢిల్లీ:** ఐసిసి ఉమెన్స్ వరల్డ్ కప్-2025 చివరి దశకు చేరుకుంది. మొత్తం 30 రోజుల పాటు ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లు, కొన్ని షాకింగ్ ఫలితాల తర్వాత ఫైనలిస్ట్‌లు ఎవరనేది తేలింది. నవంబర్ 2న నవీ ముంబైలో జరగనున్న ఫైనల్‌లో భారత్, సౌతాఫ్రికామధ్య టైటిల్‌కోసంతుది సమరం జరగనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాపై టీమిండియా చారిత్రక, ప్రపంచ రికార్డు విజయం సాధించడంతో ఈ ఫైనల్ ఖరారైంది. దీంతో 25 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత మహిళా క్రికెట్‌కు ఒక కొత్త ఛాంపియన్ లభించడం ఖాయమైంది. వరల్డ్ కప్ సెప్టెంబర్ 30న గౌహతిలో భారత్, శ్రీలంక మ్యాచ్‌తో ప్రారంభమైంది. అక్టోబర్ 30న డీవై పాటిల్ స్టేడియంలో టోర్నమెంట్ రెండో సెమీ ఫైనల్ జరిగింది. ఈమ్యాచ్‌లో ఆస్ట్రేలియా మొదట బ్యాటింగ్ చేసి 338 పరుగుల భారీ స్కోరు సాధించింది. అయితే జెమిమా రోడ్రిగ్జ్ రికార్డు సెంచరీ, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌అద్భుత ఇన్నింగ్స్ సహాయంతో టీమిండియా 5వికెట్ల తేడాతో ఈ మ్యాచ్ గెలిచి ఫైనల్‌లో స్థానం సంపాదించింది. అలాగే సౌతాఫ్రికా మొదటి సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్‌ను ఓడించింది. ఇక టీమిండియా వరల్డ్ కప్ ఫైనల్‌కు చేరుకోవడం ఇది మూడోసారి. ఇంతకు ముందు 2017లో చివరిసారి ఫైనల్‌ఆడింది. అయితే మొట్ట మొదట 2005లో భారతజట్టు వరల్డ్ కప్ గెలుచుకునే అవకాశం దగ్గర వరకు వచ్చింది. గత రెండు ఫైనల్స్‌లోనూ భారత జట్టు ఓటమిని ఎదుర్కొంది. 2005లో ఆస్ట్రేలియా చేతిలో, 2017లో విజయం అంచున ఇంగ్లాండ్ చేతిలో ఓడిపోయింది. కాగా, సౌతాఫ్రికా తొలిసారిగా వరల్డ్‌కప్ ఫైనల్‌కు చేరుకుంది. అంతకుముందు, 2017, 2022లో రెండు సార్లు ఇంగ్లాండ్ చేతిలోఓడిపోయింది. కానీ ఈసారి లారా వోల్వార్ట్ కెప్టెన్సీలో ఆఫ్రికా జట్టు దూసుకొచ్చింది. మరోపక్క మహిళా క్రికెట్‌కు కొత్త ఛాంపియన్ లభించబోతోంది. సరిగ్గా 25 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మహిళా వరల్డ్ కప్ ఫైనల్‌లో కొత్త ఛాంపియన్‌ను నిర్ణయించనున్నారు. ఇంతకు ముందు 2000లో ఇలా జరిగింది. అప్పుడు న్యూజిలాండ్ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను ఓడించి తొలిసారిగా, ఏకైకసారి టైటిల్‌ను గెలుచుకుంది. అంతకు ముందు, ఆతర్వాత కూడా కేవలం ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ మాత్రమే అన్ని టైటిళ్లను గెలుచుకున్నాయి. ఈ విధంగా ప్రపంచ క్రికెట్‌కు నాల్గవ ఛాంపియన్ జట్టు లభించనుంది.





### డబ్ల్యూటిఎ చెన్నై ఓపెన్-2025

## ముగిసిన భారత్ పోరు

### సహజ, శ్రీవల్లి ఔట్

**న్యూఢిల్లీ:** డబ్ల్యూటిఎ చెన్నై ఓపెన్-2025లో భారత యువ టెన్నిస్ స్టార్లు సహజ, శ్రీవల్లి నిష్క్రమణతో భారత సింగిల్స్ ప్రచారం ముగిసింది. యమలపల్లి సహజ మరియు భమిడిపాటి శ్రీవల్లి ఇద్దరూ ప్రిక్వార్టర్ ఫైనల్స్ రెండవ రౌండ్‌లో వరుస సెట్లలో ఓడిపోయారు. సహజను క్రొయేషియాకు చెందిన ప్రపంచ 78వ ర్యాంకర్ డోనా వెకిక్ 2-6, 2-6 తేడాతో ఓడించింది. అదే సమయంలో, శ్రీవల్లిని ఆస్ట్రేలియాకు చెందిన 7వ సీడ్ కింబర్లీ బిరెల్ 5-7, 6-7 చేతిలో చిత్తుగా ఓడిపోయింది. శ్రీవల్లి తొలి సెట్‌లో 1-5 వద్ద రెండు బ్రేక్‌లు డౌన్ తర్వాత అద్భుతమైన పునరాగమనం చేసి, బిరెల్‌పై వరుస బ్రేక్‌లు గెలుచుకోవడం ద్వారా స్కోరును 5-5తో సమం చేసింది. కానీ తర్వాత బిరెల్ 11వ గేమ్‌లో మరో బ్రేక్ సాధించి, తొలి సెట్‌ను 7-5తో ముగించింది. రెండవ సెట్‌లో ఇద్దరు ఆటగాళ్లకు చెరో నాలుగు బ్రేక్‌లు వచ్చాయి. దీని ఫలితంగా 6-6 సెట్ తో టై అయింది. విజేతను నిర్ణయించడానికి టైబ్రేక్ వచ్చింది. ఇందులో అనుభవజ్ఞుడైన ఆస్ట్రేలియన్ శ్రీవల్లిని 6-2 తేడాతో ఓడించింది. దీంతో మూడేళ్లలో భారత్ యొక్క మొదటి ఇబ్ల్యూటిఎ ఈవెంట్ అయిన 2025 చెన్నై ఓపెన్ సింగిల్స్ విభాగంలో భారత్ యొక్క ప్రచారం కూడా ముగిసింది. మరోవైపు, సహజ మరో నిరాశను ఎదుర్కొంది. ఆమె జర్మనీకి చెందిన కరోలిన్ వెర్నర్‌తో కలిసి తన డబుల్స్ మ్యాచ్‌ను 6-3, 3-6, 7-10తో మూడు సెట్లలో ఓడిపోయింది.

### రెండో టీ20లో..

## టీమిండియా ఘోర ఓటమి

### ఆస్ట్రేలియా ఘనవిజయం




**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా పర్యటనలో టీ20 సిరీస్‌ను కూడా టీమ్‌ఇండియా ఓటమితో ఆరంభించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం అడిలైడ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో భారత్ నిర్దేశించిన 126 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఆసీస్ ఆరు వికెట్లు కోల్పోయి 13.2 ఓవర్లలోనే ఛేదించింది. స్వల్ప లక్ష్య ఛేదనను ఆసీస్ ఘనంగా ఆరంభించి 4 ఓవర్లకే 49 స్కోర్ చేయగా, ఐదో ఓవర్లో వరుణ్ ట్రావిస్ హెడ్‌ను పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత మిచెల్ మార్ష్ జోరందుకున్నాడు. కుల్దీప్ వేసిన ఓవర్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 20 పరుగులు బాదాడు. అదే ఓవర్ ఆఖరి బంతికి క్యాచ్ ఔట్ అయ్యాడు. టిమ్ డేవిడ్ (1)ను కూడా వరుణ్ పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత జోష్ ఇంగ్లిష్‌ను (20 రన్స్) కుల్దీప్ ఔట్ చేశాడు. 13వ ఓవర్లో ఆసీస్ విజయానికి 5 పరుగులు అవసరం కాగా, తొలి 3 బంతులకు 3 పరుగులు వచ్చాయి. 4, 5 బంతులకు బుమ్రా వరుసగా 2 వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 18.4 ఓవర్లలోనే 125 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఒకవైపు టపటపా వికెట్లు పడుతున్నా మరోవైపు ఓపెనర్ అభిషేక్ శర్మ (23 బంతుల్లో 68) బౌండరీలతో స్కోర్‌ను పెంచాడు. అతడితోపాటు హర్షిత్ రాణా (33 బంతుల్లో 35) రాణించాడు. 125 రన్స్‌లో ఈ ఇద్దరివే 103 ఉన్నాయి. మిగిలిన తొమ్మిది మంది సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యారు. శుభ్‌మన్ గిల్ (5), సంజు శాంసన్ (2), సూర్యకుమార్ యాదవ్ (1), తిలక్ వర్మ (0), అక్షర్ పటేల్ (7), శివమ్ దూబె (4), కుల్దీప్ యాదవ్ (0), జస్ప్రీత్ బుమ్రా (0) ఎవరూ ఆకట్టుకోలేదు. ముగ్గురు బ్యాటర్లు పరుగుల ఖాతా తెరవకముందే డకౌట్ అయ్యారు. దీంతో 125 పరుగులకే భారత్ ఇన్నింగ్స్ ముగిసింది.




### హైలో ఓపెన్-2025లో

## కిరణ్ సంచలనం

### క్వార్టర్ ఫైనల్స్‌కు లక్ష్య, రక్షిత, ఆయుష్

**న్యూఢిల్లీ:** హైలో ఓపెన్-2025లో భారత క్రీడాకారుడు కిరణ్ జార్జ్ ప్రపంచ 13వ ర్యాంక్ పోపోవ్‌ని ఓడించి సంచలనంసృష్టించాడు. అలాగే లక్ష్యసేన్, రక్షిత, ఆయుష్ శెట్టి క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించారు. హైలో ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో 25 యేళ్ల కిరణ్ జార్జ్ అద్భుతమైన పునరాగమనం చేసి పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో చోటు దక్కించుకున్నాడు. 69 నిమిషాల పాటు జరిగిన ఈ హోరాహోరీ పోరులో ప్రపంచ 38వ ర్యాంకర్ కిరణ్ 18-21, 21-18, 21-19 తేడాతో విజయం సాధించాడు. ఒడిశా ఓపెన్ (2022), ఇండోనేషియా మాస్టర్స్ (2023) లను కైవసం చేసుకుని రెండుసార్లు సూపర్ 100 విజేత అయిన కిరణ్ తదుపరి ఇండోనేషియాకు చెందిన జోనాటన్ క్రిస్టీ లేదా చైనీస్ తైపీకి చెందిన చి యు జెన్‌తో తలపడతాడు. ఇక లక్ష్యసేన్, రక్షిత రమేష్ కూడా అద్భుతమైన విజయాలతో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. 2021 ప్రపంచ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత లక్ష్య, ఎస్. సుబ్రమణియన్‌ను 21-14, 21-11 తేడాతో ఓడించగా, రక్షిత 58 నిమిషాల ఆల్ ఇండియన్ పోటీలో 19-21, 21-8, 21-13 తేడాతో శ్రీయాన్షి వాలిశెట్టిని ఓడించింది. లక్ష్య తదుపరి మ్యాచ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన నాల్గవ సీడ్ అలెక్స్ లానియర్‌తో తలపడనుండగా, రక్షిత డెన్మార్క్‌కు చెందిన లైన్ క్రిస్టోఫర్‌సెన్‌తో తలపడనుంది. అలాగే ఆయుష్ శెట్టి 21-11, 21-11 తేడాతో సింగపూర్‌కు చెందిన మాజీ ప్రపంచ ఛాంపియన్ లోహ్ కీన్ యూను ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు.

### పారిస్ ఓపెన్ ఎటిపి మాస్టర్స్-1000 సిరీస్

## భారత్ డబుల్స్ స్టార్ యూకీ ఓటమి



**న్యూఢిల్లీ:** పారిస్ ఓపెన్ ఎటిపి మాస్టర్స్-1000 సిరీస్ టోర్న మెంట్‌లో భారత్ డబుల్స్ టెన్నిస్ నంబర్ వన్ యూకీ బాంబ్రీ కథ ముగి సింది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో యూకీ బాంబ్రీ (భారత్)- అడమ్ పావ్లాసెక్ (చెక్ రిపబ్లిక్) ద్వయం 4-6, 7-6 (7/5), 7-10తో సూపర్ టైబ్రేక్‌లో రెండో సీడ్ జూలి యన్ క్యాష్-లాయిడ్ గ్లాస్‌పూల్ (బ్రిటన్) జోడీ చేతిలో ఓడిపోయింది. 1 గంటా 42 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ-పావ్లాసెక్ మూడు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తొలి సర్వీస్‌లో 49 పాయింట్లకు గాను 36 పాయింట్లు, రెండో సర్వీస్‌లో 27 పాయింట్లకు గాను 14 పాయింట్లు సాధించారు. తమ సర్వీస్‌ను రెండు సార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేశాడరు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిన యూకీ-పావ్లాసెక్‌లకు 26,275 యూరోలు (రూ.26 లక్షల 94 వేలు) ప్రైజ్ మనీతో పాటు, 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

వాణిజ్యం

## మోస్తరు నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

### వారాంతంలో సెన్సెక్స్, నిఫ్టీల్లో అనిశ్చితి




**ముంబయి, అక్టోబరు 31:** గ్లోబల్ అనిశ్చితులు, ట్రేడ్ వార్, ట్రంప్ సుంకాలు వంటి వాటితో దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతంలో ఒకమోస్తరు నష్టాలతో ముగిసాయి. శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ 237.17 పాయింట్లు క్షీణించి 83,938.71 పాయింట్ల వద్ద ట్రేడింగ్‌ముగిస్తే నిఫ్టీ 50 సూచీ 73.05 పాయిం ట్లు క్షీణించి 25,722.10 పాయిం ట్లవద్దట్రే డింగ్ నిలిపి వేసింది. బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.96శాతం పెరిగింది. స్మాల్‌క్యాప్ సూచీ కూడా .0.67శాతం మేర పెరిగినట్లు తేలింది. వివిధ సూచీల పరంగా ప్రైవేటు బ్యాంకుల్లో కోటక్ మహీంద్ర 3.79 శాతం క్షీణించింది. నికరలాభాలు తగ్గడమే ఇం దుకుకారణం. 3343.72 కోట్లనుంచి 3253 కోట్లకు పడిపోయింది. కోఫోర్జ్ 1.50 శాతంపెరిగింది. కంపెనీ లాభాలు మద్దతు పలికాయి. వరుణ్‌బేవరేజెస్ 1.89శాతం పెరిగి లాభాలు 18.5శాతం వృద్ధిని నమో దుచేసాయి. టాటాక్యాపిటల్ ఒకటిశాతం పెరిగింది. సూరాజ్ ఎస్టేట్ డెవలపర్స్ 5.49శాతం ర్యాలీ తీసాయి. నికరలాభాలు నాలుగు శాతం పెరిగి 33.1 కోట్లకు చేరింది. శ్రీసిమెంట్ 1.29శాతం క్షీణించింది. అదే దారిలో వేదాంత కూడా నడిచింది. 0.42శాతం షేరు విలువలు దిగజారాయి. ఇక గ్లోబల్ మార్కెట్లప రంగా యూరోపియన్ సెంట్రల్ బ్యాంకు తన రెపోరేట్‌ను రెండుశాం గానే ఉంచింది. దక్షిణ కొరియా మూడో త్రైమాసిక జిడిపి గణాంకాలు 1.7శాతంపెరిగి అక్కడి మార్కెట్లకు ఊతం ఇచ్చాయి. జపాన్ సెంట్రల్ బ్యాంకు కూడా తన రెపోరేట్లను 0.5శాతంవద్దనే స్థిరంగా కొనసాగించింది. అమెరికా ఫెడ్ రిజర్వు బుధవారం బెంచ్ మార్కు ఫెడ్ రిజర్వురేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 3.75శాతానికి చేర్చిన సంగతి తెలిసిందే. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 88.69వద్ద నిలిచింది. ఇక నిఫ్టీలో ప్రభుత్వరంగ బ్యాంకులసూచీ 1.56శాతం పెరిగింది. యూనియన్ బ్యాంకు 4.46శాతం, కెనరా బ్యాంకు 3.09శాతం, పంజాబ్‌నేషనల్ బ్యాంకు 2.33 శాతం చొప్పున పెరిగాయి. గడచిన ఏడాది కాలంగా నిఫ్టీ ప్రభుత్వ బ్యాంకుల సూచీ 22శాతం వరకూ పెరిగింది. అదే నిఫ్టీ 50సూచీ 6.27శాతంమాత్రమే పెరి గింది. ఇక నిఫ్టీలో మీడియా సూచీ 1.32శాతం, మెటల్‌సూచీ 1.09శాతం చొప్పున పెరిగాయి.

## రూ.10వేల కోట్లు సాయం చేయండి

**ముంబయి, అక్టోబరు 31:** అహ్మదాబాద్ ఎయి రిండియా విమాన ప్రమాదం తర్వాత ఎయి రిండియాకు అనేక షాకులు తగులుతు నష్టాలు చవిచూస్తోంది. వీటినుంచి బయటపడేందుకు రూ.10వేల కోట్లు ఆర్థిక సాయం అందించాలని టాటాసన్స్,సింగపూర్ ఎయిర్‌లైన్స్‌లను ఎయిరిండియా కోరినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఎయిరిండియాలో టాటాగ్రూప్‌నకు 74.9శాతం వాటా ఉంది. మిగిలిన వాటా సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కే ఉంది. విమాన భద్రత, ఇంజినీరింగ్, నిర్వహణ వ్యవస్థలను సరిచేయడంతోపాటు సేవలను మెరుగు పరుచుకునేందుకు ఈనిధులు కావాలని అభ్య ర్థించినట్లు తెలుస్తోంది. అయితే ఈ ప్రతిపా దన చర్చలరూపంలోనే ఉంది.సింగపూర్ ఎయిర్‌లైన్స్ మాత్రం ఎయిరిండియా పునర్ వ్యవస్థీకరణకు టాటాగ్రూప్‌తో కలిసి పనిచే స్తామని ప్రకటించిందన్న వార్తలు వెలువడ్డాయి.

## ఫోర్డ్ ప్లాంట్‌లో 'పవర్‌ట్రైన్స్' ఉత్పత్తి

### రూ.3250 కోట్ల పెట్టుబడితో 2029కల్లా తయారీ షురూ




**చెన్నై, అక్టోబరు 31:**అమెరికా ఆటోమొబైల్‌కంపెనీ ఫోర్డ్ తన చెన్నై ప్లాంట్‌లో పవర్‌ట్రైన్స్ ఉత్పత్తికోసం రూ.3250 కోట్లు పెట్టుబడులు పెడుతున్నట్లు తేలింది. కంపెనీ ఇందుకోసం తన మరైమలైనగర్ ఫ్యాక్టరీని వినియోగిస్తోంది. నగరశివార్లలో ఉన్న ఎగుమతుల హబ్‌లో ఈ ప్లాంట్ ఉంది. 2.35 లక్షలయూనిట్లు సామర్థ్యంతో ఏర్పాటుచేస్తోంది. 2029 నుంచి ఉత్పత్తిని ప్రారంభించాలన్న లక్ష్యం నిర్దేశించుకుంది. తమిళనాడు ప్రభుత్వంతో కంపెనీ ప్రతినిధులు గత ఏడాది సెప్టెంబరులోనే ఒక అవగాహన ఒప్పందంపై సంతకాలుచేసారు. సీనియర్ కంపెనీ ఎగ్జిక్యూటివ్‌లు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్‌ను కలిసారు. ప్రస్తుత యంత్రసామగ్రిని ఎగుమతులకు వీలైన ఇంజిన్లను తయారీకి అనుగుణంగా మారుస్తుందని తెలుస్తోంది. తమిళనాడు ప్రభుత్వం తమకు అన్నివిధాలా సహకరిస్తోందని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. తమ భవిష్యత్తు ఉత్పత్తులు మరింత వృద్ధిని సాధించేదిశగా తమిళనాడు ప్రభుత్వ సహకారం ఉందని వారు హర్షం ప్రకటించారు. చెన్నై ప్లాంట్‌లో తయారయ్యే ఇంజిన్లు ఎగుమతి మార్కెట్లకు నిర్దేశించినవేనని, దేశీయ అవసరాలకు సైతం ఉపయోగపడేవిధంగా ఉంటాయని కంపెనీ చెపుతోంది. ఈప్లాంట్ కార్యకలాపాలు ప్రారంభిస్తే చెన్నైలో ఆటోమొబైల్‌హబ్‌గా రూపొందే అవకాశం ఉందని, నిపుణులైన వర్కర్లు, ఇన్వెస్టర్లకకు సానుకూల వాతావరణం ఉంటుందని అందువల్లనే తమిళనాడు పారిశ్రామిక హబ్‌గా మారేందుకు ఎంతో అవకాశం ఉందని పరిశ్రమల మంత్రి టిఆర్‌బి రాజా అన్నారు. చెన్నై పోర్టుకు 50 కిలోమీటర్ల దూరంలోను, ఎన్నూరు పోర్టుకు 74 కిలోమీటర్ల దూరంలో మరైమలైనగర్ ఫ్యాక్టరీ ఉంది. అందుకోసమే ఫోర్డ్ ఈ యూనిట్‌ను ఎంచుకుంది. అలాగే బెంగళూరుకు కూడా రోడ్డుమార్గంలో కూడా పోవచ్చు. ఫోర్డ్ కంపెనీ భారత్‌లో పదిలక్షలమందికిపైగా కస్టమర్లు ఉన్నారు. సర్వీస్, ఆఫ్టర్ మార్కెట్ పార్టులు, వారంటీ సపోర్టు వంటివి అందిస్తోంది. ఇపుడున్న పెట్టుబడితో 600మందికి ఉపాధి కల్పిస్తుందని, తమిళనాడు యూనిట్‌లో సుమారు 12 వేల మందిని నియమించుకున్నట్లు అంచనా.

### ఎసిసి నికరలాభం


## రూ. 119.26 కోట్లు

**చెన్నై, అక్టోబరు 31:** చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న సిమెంట్ తయారీ కంపెనీ ఎసిసి తన రెండోత్రైమాసికంలో ఐదు రెట్లు నికరలాభం ఆర్జించింది. 1119.26 కోట్లు వచ్చిందని కంపెనీ స్టాక్ ఎక్ఛేంజిలకు నివేదిక ఇచ్చింది. కంపెనీ సమిష్టిగా నికరలాభం గత ఏడాది ఇదే త్రైమాసికంలో కేవలం 199.7 కోట్లుమాత్రమే రాగా ఈ ఏడాది ఐదురెట్లు అధికంగా లాభాలు ఆర్జించింది. రాబడులపరంగా చూస్తే గత ఏడాది 4542.23 కోట్లు వస్తే ఈ ఏడాది 5896.16కోట్లు ఆర్జించింది. ఇక ఈ త్రైమాసికంలో మొత్తం వ్యయాలు చూస్తే గత ఏడాదికంటే పెరిగాయి. గత ఏడాది 4473.67 కోట్లు రూపాయలుకాగా ఈ ఏడాది రూ.5393.42 కోట్లుగా వెల్లడించారు. ఇక సిమెంట్ ఇతర అనుబంధ సేవలరంగంలో రాబడులు 5519.18 కోట్లువరకూ రాబట్టింది.

## జీఎస్టీ తొలగింపుతో పెరుగుతున్న ఆరోగ్యబీమా పాలసీలు

**ముంబయి, అక్టోబరు 31:** ఆరోగ్య బీమా పథకాలపై కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీని తొలగించడంతో ప్రజల్లో హెల్త్ ఇన్సూరెన్స్ పట్ల ఆసక్తి గణనీయంగా పెరిగింది. ఫలితంగా, కొత్తగా ఆరోగ్య బీమా పాలసీలు తీసుకునే వారి సంఖ్య ఏకంగా 38 శాతం మేర వృద్ధి చెందినట్లు ప్రముఖ ఆన్‌లైన్ ఇన్సూరెన్స్‌సంస్థ పాలసీ బజార్ తన వెల్లడించింది. జీఎస్టీ ఎత్తివేత సామాన్యులకు ఊరటనివ్వడమే కాకుండా, బీమా ప్రాముఖ్యతను కూడా పెంచిందని తెలిపింది. పాలసీలు తీసుకునే వారి సంఖ్య పెరగడంతో పాటు, వారు ఎంచుకునే బీమా కవరేజీ మొత్తం కూడా భారీగా పెరిగింది. గతంలో సగటున రూ.13 లక్షల కవరేజీతో పాలసీలు తీసుకునేవారు, ఇప్పుడు దానిని రూ.18 లక్షలకు పెంచుకున్నారు. కొత్తగా బీమా తీసుకుంటున్న వారిలో దాదాపు 45 శాతం మంది రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల మధ్య కవరేజీ ఉన్న పాలసీలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. మరో 24 శాతం మంది రూ.10లేదా 15 లక్షల కవరేజీని, 18 శాతం మంది రూ.10 లక్షల లోపు కవరేజీని ఎంచుకుంటున్నారు. ఇప్పటికే ఆరోగ్య బీమా కలిగిన వారు కూడా జీఎస్టీ తొలగింపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.తమ పాత పాలసీలకు అదనపు సదుపాయాలను జోడించుకుంటూ కవరేజీని పెంచుకుంటున్నారు.

ముఖ్యంగా, 61ఏళ్ల పైబడిన వృద్ధుల్లో అధికకవరేజీ ఉన్న పాలసీలపై ఆసక్తి 11.5శాతం పెరిగింది. కేవలం నగరాల్లోనే కాకుం డా, చిన్నపట్టణాల్లోనూ ఆరోగ్య బీమాపై అవగాహన, ఆసక్తి పెరుగుతున్నాయని పాలసీ బజార్ నివేదిక తెలిపింది. దేశవ్యాప్తంగా ఆరోగ్య బీమాకు ఆదరణ పెరగడానికి కేంద్రం తీసుకున్న జీఎస్టీ మినహాయింపు నిర్ణయమే ప్రధాన కారణమని నివేదిక తేల్చిచెప్పింది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14